www.prajasakti.com
PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 39 సంచిక : 19 Vol No | విజయవాడ, ఆదివారం 20 జనవరి 2019 | 12 + స్నేహ + 12 పేజీలు వెల : 5.00 Rs.

ట్రాన్స్‌జెండర్స్‌కు ఎల్ఎల్ఆర్

రాష్ట్ర చరిత్రలోనే మొదటిసారి

కడప జిల్లా రికార్డ్

2



మెక్సికోలో పైప్‌లైన్ పేలి 66మంది సజీవ దహనం

9

జెఇఇలో తెలుగు విద్యార్థుల హవా

- టాప్ 15లో ఐదుగురు తెలుగు విద్యార్థులు
- నాలుగో స్థానంలో ఎపికి చెందిన చేతన్‌రెడ్డి
- ఇండోర్‌కు చెందిన ధృవ్ అరోరాకు ప్రథమ స్థానం
- దేశవ్యాప్తంగా 15 మందికి వందశాతం పర్సంటైల్



ధృవ్ అరోరా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించే జేఇఇ మెయిన్స్ ఫలితాలు విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో తెలుగు విద్యార్థులు ఎప్పటిలాగే అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. దేశ వ్యాప్తంగా 15 మంది విద్యార్థులు వంద శాతం పర్సంటైల్ (ఎన్‌టిఏ స్కోర్) 100 శాతం సాధించగా...వారిలో ఐదుగురు తెలుగు విద్యార్థులే కావడం విశేషం. ఏపీ నుంచి ఒకరు, తెలంగాణ నుంచి నలుగురు విద్యార్థులు ఉన్నారు. ఏపీ నుంచి బొజ్జ చేతన్ రెడ్డి నాలుగో స్థానంలో నిలవగా, తెలంగాణకు చెందిన అదెల్లి సాయికిరణ్ మూడో స్థానంలో నిలిచాడు. ఆ తరువాత ఇందుకూరి జయంత్ ఫణిసాయి, విశ్వంత్.కె ఏడు, ఎనిమిది స్థానాల్లో నిలిచారు. ఇక బట్టెపాటి కార్తికేయ 12 స్థానంలో నిలిచాడు. ఇదిలావుంటే మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌కు చెందిన ధృవ్ అరోరా ప్రథమ స్థానంలో నిలవగా, మహారాష్ట్రకు చెందిన రాజ్ ఆర్యన్ అగర్వాల్ రెండో స్థానంలో నిలిచాడు. ఎన్ఐటీలు, ట్రిపుల్ఐటీలు, కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహకారంతో నడిచే సాంకేతిక విద్యాసంస్థల్లో ప్రవేశాలతో పాటు జేఇఇ అడ్వాన్స్‌డ్‌కు అర్హత పొందేందుకుగాను జెఇఇ మెయిన్స్‌ను విద్యార్థులు ప్రతిష్టాత్మకంగా తీసుకుంటారు. దీంతో విద్యార్థులపై భారం భారం పడకుండా ప్రతి ఏటా రెండు సార్లు నిర్వహించాలని కేంద్రం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో మొదటి విడత మెయిన్స్ పరీక్షలు ఈ నెల 8 నుంచి 12 వరకు నిర్వహించారు. తొలిసారిగా ఆన్‌లైన్ విధానంలో నిర్వహించిన మెయిన్స్‌కు దేశ వ్యాప్తంగా 9,29,198 మంది దరాఖాస్తు చేసుకోగా, 8,74,469 మంది పరీక్షకు హాజరయ్యారు. ఇందుకోసం మిగతా 9లో

బిజెపి హటావో



కమల దళంతో దేశానికి ప్రమాదం
ఐక్యతా ర్యాలీలో విపక్ష నేతలు
సంఘీభావ లేఖ పంపిన రాహుల్

కోల్‌కతా : 'బిజెపి దేశానికి ప్రమాదకరంగా మారింది. మోడీ ప్రభుత్వాన్ని సాగనంపాలి. రానున్న ఎన్నికల్లో ఆ పార్టీని ఓడిస్తే సరిపోదు. కూకటి వేళ్లతో సహా పెకిలించాలి. అప్పుడే దేశానికి రక్ష' అని పలు ప్రతిపక్ష పార్టీలకు చెందిన నేతలు పిలుపునిచ్చారు. కోల్‌కత్తాలో శనివారం ఐక్యతా ర్యాలీ జరిగింది. టిఎంసి ఆధ్వర్యంలో నిర్వహించిన జరిగిన ఈ కార్యక్రమానికి దేశ వ్యాప్తంగా పలు బిజెపియేతర పార్టీల నాయకులు హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్‌గాంధీ సంఘీభావ సందేశాన్ని పంపారు. సామాజిక న్యాయం, లౌకిక వాద పరిరక్షణ ఆధారంగా అభివృద్ధి చెందిన భారతీయ ప్రజాస్వామ్య వ్యవస్థను నరేంద్రమోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం ధ్వంసం చేస్తోందని ఈ లేఖలో పేర్కొన్నారు. ఈ విధ్వంస కాండకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలన్నీ ఏకమవుతున్నాయని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ తరపున హాజరైన ఆ పార్టీ సీనియర్ నేత మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ . మోడీ, షాల కారణంగా నాశనమవుతున్న ప్రజాస్వామ్యం, లౌకిక విలువలు, భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవాలని అన్నారు. పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి కాలం చెల్లిందని. ప్రజలు ఆ పార్టీని సాగనంపేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. విభజించి పాలించే రాజకీయాలను దేశ ప్రజలు విశ్వసించరని అన్నారు. ప్రధాని ఎవరన్న విషయం తామిప్పుడు ఆలోచించడం లేదని, బిజెపిని సాగనంపడమే ప్రధాన లక్ష్యమని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాట్లాడుతూ దేశాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడటమే తమ లక్ష్యమని చెప్పారు. సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా బిజెపి ప్రభుత్వం వ్యవహరిస్తోందని, దేశ ప్రజలను నరేంద్రమోడీ మోసగించారని అన్నారు. ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ మాట్లాడుతూ మోడీ-అమిత్ షాల ద్వయం 2019 ఎన్నికల్లో గెలిచి అధికారంలో కొనసాగితే, దేశ రాజ్యాంగాన్నే మార్చేస్తారని హెచ్చరించారు. . బిజెపి మతం పేరుతో ప్రజలను విభజిస్తోందని, విద్వేషాలు పురికొల్పుతోందని విమర్శించారు. కర్నాటక ముఖ్యమంత్రి కుమారస్వామి మాట్లాడుతూ ప్రాంతీయ పార్టీలుమరింత క్రియాశీలంగా వ్యవహరించాల్సిన కాలం వచ్చిందని అన్నారు. సమాజ్ వాద్ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్ మాట్లాడుతూ దేశ ప్రజలను అన్ని విధాల మిగతా 9లో



ఇద్దరు పిఎన్‌బి డైరెక్టర్లపై వేటు

నీరవ్ మోడీ కేసులో తొలగించిన కేంద్రం

8

ఆర్టీసి జెఎసి ఏర్పాటు

నేడు తొలి సమావేశం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆర్టీసి సిబ్బంది వేతన సవరణతో పాటు కార్మిక సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాన్ని చేపట్టేందుకు అర్టీసిలోని ఎన్ఎంయు మినహా అన్ని సంఘాలతో జెఎసి ఏర్పాటైంది. గుర్తింపు సంఘం ఇచ్చిన సమ్మె నోటీసుకు మద్దతుగా ఆర్టీసి ఇయు రాష్ట్ర కార్యాలయంలో అర్టీసిలోని అన్ని సంఘాలతో ఐక్య సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ప్రభుత్వం తీసుకుంటున్న లోపభూయిష్టమైన విధానాల వల్లే నష్టాలు వస్తున్నాయని, ఈ నష్టాలను ప్రభుత్వమే భరించాలని నాయకులు డిమాండ్ చేశారు. జెఎసి మొదటి సమావేశాన్ని ఆదివారం నిర్వహించనున్నట్లు ఆర్టీసి ఎంప్లాయిస్ యూనియన్(ఇయు) రాష్ట్ర అధ్యక్షులు వైవిరావు, ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదరరావు తెలిపారు. ఇప్పటి వరకూ జరిగిన మూడు సమావేశాలకు ఎన్ఎంయు నాయకత్వాన్ని ఆహ్వానించినా వారు హాజరుకానందున మరో సారి ఆహ్వానించి జెఎసిలో భాగస్వాములు కావాలని కోరుతూ సమావేశంలో తీర్మానించినట్లు చెప్పారు. ఐక్య కార్మిక సంఘాల సమావేశంలో స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యుఎఫ్) ప్రధాన కార్యదర్శి సిహెచ్ సుందరయ్య, కార్మిక పరిషత్ మిగతా 9లో



అమెరికాలో భారీ నిరసనలు

- వైట్ హౌస్ ఎదుట వేలాది మందితో మహిళల మార్చ్
- న్యూయార్క్, లాస్ ఏంజెల్స్‌తో సహా 31 నగరాల్లో ప్రదర్శనలు

వాషింగ్టన్ : ట్రంప్ ప్రభుత్వం అనుసరిస్తున్న మహిళా వ్యతిరేక, , జాతి వివక్ష, వలస వ్యతిరేక విధానాలను, అలాగే పొదుపు చర్యలను నిరసిస్తూ శనివారం నాడు అమెరికా అంతటా భారీ నిరసన ర్యాలీలు నిర్వహించారు. 2017లో ట్రంప్ అధికారంలోకి వచ్చిన తరువాత మహిళలు ఇంత పెద్దయెత్తున నిరసన మార్చ్ నిర్వహించడం ఇదే మొదటిసారి. అధ్యక్ష భవనం వైట్ హౌస్ ఎదుట 50 వేల మందితో ప్రధాన మార్చ్ నిర్వహించారు. న్యూయార్క్, లాస్ ఏంజెల్స్, అట్లాంటాతో సహా 31 నగరాల్లో నిర్వహించిన ర్యాలీల్లో వేలాది మంది మహిళలు పాల్గొన్నారు.

విద్వేషంపై అప్రమత్తం

బిజెపి ఆలయ రాజకీయాలపై టెలికాన్ఫరెన్స్‌లో చంద్రబాబు

పజాశక్తి - అమరావతి బ్యూరో

'ఆలయ రాజకీయాలు చేస్తూ విద్వేషాన్ని రెచ్చగొట్టడానికి బిజెపి ప్రయత్నిస్తోంది. ఈ తరహా కుట్రల పట్ల అప్రమత్తంగా ఉండాలి' అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. ప్రతిపక్ష పార్టీల సమావేశంలో పాల్గొనడానికి కోల్‌కత్తా వెళ్లిన ఆయన అక్కడి నుండే శనివారం పార్టీ శ్రేణులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంత కేరళలో శబరిమల ఆలయం సాకుతో ఉద్రిక్తతలు రెచ్చగొడుతున్నారని, రామాలయాన్ని మళ్లీ తెరమీదకు తెచ్చి దేశ వ్యాప్తంగా చిచ్చు రాజేయడానికి చూస్తున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాల్సినఅవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రస్తుతం మనం చారిత్రక మలుపులో ఉన్నామని, ఈ కూడలిలో ఏమరుపాటుగ ఎంతమాత్రమూ ఉండకూదని చెప్పారు. కర్నాటకలో బిజెపి దుర్మార్గపు రాజకీయం చేస్తోందని, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందన్నారు. ఏపీకి స్పెషల్ ట్రీట్ మెంట్ ఇచ్చామని బిజెపి నేతలు చెప్పడం హాస్యాస్పదమని అన్నారు. 'గాయాలపై కారం చల్లడమేనా స్పెషల్ ట్రీట్ మెంట్ ' అని ఆయన ప్రశ్నించారు 'ఫెడరల్ ఫ్రంట్ అనేది అసలు లేదు. అదొక శూన్యం మాత్రమే. మోదీకి మద్దతు కోసమే ఫెడరల్ ఫ్రంట్. అది అసలు బిజెపికి ప్రతిపక్షమే కాదు.' అని అన్నారు. టిఆర్ఎస్ నేతల ఆంధ్రా ద్వేషాన్ని ప్రచారం చేయాలని , కెసిఆర్, కవిత, హరీష్‌రావు, కెటిఆర్ దుర్భాషలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు చంద్రబాబు సూచించారు. మన రాష్ట్రంపై విషం చిమ్ముతున్న వారితో జగన్ అవలంభిస్తున్న వైఖరిని ఎండగట్టాలన్నారు. కేసుల కోసం మోడీ, అక్రమాస్తుల కోసం కెసిఆర్‌తో లాలూచీ పడ్డారని సిఎం పార్టీ నేతలకు వివరించారు. వైసిపి లాలూచీ రాజకీయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని నేతలను కోరారు. డబ్బులు బాగా ఖర్చుపెట్టే అభ్యర్థుల కోసం వైసిపి వెదుకుతోందని, డబ్బులతోనే జగన్ రాజకీయమని, ప్రజాస్వామ్యాన్ని ధనస్వామ్యంగా వైసిపి చేస్తోందన్నారు.

1.13 లక్షల కోట్లు

- ఇది అమ్ముడుపోని అపార్టుమెంట్ల విలువ

6

కొత్త నీట్ నిబంధనల ఫైల్ అదృశ్యం

వెల్లడించిన మెడికల్ కౌన్సిల్

8



ప్రభుత్వ అనుమతి లేకుండా చార్జిషీటా..!

కన్నయ్య వ్యవహారంపై ఢిల్లీ పోలీసులను ప్రశ్నించిన హైకోర్టు



న్యూఢిల్లీ : జవర్‌హర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీ(జెఎన్‌యు) మాజీ విద్యార్థి నేత కన్నయ్యకుమార్, ఇతరులపై రాష్ట్ర ప్రభుత్వం అనుమతి లేకుండా చార్జిషీటు దాఖలు చేయడంపై ఢిల్లీ పోలీసులపై హైకోర్టు శనివారం మండిపడింది. పార్లమెంట్‌పై దాడి చేసిన అఫ్జల్ గురును దోషిగా నిర్ధారించి..ఉరిశిక్ష విధించడాన్ని నిరసిస్తూ కన్నయ్య, ఇతర విద్యార్థులు నిరసలు చేపట్టారు. అయితే ఈ నిరసనల్లో వారు జాతి విద్రోహ నినాదాలు చేశారని పోలీసులు ఆరోపించారు. ఈ ఘటన చోటుచేసుకున్న మూడు సంవత్సరాల అనంతరం 'దేశ ద్రోహం' కింద కన్నయ్య, ఇతరులపై 1200 పేజీల చార్జీషీట్‌ను మిగతా 9లో

మేత ముప్పు



- యంత్రాలతో వరి కోతలు
- పశుగ్రాసానికి పనికిరాని గడ్డి
- తుపాన్లు, కరువుతో ఫీడ్ కొరత తీవ్రం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

వ్యవసాయంలో భారీ యాంత్రీకరణ పశుగ్రాసం సంక్షోభానికి దారి తీస్తోంది. తుపాన్లు, వాయుగుండాల వంటి విపత్తుల హెచ్చరికలు ముందుకొచ్చిన సందర్భాల్లో సమస్య మరింత తీవ్ర రూపం దాలుస్తోంది. పాడి రైతులను ఎనలేని కష్టాలపాల్జేస్తోంది. ఈ తడవ ఖరీఫ్‌లో తిత్లీ, గజ, పెథాయి తుపాన్లు, అడపాదడపా అల్పపీడనాలు, వాయుగుండాల దరిమిలా వరి రైతులు అనివార్యంగా నూర్పిడి యంత్రాలను ఆశ్రయించారు. వరి అధికంగా సాగయ్యే ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాలతోపాటు మరికొన్ని చోట్ల కూడా ఈ మారు యంత్రాలతోనే కోతలు సాగించారు. భారీ యంత్రాలు కోసిన గడ్డి పశుగ్రాసానికి పనికిరాకుండా పోయింది. సగానికిపైగా రాష్ట్రంలో ఈ సారి తీవ్ర కరువు తిష్ట వేసిన నేపథ్యంలో ఎన్నడూ లేని విధంగా పెద్ద మొత్తంలో గడ్డి వృధా కావడం వలన పశువులకు గడ్డి కొరత ఏర్పడింది. వచ్చే వేసవిలో పశుగ్రాసానికి ఇబ్బంది తప్పదని ప్రభుత్వం భావిస్తోంది. కొరత దాదాపు పది లక్షల టన్నులకుపైనే ఉండొచ్చని అంచనా. రబీలో సైతం కరువు కొనసాగుతుండటంతో గడ్డి సంక్షోభం మరింత ముదురుతోంది.

కూలీల సాకు

ఏడాది పొడవునా నిల్వ చేసేది వరి గడ్డినే. పాడి రైతులు ఎండు గడ్డిపైనే ఎక్కువగా ఆధారపడతారు. కాగా వ్యవసాయ కూలీల కొరతను ఎదుర్కొనే పేరుతో పది పదిహేనేళ్ల నుంచి ప్రభుత్వాలు వ్యవసాయంలో భారీ యంత్రాలను ప్రవేశపెడుతూ వచ్చాయి. కేంద్రానికి సంబంధించిన రాష్ట్రీయ క్రిషి వికాస్ యోజన (ఆర్‌కెవివై) పథకం కింద భారీ యంత్రాలకు పెద్ద మొత్తంలో సబ్సిడీలు ఇవ్వడం మొదలు మిగతా 9లో



వంద శాతం ఉత్తీర్ణత లక్ష్యం

గురుకులాల సిబ్బందికి మంత్రి దిశా నిర్దేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా పనిచేయాలని సాంఘిక, గిరిజన సంక్షేమ గురుకులాల సిబ్బందికి ఆ శాఖ మంత్రి నక్కా ఆనందబాబు దిశానిర్ధేశం చేశారు. శనివారం విజయవాడలోని తన క్యాంపు కార్యాలయం నుంచి గురుకులాలకు చెందిన సుమారు 300 మంది సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గురుకులాల్లో మెరుగైన సదుపాయాలు కల్పిస్తున్నామని, వీటిని సమర్ధవంతంగా వినియోగించుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. సాంఘిక, గిరిజన సంక్షేమ గురుకులాల్లో సుమారు 16 వేల మంది పదవ తరగతి, 15,700 మంది ఇంటర్మీడియేట్ విద్యార్థులు ఉన్నారని వీరందరికీ రెండు నెలల్లో పరీక్షలు సమీపిస్తున్నందున ప్రతి ఒక్కరిపైనా వ్యక్తిగతంగా శ్రద్ధ చూపాలని కోరారు. విద్యార్థి ప్రతిభ ఆధారంగా తర్ఫీదు ఇవ్వాలన్నారు,. ఈ సందర్భంగా గురుకులాల్లో ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి పొందిన 43 మందిని మంత్రి అభినందించారు.



లోక్‌నాయక్ పురస్కార గ్రహీతలతో జాస్తి చలమేశ్వర్, యార్లగడ్డ తదితరులు

ప్రజలకు ఉపయుక్తంగా నిలిచేవారే సెలబ్రెటీలు

సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్

ప్రజాశక్తి-మద్దిలపాలెం, విశాఖ

ప్రజలకు ఉపయుక్తంగా నిలిచిన వారే నిజమైన సెలిబ్రెటీలని సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ అన్నారు. విశాఖలోని కళాభారతి ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన 'లోక్ నాయక్ ఫౌండేషన్' పురస్కార మహోత్సవానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. లాభ నష్టాలను బేరీజు వేయకుండా చేసిందే నిజమైన ప్రజా సేవ అని పేర్కొన్నారు. కీర్తి, డబ్బు సంపాదనపై అందరికీ కోరిక ఉంటుందని, ఇతరులకు సేవలందించిన వారికే కీర్తి దక్కుతుందని తెలిపారు. జయప్రకాష్ నారాయణ్, ఎన్‌టిఆర్ వంటి వారు అనేక రకాలుగా ఆదర్శంగా నిలుస్తారని చెప్పారు. లోక్ నాయక్ ఫౌండేషన్ 15 ఏళ్ళుగా సాహితీకారులను సత్కరించి, ప్రోత్సహించేలా పురస్కారాలు అందజేస్తుందని, నిరంతరం ఇటువంటి కార్యక్రమాలు కొనిసాగించాలని ఆకాంక్షించారు. అంతకుముందు ప్రఖ్యాత తెలుగు సాహిత్యకారుడు, నవల, కథా రచయిత 'అంపశయ్య నవీన్'కు 'తెలుగు జ్ఞానపీఠ్'గా పిలుచుకునే 'లోక్ నాయక్ ఫౌండేషన్ పురస్కారం'ను, బాలల వికాసానికి విశేష కృషి చేస్తున్న ఎన్.మంగాదేవి, వికలాంగులకు, కళా, సాహిత్య, సాంస్కృతిక రంగాలకు సేవలందిస్తున్న వంశీ రామరాజుకు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి లోక్ నాయక్ ఫౌండేషన్ అధ్యక్షులు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ నేతృత్వం వహించారు.



పగలు వేడి.. రాత్రి చలి

ప్రజాశక్తి-గ్రేటర్ విశాఖ బ్యూరో

రాష్ట్రంలో క్రమంగా పగటి ఉష్ణోగ్రతలు పెరగనున్నాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల 29 నుంచి 33.7 డిగ్రీలు చొప్పున నమోదయ్యాయి. అదే సమయంలో రాత్రి వేళల్లో చలి తీవ్రత కొనసాగుతుందని నిపుణులు తెలిపారు. కోస్తా, సీమల్లో అక్కడక్కడా పొగమంచు, చలిమంచు దట్టంగా కురిసే ప్రమాదముందని హైదరాబాద్ వాతావరణ శాఖ హెచ్చరించింది. ఆగ్నేయ బంగాళాఖాతంలో దక్షిణ అండమాన్ సముద్రం, హిందూ మహాసముద్రంలోని భూ మధ్య రేఖా ప్రాంతంలో అల్పపీడన ద్రోణి స్థిరంగా కొనసాగుతోందని ఐఎండి పేర్కొంది. దీని ప్రభావం రాష్ట్రంపై ఉండబోదని తెలిపింది.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.
94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగ పడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి దినపత్రిక, ఎంబి విజ్ఞానకేంద్రం, డోర్.నెం.27-30-4, గవర్నరుపేట, విజయవాడ-520002కు కానీ editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

ప్రజ్ఞ

1. జీనోమ్ వ్యాలీ ఎక్స్‌లెన్స్ అవార్డులు ఎవరికి ప్రకటించారు?
2. ఐసిసి నూతన సిఈవోగా ఎవరు నియామితులయ్యారు?
3. లక్ష్య ఛేదనలో ధోని నాటౌట్‌గా నిలవడం ఇది ఎన్నోసారి?
4. ఏడు ఖండాల్లో ఎత్తైన శిఖరాలను అధిరోహించిన వారు ఎవరు?
5. అడిషనల్ సోలిసిటరీ జనరల్‌గా ఎవరు నియామితులయ్యారు?

సమాధానాలు 7లో

ఆరుగురికి నోటీసులు

షర్మిల కేసులో మొదలైన విచారణలు

- పోస్టులకు కామెంట్లు పెట్టినా శిక్షార్హులే..
- రెండు, మూడు రోజుల్లో అరెస్టులు..?



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వైఎస్ షర్మిలపై సోషల్‌మీడియాతో అభ్యంతరకర పోస్టులు పెట్టిన వారిని సైబర్ క్రైం పోలీసులు జల్లెజపట్టి మరీ వెతుకుతున్నారు. ఇప్పటి వరకు యూట్యూబ్‌లో 60 వీడియో లింకులను పోలీసులు గుర్తించారు. అయితే అవి ఏఏ యూట్యూబ్ ఛానల్స్‌కు సంబంధించినవో తెలుసుకునే పనిలో అధికారులు ఉన్నారు. మరోవైపు ఫేస్‌బుక్, ఇతర సోషల్‌మీడియా సైట్లలోనూ పోస్టులు పెట్టిన 15 మందిని పోలీసులు గుర్తించారు. వీరిలో శుక్రవారం ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించిన పోలీసులు శనివారం మరో ముగ్గురిని విచారించారు. అనంతరం వారందరినీ నిందితులుగా పేర్కొంటూ సిఆర్పీ సి 41 (ఏ) క్రింద నోటీసులు జారీ చేశారు. త్వరలో మరికొంత మందికి నోటీసులు జారీ చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఇదిలావుంటే నోటీసులు అందుకున్న వారంతా తెలుగు రాష్ట్రాల్లో వివిధ ప్రాంతాలకు చెందిన వ్యక్తులు, వీరిలో ఐదుగురు హైదరాబాద్‌లో స్థిరపడి సొంతంగా యూట్యూబ్ ఛానల్స్ నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అయితే షర్మిల ఫిర్యాదు నేపథ్యంలో చాలా మంది కంటెంట్‌ను డిలీట్ చేశారని, అయితే అప్పటికే వీళ్లు పోస్టు చేసిన కంటెంట్‌కు సంబంధించిన ఆధారాలు పోలీసులకు చేరినట్లుగా తెలుస్తోంది. ఇదే సమయంలో కేవలం కంటెంట్ ను పోస్టుచేసిన వాళ్లకే కాదు..కామెంట్లు పెట్టిన వాళ్లను కూడా విచారించాలని సీసీఎస్ పోలీసులు భావిస్తున్నారు. ఫేస్‌బుక్ లో, గూగుల్‌లో చాలా మంది ఫేక్ అకౌంట్లు క్రియేట్ చేసి..వీడియోల క్రింద కామెంట్లు చేసినట్లు పోలీసులు గుర్తించారు. అకౌంట్ ఎలా క్రియేట్ చేశారు..? అకౌంట్ క్రియేట్ చేసే సమయంలో ఏఏ మెయిల్ ఐడి, ఫోన్ నెంబర్‌లు ఇచ్చారనే అంశాలతో పాటు పోస్టులు అప్‌లోడ్ చేసే సమయంలో ఏఏ ఐపి అడ్రస్ ద్వారా ఇంటర్‌నెట్‌ను వినియోగించారనే వివరాలపై పోలీసులు ఆధారాలు సేకరిస్తున్నారు. ఇప్పటికే తగిన సమాచారం కోసం యూట్యూబ్, ఫేస్‌బుక్ పోలీసులు లేఖలు రాయగా, కొన్నింటికి సంబంధించిన ఆధారాలు ఆయా సంస్థలు అందజేసినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఒకటి రెండు రోజుల్లో అరెస్టులు కూడా ఉండే అవకాశం ఉందని పోలీసు వర్గాలు పేర్కొంటున్నాయి.

21న దావోస్‌కు మంత్రి లోకేష్



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ ఎరల్డ్ ఎకనామిక్ ఫోరం వార్షిక సమావేశాల్లో పాల్గొనేందుకు స్విడ్జర్లాండ్‌లోని దావోస్‌కు ఈ నెల 21న వెళ్లనున్నారు. సమావేశాల్లో డెలాయిట్, ప్రోక్టర్ అండ్ గేంబల్, విప్రో, పెగా సిస్టమ్స్, అర్సెలార్ మిట్టల్, నెస్లే, ఎటి అండ్ టి, ఇన్వెస్కో కంపెనీల ప్రతినిధులతో భేటీ అయ్యి రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అవకాశాలను, అనువైన పరిస్థితులను వివరించనున్నారని ఆయన కార్యాలయ అధికారులు శనివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో మొదటి స్థానంలో నిలిచిన రాష్ట్రంలో ప్రభుత్వం అమలు చేస్తున్న పాలసీలు, ఇస్తున్న రాయితీలను ఆయా సంస్థల ప్రతినిధులకు వివరించనున్నారు. ప్రపంచ ఆర్థిక వేదిక కాంగ్రెస్ సెంటర్‌లో 23వ తేదీన ఎజైల్ గవర్నెన్స్, డిజిటల్ గవర్నెన్స్, ఇండి యా 4.0 అంశాలపై, 24న సస్టైనబుల్ మ్యానుఫ్యాక్చరింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ వంటి అంశాలపై ప్రసంగించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రతినిధి బృందంలో వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి పూనం మాలకొండయ్య, ప్రకృతి వ్యవసాయ సలహా దారు టి.విజయ్‌కుమార్, ఇంధన, మౌలిక, పెట్టుబడుల శాఖ ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్, పరిశ్రమల శాఖ కార్యదర్శి ఆరోక్యరాజ్, ఎపిఐఐసి ఎండి అహ్మద్‌బాబు, సమాచారశాఖ కార్యదర్శి బి.రామాంజనేయులు తదితరులు ఉన్నట్లు తెలిపారు.

'అత్యవసర విచారణ అవసరం లేదు'

- హౌస్ మోషన్ పిటీషన్ తిరస్కరణ
- సోమవారం రెగ్యులర్ కోర్టులో విచారణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రతిపక్షనేత వైయస్ జగన్‌మోహన్‌రెడ్డిపై దాడి ఘటన విచారణ సిట్ చేపట్టిందని, ఈ దశలో ఎన్ఐఎ చేయాల్సిన అవసరం లేదని, విచారణ నుంచి ఎన్ఐఎ నుంచి తప్పించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం హైకోర్టులో హౌస్ మోషన్ పిటీషన్ దాఖలు చేసింది. విచారణకు స్వీకరించిన హైకోర్టు చీఫ్ జస్టిస్ ప్రవీణ్‌కుమార్ ఈ దరఖాస్తును అత్యవసరంగా విచారించాల్సిన అవసరం లేదని పిటీషన్‌ను కొట్టివేసింది. తమ వాదన వినిపించుకునేందుకు సోమవారం పిటీషన్ విచారణకు వచ్చేందుకు వీలు కల్పించాలని అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాప్ సిజెకు విజ్ఞప్తి చేశారు. ఈ కేసును సోమవారం రెగ్యులర్ కోర్టులో విచారించేందుకు లిస్టులో పెడుతున్నట్లు న్యాయమూర్తి పేర్కొన్నారు. ఈ కేసు విషయంపై వైసిపి అడ్వకేట్ కోటం సుజాత శర్మ మీడియాతో మాట్లాడుతూ కేసులో కుట్రలు బయటపడతాయని ప్రభుత్వం హడావుడిగా పిటీషన్ వేసిందన్నారు. అత్యవసరంగా పిటీషన్ వేయాల్సిన అవసరం లేదని, ఎన్ఐఎ విచారణలో వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు. మొత్తం మీద ఈ కేసు విచారణ సోమవారం జరుగనుంది. ఎన్ఐఎ విచారణ చేయడమంటే రాష్ట్ర ప్రభుత్వ హక్కులను హరించడమేననే వాదనను టిడిపి బలంగా వినిపిస్తోంది. ఈనేపథ్యంలో సోమవారం కోర్టు ఎటువంటి నిర్ణయాన్ని వెల్లడిస్తుందోననే ఉత్కంఠ ప్రజల్లో నెలకొంది.

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్

కాంట్రాక్ట్ ఉద్యోగుల వేతన పెంపుకు ప్రతిపాదనలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు పెంచేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కలిపి కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు మొత్తం 36 మంది కార్పొరేషన్‌లో పనిచేస్తున్నారు. ప్రస్తుతం వారికి ఇచ్చే మూలవేతనంలో పది శాతం వేతన పెంపుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ పెంపుతో ఆర్థిక శాఖకు ఏడాదికి దాదాపు రూ. 4 లక్షలు అధిక వ్యయమవుతుంది. అయితే కేవలం అతితక్కువ మంది ఉద్యోగులకు వేతనాన్ని పెంచితే, నామమాత్రపు ఖర్చవుతున్నప్పటికీ దీనిపై నిర్ణయం తీసుకోవడంలో అధికారులు తాత్సారం చేస్తున్నారనే విమర్శలువస్తున్నాయి. గతంలోనే వేతన పెంపుపై ప్రతిపాదనలు వచ్చినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడంతో తాజాగా మరోసారి ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపనున్నారు. దీనిపై సోమవారం జరిగనున్న స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సర్వసభ్య సమావేశంలో చర్చించి, అనంతరం ఆర్థిక శాఖ అనుమతి కోరనున్నట్లు తెలుస్తోంది.

వచ్చే ఎన్నికల్లో మందిర్ రాజకీయాలు ప్రభావం చూపలేవు

రాముడిపై కాదు రైతు సమస్యలపై దృష్టి పెట్టండి

మీడియా సమావేశంలో యోగేంద్ర యాదవ్



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

2019 సార్వత్రిక ఎన్నికల్లో రామ మందిర్ రాజకీయాలు ప్రభావం చూపలేవని స్వరాజ్ అభియాన్ పార్టీ జాతీయ అధ్యక్షుడు యోగేంద్ర యాదవ్ పేర్కొన్నారు. అధికార మందిరాన్ని సుస్థిరం చేసుకునేందుకు రామ మందిరంపై దృష్టి సారించడం మానుకోవాలని హితవు పలికారు. మందిర్ రాజకీయాలు ప్రస్తుతం దేశంలో చెల్లవని ఆయన స్పష్టం చేశారు. ఆదివారం నాడిక్కడ స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో యోగేంద్ర యాదవ్ మాట్లాడారు. హిందుత్వ పార్టీలన్నీ రాముడిపై దృష్టి తగ్గించి, రైతు సమస్యలపై పెట్టాలని సూచించారు. దేశంలో రాముడికి ఎన్నో మందిరాలున్నాయని, అయోధ్యలో ప్రత్యేకంగా మందిరం నిర్మించడం వల్ల వచ్చే లాభమేమీ లేదని స్పష్టం చేశారు. లోక్‌సభ ఎన్నికల ముందు రైతు సమస్యలు పెద్ద ఎత్తున చర్చనీయాంశమవ్వడం శుభపరిణామమైన విషయమని అన్నారు. పార్లమెంట్ సమావేశాల్లో రైతులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఇటీవల రాంలీలా మైదానంలో రైతులు చేపట్టిన బహిరంగ సభకు దేశ వ్యాప్తంగా స్పందన వచ్చిందన్నారు. అయితే, రాబోయే ఎన్నికల్లో తాము ఏ పార్టీకి మద్దతు ఇవ్వబోమని వెల్లడించారు. స్వతంత్రంగానే బరిలోకి దిగుతున్నట్టు చెప్పారు. కాంగ్రెస్, బిజెపియేతర ఫ్రంట్‌ల పేరుతో ఏర్పడే వాటికి కూడా తాము ఎటువంటి సహకారం అందించబోమని తెలిపారు. ఎన్నికల ముందు ఏర్పడే ఫ్రంటులతో దేశ ప్రజానీకానికి ఎటువంటి ప్రయోజనం ఉండదని చెప్పారు. మోడీ ప్రభుత్వం అధికారంలో వచ్చాక ఉపాధి కల్పన లేకపోగా, ఉన్న జాబులు కూడా పోయే ప్రమాదం ఏర్పడిందన్నారు. పార్టీ సీనియర్ నేత అవిక్ సాహు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం అధికారంలో వచ్చాక ఉపాధి కల్పన లేకపోగా, ఉన్న జాబులు కూడా పోయే ప్రమాదం ఏర్పడిందన్నారు. రాజ్యాంగ సంస్థలను పూర్తిగా మోడీ సర్కారు నిర్వీర్యం చేస్తుందని విమర్శించారు. ఈ సమావేశంలో పార్టీ నేతలు అనుపమ్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.



ట్రాన్స్‌జెండర్లకు ఎల్ఎల్ఆర్ అందజేస్తున్న కలెక్టర్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి, ఎస్పి

ట్రాన్స్‌జెండర్స్‌కు ఎల్ఎల్ఆర్


- రాష్ట్ర చరిత్రలోనే మొదటిసారి
- కడప జిల్లా రికార్డ్

ప్రజాశక్తి - చాపాడు

రాష్ట్ర చరిత్రలోనే మొట్టమొదటిసారిగా ట్రాన్స్‌జెండర్స్‌కు ఎల్ఎల్ఆర్ లైసెన్స్‌లు జారీ చేసిన జిల్లాగా కడప రికార్డ్ సష్టించింది. కడప జిల్లా చాపాడు మండలం పల్లవోలులోని చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన న్యాయ సేవల శిబిరంలో జిల్లాలోని 32 మంది ట్రాన్స్‌జెండర్లకు ఎల్ఎల్ఆర్ లైసెన్స్ పత్రాలను కలెక్టర్ హరికిరణ్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్, ఎస్పి అభిషేక్ మహంతి పంపిణీ చేశారు. రవాణా శాఖ ద్వారా లైసెన్స్ పొందడానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోడానికి ట్రాన్స్‌జెండర్లు ప్రయత్నించగా లింగ బేదం వద్ద స్త్రీ లేదా పురుషుడు అని మాత్రమే ఉండటంతో దరఖాస్తు చేయడానికి వీల్లేకుండా పోయింది. దీంతో ట్రాన్స్‌జెండర్‌లు జిల్లా జడ్జి శ్రీనివాస్‌ను కలిసి ఆన్‌లైన్లో ఉన్న వివరాలు తెలిపి ట్రాన్స్‌జెండర్లకు కూడా లైసెన్సులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని విన్నవించుకున్నారు. దీనిపై జడ్జి శ్రీనివాస్ కలెక్టర్ హరికిరణ్, డిటిసి బసిరెడ్డితో మాట్లాడి న్యాయసేవల శిబిరం వారందరికీ లైసెన్సులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన కలెక్టర్ రవాణా శాఖ కార్యదర్శి బాలసుబ్రమణ్యంతో మాట్లాడి దరఖాస్తులో మేల్ ఫిమేల్‌తో పాటు ట్రాన్స్‌జెండర్స్ అనే కాలం ఏర్పాటు చేశారు.

శనివారం నిర్వహించిన న్యాయ సేవల శిబిరంలో 32 మంది ట్రాన్స్‌జెండర్లకు ఎల్ఎల్ఆర్ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, మండలాల లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్ మనోహర్‌రెడ్డి, సిబిఐటి చైర్మన్ జయచంద్రారెడ్డి, జెసి-2శివారెడ్డి, డిఆర్‌డిఎ పీడీ రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'లోక్‌పాల్' కోసం 30 నుంచి నిరహార దీక్ష : అన్నా హజారే



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

లోక్‌పాల్ నియామకంలో జాప్యానికి నిరసనగా ఈనెల 30నుంచి తన స్వగ్రామం రాల్‌గవే సిద్ధిలో నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు ప్రముఖ గాంధేయవాది అన్నా హాజారే తెలిపారు. తెలంగాణ జాగతి ఆధ్వర్యంలో అంతర్జాతీయ యువజన నాయకత్వ సదస్సును శనివారం ఆయన హైదరాబాద్ హెచ్ఐసీసీలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, లోక్‌పాల్, లోకాయుక్త 2014లో చట్టరూపం దాల్చిందని చెప్పారు. తాను అధికారంలోకి వచ్చిన వెంటనే లోక్‌పాల్‌ను నియమిస్తానని బీజేపీ ప్రధాని అభ్యర్థిగా నరేంద్రమోదీ ప్రకటించారు. అదేఏడాదిలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఎంతో కొంత దీనిపై ముందడుగు పడుతుందని ఆశించాం. కానీ గడిచిన ఐదు సంవత్స రాలు ఏమీ చేయలేదు. ఇందుకు నిరసనగానే నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు అన్నా హాజారే పేర్కొన్నారు. సదస్సులో గాంధేయ మార్గంలో సుస్థిర అభివద్ధి, ఆవిష్క రణలు అనే అంశంపై ఆయన మాట్లాడారు.ఏడాది, ఐదేళ్ల, పదేళ్ల ప్రాతిపదికగా లక్ష్యాలు నిర్దేశించుకుని ముందుకు సాగాలని సూచించారు. యువశక్తి సరికొత్త దిశగా ప్రయాణించి అద్భుతాలు సష్టించాలని ఆకాంక్షించారు. జీవింతలో సాధించా ల్సిన లక్ష్యాలపై ముందే స్పష్టత ఉండాలన్నారు. ఎన్ని అవరోధాలు ఎదురైనా వెనుకడుగు వేయొద్దన్నారు. నిరంతరం నేర్చుకోవాలనే జిజ్ఞాస కూడా యువతలో ఉండాలన్నారు. యువత కలిసికట్టుగా పోరాటం చేస్తేనే సమస్యలు పరిష్కారమవు తాయని తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎంపి కవిత పేర్కొన్నారు. ఈ సదస్సుకు 135 దేశాల నుంచి 550 మంది ప్రతినిధులు హాజరయ్యారు.

పోలీస్ సంఘం కమిటీలు రద్దు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పోలీస్ అధికారుల సంఘం కమిటీలను డిజిపి ఆర్‌పి ఠాకూర్ రద్దు చేశారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను శనివారం ఆయన విడుదల చేశారు. రాష్ట్రంలోని 13 జిల్లాల పోలీస్ సంఘం కమిటీలు, రాష్ట్ర కమిటీలను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పోలీస్ అధికారుల సంఘం నాయకులు వారి విధులకు హాజరుకావాలని ఉత్తర్వుల్లో ఆదేశించారు. పోలీసు సంఘ ఆర్థిక లావాదేవీలను ఆయా జిల్లాల అడ్మిన్, ఎస్పిలకు డిజిపి అప్పగించారు. ఎపి పోలీస్ అధికారుల సంఘం ఎన్నికలపై హైకోర్టు స్టే విధించడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.

ప్రత్యేకం

ఫీజుల కోసం వేధింపులు

- ఎస్సీ, ఎస్టీ విద్యార్థులపై కార్పొరేట్ స్కూళ్ళ వివక్ష
- 'బెస్ట్' స్కీమ్ వరెస్ట్
- చోద్యం చూస్తున్న సర్కారు



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

బెస్ట్ అవేలబుల్ పాఠశాలల పథకం కింద కార్పొరేట్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులపై ఆయా పాఠశాలల యాజమాన్యాలు వివక్ష చూపుతున్నాయి. ఫీజుల కోసం వేధిస్తున్నాయి. పాఠాలు సరిగా బోధించడం లేదు. కార్పొరేట్ స్కూళ్లలో చదువుతున్న విద్యార్థులపై రియల్ టైమ్ గవర్నెన్స్ (ఆర్టీజి) ద్వారా స్వయంగా ప్రభుత్వం చేపట్టిన సర్వేలో ఆసక్తికరమైన విషయాలు వెలుగు చూశాయి. అత్యధికంగా గుంటూరు, విజయనగరం జిల్లాల్లోనే ఇటువంటి దుస్థితి నెలకొ న్నట్టు సర్వేలో వెల్లడయ్యింది. యాజమాన్యాలు తమపై వివక్ష చూపిస్తున్నాయని విజయనగరం జిల్లాలో 60 శాతం, గుంటూరు జిల్లాలో 57, కర్నూలు జిల్లాలో 27, శ్రీకాకుళం జిల్లాలో 25, పశ్చిమ గోదావరి జిల్లాలో 20 శాతం మంది విద్యార్థులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. చదువు సరిగా చెప్పడం లేదని సగటున 38 శాతం మంది విద్యార్థులు తెలిపారు. అత్యధికంగా కడప జిల్లాలో 100 శాతం మంది విద్యార్థులు తమ అభిప్రాయాల్ని వెల్లడించగా, తూర్పు గోదావరి, నెల్లూరులో 50, కర్నూలులో 45, చిత్తూరు, కృష్ణాలో 42, పశ్చిమ గోదావరి జిల్లాలో 40 శాతం మంది విద్యార్థులు వెల్లడించారు. ప్రభుత్వమే ఫీజు లు చెల్లిస్తున్నా ఫీజుల పేరిట తమను వేధిస్తున్నట్టు విద్యార్థులు మొర పెట్టుకున్నారు. విశాఖపట్నం జిల్లాలో ఇలాం టి దుశ్చర్య లకు పాల్పడ తున్నట్టు 100 శాతం మంది విద్యార్థులు తెలిపారు. బెస్ట్ అవేలబుల్ స్కూల్స్ స్కీమ్ కింద ఎస్సీ,ఎస్టీ విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలల్లో చదువు చెప్పిస్తున్న విషయం తెలిసిందే. సుమారు 30వేల మంది విద్యార్థులు 13 జిల్లాల్లోని వివిధ కార్పొరేట్ స్కూళ్ళల్లో ఈ పథకం కింద చదువుకుంటున్నారు. డే స్కాలర్స్ కింద చదువుకుంటున్న వారికి రూ. 20వేలు, రెసిడెన్షి యల్ విధానంలో చదువుకుంటున్న వారికి రూ. 30వేలు ప్రభుత్వమే యాజమాన్యాలకు చెల్లిస్తోంది. ఈ ఏడాదిలో ఈ పథకం కింద సాంఘిక సంక్షేమ శాఖ కింద 42.57 కోట్లు, గిరిజన సంక్షేమ శాఖ కింద 34.64 కోట్లు కేటాయించారు.

లోపించిన పర్యవేక్షణ

ఈ పథకం కింద చదువుకుంటున్న విద్యార్థుల బాగోగులపై పర్యవేక్షణ లోపించింది. పాఠాలు సరిగా బోధిస్తున్నారా, బోధనలు విద్యార్థులకు అర్థమవుతున్నాయా, సమస్యలేమైనా ఎదుర్కొంటున్నారా తదితర అంశాలపై ఆయా పాఠశాలల యాజమాన్యాలతో ప్రభుత్వం చర్చించాలి. సమస్యలు పునరావృతం కాకుండా యాజమాన్యాలకు తగు సూచనలివ్వాలి. అవసరమైతే అనుమతులు రద్దు చేస్తామని హెచ్చరించాలి. కానీ నాలుగేళ్ళల్లో అటువంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఏదో మొక్కుబడిగా పాఠశాలల్లో ప్రవేశాలు కల్పించి, ఫీజులు చెల్లించి, తమకేమీ సంబంధం లేదన్నట్టుగా సర్కారు చేతులు దులుపుకుంటోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

సంక్షిప్తం

నరసింహయ్య మృతికి సిఎం సంతాపం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

స్వాతంత్ర్య సమరయోధులు, కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నేత తెలకపల్లి నరసింహయ్య మృతిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంతాపం తెలిపారు. తొలితరం కమ్యూనిస్టు నేత, పీడిత ప్రజల హక్కుల కోసం పోరాడిన యోధుడు నరసింహయ్య అని పేర్కొన్నారు. చివరి వరకూ ఆయన నిస్వార్ధంతో పనిచేసి విలువలకు నిబద్ధుడయ్యారని తెలిపారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

కేంద్రానికి మరో చెంపదెబ్బ : సిపిఐ

జెఎన్‌యు విద్యార్థి సంఘ మాజీ నాయకులు కన్నయ్యకుమార్‌పై దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌ను ఢిల్లీ హైకోర్టు తిరస్కరించడం కేంద్ర ప్రభుత్వానికి మరో చెంపదెబ్బని సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ట్విట్టర్ ఆయన ద్వారా స్పందించారు. మోడీ ప్రభుత్వం నిరాశ, నిస్పృహలతో కొట్టుమిట్టాడుతూ, సెక్షన్ 24 సెడేషన్ యాక్టును అడ్డం పెట్టుకుని ప్రత్యర్థులను మట్టుపెట్టాలని కుట్రపన్నుతోందన్నారు. కోర్టుల్లో కేంద్రానికి చుక్కెదురవుతోందని, త్వరలో ప్రజాకోర్టులో కూడా తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

మోడీని గద్దె దించడం తథ్యం : జూపూడి

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించడం తథ్యమని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి జూపూడి ప్రభాకర్ అన్నారు. బందరు రోడ్డులోని టిడిపి కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మోడీ వ్యతిరేక శక్తులన్నింటినీ ఏకం చేసి కేంద్రంలో బిజెపికి వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా పోరాటాలు చేస్తామన్నారు. ప్రత్యేకహోదా, విభజనచట్టంలోని హామీలను అమలు చేస్తామని కాంగ్రెస్ ముందుకు రావడంతో కలిసివెళ్తున్నామన్నారు. హోదా అడిగితే బిజెపి నేతలు ప్రత్యేక ట్రీట్‌మెంట్ అంటూ ఈడి, ఐటి దాడులు చేయిస్తున్నారని ఆయన ఆరోపించారు. కడపలో ఉక్కు కర్మాగారం గురించి తెలియదని కేంద్రహోం మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ చెప్పడం అన్యాయమన్నారు.

92 బస్తాల నకిలీ పొటాష్ పట్టివేత

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

ఎరువుల గోడౌన్‌పై శనివారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడి చేసి 92 బస్తాల నకిలీ పొటాష్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఒంగోలు వెచ్చా కాంప్లెక్స్‌లోని శ్రీ గురుసాయి ట్రేడర్స్ గోడౌన్‌లో అక్రమ పొటాష్‌ను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎఎస్‌పిలు రజిత, అంకయ్యల ఆదేశాల మేరకు అధికారులు దాడిచేశారు. పొటాష్‌ను వాటర్ ద్వారా పరిశీలించి, స్వాధీనం చేసుకున్నారు. వ్యవసాయాధికారికి అప్పజెప్పనున్నట్లు వారు తెలిపారు. ఈ దాడిలో ఎస్సైలు కుమార్, ఉమాపతి, వ్యవసాయశాఖ అధికారి వసంతరావు, ఆడిటర్ శ్యామ్‌సాయి, వీఆర్వో చెన్నయ్య పాల్గొన్నారు.



బెలూన్ ఎక్కి అభివాదం చేస్తున్న బ్రాహ్మణి, గీతం యూనివర్సిటీ చైర్మన్ శ్రీభరత్

బెలూన్ ఫెస్టివల్ అద్భుతం : బ్రాహ్మణి

ప్రజాశక్తి - అరకురూరల్ (విశాఖపట్నం)

విశాఖ జిల్లాలోని ప్రముఖ పర్యాటక కేంద్రం అరకు లోయలో నిర్వహిస్తున్నట్లు బెలూన్ ఫెస్టివల్ అద్భుతంగా ఉందని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి నారా లోకేష్ సతీమణి బ్రాహ్మణి అన్నారు. బెలూన్ ఫెస్టివల్ రెండోరోజు శనివారం సాయంత్రం స్థాని క ఎన్‌టిఆర్ స్టేడియంలో బ్రాహ్మణి, దేవాన్ష్, గీతం యూనివర్సిటీ చైర్మన్ భరత్ తదితరులు 3వ నెంబర్ బెలూన్ ఎక్కి గగనతలంలో విహరించారు. అనంతరం బ్రాహ్మణి మాట్లాడుతూ చిన్నప్పుడు అరకు వ్యాలీని సందర్శించానని, ఇప్పుడు మళ్లీ బెలూన్ ఫెస్టివల్‌లో పాల్గొనడం సంతోషంగా ఉందని చెప్పారు. ఆర్గానిక్ కాఫీ ఉత్పత్తిలో అరకు కాఫీ అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జించిందని తెలిపారు.

రెండో రోజు కొనసాగిన బెలూన్ ఫెస్టివల్

బెలూన్ ఫెస్టివల్ రెండోరోజైన శనివారమూ కొనసాగింది. 15 దేశాలకు చెందిన 20 బెలూన్లు శనివారం ఉదయం 10.30 గంటలకు ఎన్‌టిఆర్ స్టేడియంలో గాల్లో ఎగిరాయి. 11.30 గంటలకు బోసుబెడ వద్ద ల్యాండ్ అయ్యాయి. ఒక్కో బెలూన్‌లో నలుగురైదుగురు విహరించారు. సాయంత్రం 4 గంటలకు 10 బెలూన్లు ఎగురవేశారు. అనంతరం మరో 10 బెలూన్లను ఐదారు అడుగుల ఎత్తు వరకు తాళ్లు కట్టి ఎగురవేశారు. అయితే బెలూన్ ఎక్కి ఆకాశంలో విహరించాలని ఎంతో ఉత్సాహంతో అరకు వచ్చిన పర్యాటలకు తీవ్ర నిరాశే ఎదురవుతోంది. ఉదయం 20 బెలూన్లు, సాయంత్రం 10 బెలూన్లు మాత్రమే ఎగురవేస్తున్నారు. అది కూడా ఒక ట్రిప్ మాత్రమే. అందులోనూ ఉన్నతాధికారులు, ప్రభుత్వ పెద్దలు, వారి బంధువులకే ఎక్కువగా అవకాశం కల్పిస్తున్నారని, పర్యాటకులకు లాటరీ పద్ధతిలో నామమాత్రంగానే అవకాశం ఇస్తున్నారని పలువురు పర్యాటకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎప్పుడు అవకాశం వస్తుందో తెలియక అరకులో పడిగాపులు కాయాల్సి వస్తుందని వాపోయారు.



భారతీయ రైల్వేలో

'ఆపరేషన్ ఉత్కృష్ట్'

కోచ్‌ల ఆధునికీకరణ పనులకు శ్రీకారం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

భారతీయ రైల్వే కోచ్‌ల ఆధునికీకరణకు ఎట్టకేలకు చర్యలు తీసుకుంటోంది. ఈస్ట్ కోస్ట్ రైల్వేలో భాగమైన వాల్తేరు డివిజన్ ఉన్నతాధికారులు ఈ మేరకు విశాఖ నుంచి ప్రారంభమయ్యే సుమారు 100 రైళ్లలో ముఖ్యమైన రైళ్ల వివరాలను అప్‌గ్రేడేషన్‌కు సిద్ధం చేస్తున్నారు. ఇండియన్ రైల్వే దీనికి 'ఆపరేషన్ ఉత్కృష్ట్'గా నామకరణం చేసింది. కోచ్‌లను అప్‌గ్రేడ్ చేయడమే దీని లక్ష్యం. సూపర్ ఫాస్ట్, ఎక్స్‌ప్రెస్, మెయిల్ రైళ్లలోని కోచ్‌లలో ఈ ఆధునికీకరణ పనులు చేపట్టనున్నారు. ఇంటీరియర్ డెకరేషన్స్, కోచ్‌లకు బయట బ్యూటిఫికేషన్ (ఎక్స్‌టీరియర్స్) ఆధునికీకరణను నిర్దిష్టమైన మార్గదర్శకాలకు అనుగుణంగా చేపట్టనున్నారు. ఉత్తమ ప్రామాణికాలను దృష్టిలో పెట్టుకుని కోచ్‌లను డిజైన్ చేయనున్నారు. జోనల్ కార్యాలయాల్లో ఇప్పటికే వీటికి సంబంధించిన ప్రాథమిక సమాచారాన్ని రైల్వే అధికారులు చేపట్టి అవసరమైన పనులకు డిపిఆర్ నివేదిక సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది. కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ రైల్వే జోన్‌ల ఏర్పాటు కంటే ఈ పనులను ఆయా జోన్‌లలో చేపట్టడం ద్వారా కొత్తదనం తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. విశాఖకు రైల్వేజోన్ కావాలన్న డిమాండ్ ఉన్న నేపథ్యంలో, విభజన హామీలో కూడా ప్రధానంగా ఉన్నందున తూర్పు కోస్తాలో విశాఖ రైల్ కోచ్‌లకు అధిక మెరుగులు దిద్దే అవకాశాలూ లేకపోలేదు. ఇటీవలే విశాఖ రైల్వే డివిజన్‌లో వివిధ పనుల కోసం రైల్వేబోర్డు చైర్మన్‌ను కలిసి రూ.300 కోట్లు వచ్చేందుకు పనులను చేపట్టనున్నట్లు పార్లమెంటరీ సబార్డినేట్ కమిటీ చైర్మన్, రాజ్యసభ సభ్యులు డాక్టర్ టి.సుబ్బరామిరెడ్డి విశాఖలో వెల్లడించిన విషయం తెలిసిందే.

రైళ్లలో అసౌకర్యాల వెతలకు చెల్లుచీటి!

విశాఖ మీదుగా వచ్చే పలు రైళ్ల విషయంలో అసౌకర్యాలు అధికంగా ఉంటున్నాయి. రిజర్వేషన్ చేసుకున్నా సరే ఒడిషా, బెంగాల్, ఈశాన్య రాష్ట్రాల నుంచి వచ్చే రైళ్లలో ఉత్తరాంధ్ర వాసులు ప్రయాణాలు సాగించడం నానాటికీ కష్టతరంగా మారిందన్న చర్చ నడుస్తోంది. టాయ్‌లెట్ల నిర్వహణ కూడా రైల్వేలో ఇప్పటివరకూ అంతంత మాత్రంగానే ఉంది. మురికి కూపాలను తలపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇండియన్ రైళ్లలో అప్‌గ్రేడేషన్ పనులతో టాయ్‌లెట్లకు పివిసి ఫ్లోరింగ్ తోనూ, ఎల్ఇడి లైట్లతోనూ కొత్త రూపు ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. సీట్లు, టాయ్‌లెట్లు, బెర్త్‌లన్నిటినీ ఆధునీకరణ చేయనున్నారు. రైల్ ఫ్లోరింగ్‌ను, కోచ్ పేనల్స్‌ను మార్చనున్నారు. రూఫ్‌ను కూడా అందంగా తీర్చిదిద్దే అవకాశాలపై ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. అన్ని సీట్లు, బెర్త్‌లు 'టార్న్‌రెక్సిన్ లేదా కంప్రెసెస్ కుషనింగ్'లతో రైళ్లలో మార్పులు చేపట్ట నున్నారు. ఎసి కోచ్‌లలో అనునిత్యం క్లీనింగ్ చేసే ఏర్పాట్లు జరుగుతున్నాయి. డబుల్ యాక్టింగ్ పార్టిషన్ డోర్‌లను అన్నిచోట్లా ఏర్పాట్లు చేసేందుకు రంగం సిద్ధమైంది. ఇంకా భద్రత, ఫైర్ నివారణా చర్యలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. రైళ్లలో ఫ్రేం లేని అద్దాలను, ఎసి కోచ్‌లలో ఉత్తమ నాణ్యత గల కర్టెయిన్‌లను ఏర్పాటు చేయనున్నారు.

గోదావరిలో ఇద్దరు గల్లంతు

- సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మృతదేహం లభ్యం
- బిటెక్ విద్యార్థి ఆచూకీ కోసం గాలింపు



రాజీవ్



సంతోష్

ప్రజాశక్తి - దేవీపట్నం (తూర్పుగోదావరి)

గోదావరిలో స్నానం చేస్తుండగా మునిగిపోతున్న బిటెక్ విద్యార్థిని రక్షించేందుకు ప్రయత్నించి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ప్రాణాలు కోల్పోయాడు. బిటెక్ విద్యార్థి ఆచూకీ కోసం గాలిస్తున్నారు. పిఠాపురం మండలం కందరాడకు చెందిన బిటెక్ విద్యార్థి తోట సంతోష్ (20), బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న పిల్లా రాజీవ్ (35) దేవీపట్నం మండలం మడిపల్లి గ్రామంలోని బంధువుల ఇంటికి శనివారం వచ్చారు. సంతోష్ స్నానం చేస్తూ మునిగిపోబోతుండగా, ఒడ్డుపైనున్న రాజీవ్ రక్షించబోయారు. ఇద్దరూ నీటమునిగారు. దేవీపట్నం ఎస్ఐ వెంకట్రావుతోపాటు స్థానికులు గాలింపు చర్యలు చేపట్టగా రాజీవ్ మృతదేహం లభ్యమైంది. సంతోష్ కోసం గాలించినా ఫలితం లేకుండాపోయింది. రాజీవ్ బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. ఆయన తండ్రి బాబ్జి కిడ్నీ సంబంధిత వ్యాధితో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సంతోష్ విశాఖపట్నం గాయత్రి కాలేజీలో బిటెక్ చదువుతున్నాడు. పండుగ సెలవులు కావడంతో శనివారం దేవీపట్నం వచ్చి అక్కడ నుంచి మడిపల్లిలోని సంతోష్ చిన్న తాతయ్య బదిరెడ్డి వీరనరసయ్య ఇంటికి వెళ్లాడు. అక్కడికి సమీపంలోని గోదావరిలో స్నానం చేస్తుండగా గల్లంతయ్యాడు.

ఎన్ఐఎ విచారణకు వైసిపి నాయకులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో/అమలాపురం (తూర్పుగోదావరి)

వైసిపి అధినేత జగన్‌పై కోడికత్తితో దాడి చేసిన ఘటనలో విచారణ నిమిత్తం శనివారం వైసిపి విశాఖ నేతలు నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఎ) ఎదుట సాక్ష్యం కోసం హాజరయ్యారు. మాజీ ఎమ్మెల్యేలు మళ్ల విజయప్రసాద్, తైనాల విజయకుమార్, ఇతర నాయకులు కెకె.రాజు, విశాఖ దక్షిణ నియోజకవర్గ వైసిపి సమన్వయ కర్త, ప్రముఖ వైద్యులు పివి.రమణమూర్తి తదితరులు హాజరయ్యారు. ఘటన జరిగిన రోజున పలువురు వైసిపి నాయకులు ఆ పరిసరాల్లో ఉండడంతో దాడి విషయమై ఎన్ఐఎ అధికారులు పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. వీరితో పాటు విజయనగరం జిల్లా పార్టీ నాయకులు బొత్స సత్యనారాయణ మేనల్లుడు మజ్జి శ్రీనివాసరావును, సాలూరు ఎమ్మెల్యే పీడిక రాజన్నదొరను కూడా ఎన్ఐఎ అధికారులు విచారణ చేస్తున్నారు. గతేడాది అక్టోబర్ 25న విశాఖ విమానాశ్రయంలో జగన్మోహన్‌రెడ్డిపై శ్రీనివాసరావు అనే వ్యక్తి కోడికత్తితో దాడి చేసిన సంగతి తెలిసిందే.

తూర్పుగోదావరి జిల్లా ముమ్మిడివరం మండలం ఠానేల్లంకలో రహస్య విచారణ జరిపింది. కేసు విచారణకు సంబంధించి రాష్ట్ర పోలీసులు, సిట్ అధికారులు తమకు ఏమాత్రమూ సహకరించ డంలేదని ఎన్ఐఎ సభ్యులు న్యాయస్థానం దృష్టికి తీసుకువెళ్లిన సంగతి తెలిసిందే. జగన్‌పై హత్యాయత్నం చేసిన సమయంలో నిందితుడు జనిపెల్ల శ్రీనివాస్ వద్ద లభించిన లేఖ ఆధారంగా ఎన్ఐఎ బృందం దర్యాప్తు చేసినట్లు సమాచారం. ఈ లేఖ రాసినట్లు భావిస్తున్న శ్రీనివాసరావుకు వరుసకు సోదరి అయిన జనిపెల్ల విజయదుర్గను ఎన్ఐఎ బృందం శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ విచారించింది. దీనికి సంబంధించిన సమాచారం మీడియాకు తెలియజేయకుండా గోప్యంగా ఉంచింది.

మాజీ సైనిక కుటుంబాలకు అండగా భారత సైన్యం

దక్షిణ భారత ప్రాంత జిఒసి ఎస్టీ ఉపసాని



గ్రీవెన్స్ ద్వారా సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు

ప్రజాశక్తి-కార్పొరేషన్ (గుంటూరు)

భారత సైన్యంలో దేశ భద్రతకు విశేష సేవలందించిన మాజీ సైనికులకు, వారి కుటుంబాలకు భారత సైన్యం అండగా ఉంటుందని దక్షిణ భారత ప్రాంత జనరల్ ఆఫీసర్ కమాండింగ్ (జిఒసి) లెఫ్టినెంట్ జనరల్ ఎస్టీ ఉపసాని పేర్కొన్నారు. శనివారం గుంటూరులోని శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో 1ఇఎమ్ఇ సికింద్రాబాద్ ఆధ్వర్యంలో మాజీ సైనికుల ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మాజీ సైనికులకు, వారి కుటుంబాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించి పెన్షన్లకు సంబంధించిన ఫిర్యాదులను నమోదు చేసి సంబంధిత అధికారులకు పంపించారు. యుద్ధంలో వీరమరణం పొందిన సైనికుల కుటుంబీకులను సన్మానించారు. అనంతరం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో తెలంగాణ, ఆంధ్ర జనరల్ ఆఫీసర్ కమాండింగ్ మేజర్ జనరల్ ఎన్.శ్రీనివాసరావు, ఆంధ్రప్రదేశ్ సైనిక్ వెల్ఫేర్ డైరెక్టర్ కమాండర్ ఎంవిస్.కుమార్, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎఎమ్‌డి.ఇంతియాజ్, జిల్లా సైనిక సంక్షేమ అధికారి ఎం.శ్రీ బాలాజి పాల్గొన్నారు.

అటెండర్‌పై లైంగిక వేధింపులు

విఆర్ఎ సస్పెన్షన్

ప్రజాశక్తి-చిత్తూరు ప్రతినిధి, కుప్పం

మహిళా అటెండర్‌ను లైంగికంగా వేధిస్తున్న విఆర్ఎను చిత్తూరు కలెక్టర్ ప్రద్యుమ్న సస్పెండు చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. విఆర్ఎ లైంగికంగా వేధిస్తున్నాడని అతని బారి నుంచి రక్షించాలని కుప్పం సిఐకి మహిళా అటెండర్ ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ వెంటనే విచారణకు ఆదేశించారు. ఈ విచారణలో దోషి అని తేలడంతో విఆర్ఎను సస్పెండ్ చేశారు. చిత్తూరు జిల్లా కుప్పం తహశీల్దార్ కార్యాలయంలో ఎకార్లపల్లె విఆర్ఎ (విలేజి రెవెన్యూ అసిస్టెంట్) గా ఆనందుడు ఐదేళ్ల క్రితం విధుల్లో చేరారు. లైంగిన వేధింపులపై స్పందించిన కలెక్టర్ ప్రద్యుమ్న మదనపల్లి సబ్ కలెక్టర్ కీర్తి చేకూరిని విచారణ అధికారిగా నియమించారు. రెండు గంటల్లో రిపోర్ట్ ఇవ్వాలని ఆదేశించారు. ఈ విచారణలో ఆనంద్ దోషి అని తేలింది. దీంతో విఆర్ఎను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

మహిళ సాధికార భవన నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - కలెక్టరేట్(కృష్ణా)

కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని జెడ్‌పి ఆవరణలో రూ.10 లక్షలతో నిర్మించనున్న మహిళా సాధికార భవన నిర్మాణానికి మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, కొల్లు రవీంద్ర శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జెడ్‌పి ఛైర్‌పర్సన్ గద్దె అనూరాధ మాట్లాడుతూ జిల్లాలో 16 మహిళ సాధికారత భవనాలు నిర్మించామని, జెడ్‌పి ఆవరణలో మరో భవనానికి శంకుస్థాపన చేశామని తెలిపారు. తమ హయాంలో మహిళా సంక్షేమానికి అధికంగా నిధులు ఖర్చు చేశామని వివరించారు. దీన్ని జడ్‌పి మహిళ ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ముడ చైర్మన్ బూరగడ్డ వేదవ్యాస్, పార్లమెంటు సభ్యులు కొనకళ్ల నారాయణరావు, ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు, బిసి ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కడుపునొప్పి తాళలేక వృద్ధుడు ఆత్మహత్య

ప్రజాశక్తి- అమరాపురం

అనంతపురం జిల్లా అమరాపురం మండలంలో కడుపునొప్పి తాళలేక ఉరి వేసుకుని వృద్ధుడు శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని కుటుంబ సభ్యుల వివరాల మేరకు... అమరాపురం మండలం మద్దనగుంట గ్రామానికి చెందిన కురుబ కుంటి వీరప్ప (55) నాలుగు సంవత్సరాల నుంచి కడుపునొప్పితో బాధపడుతున్నాడు.శనివారం కడుపునొప్పి తీవ్రమవడంతో జీవితంపై విరక్తి చెదిన వీరప్ప ఇంటిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

రక్షణ వ్యవస్థలో కృత్రిమ మేథస్సు

విశాఖలో ఎన్ఎస్‌టిఎల్ అకాడమీ మీట్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఇండియన్ నేవీ, రక్షణ వ్యవస్థలో కృత్రిమ మేథ (ఆర్టిఫిషి యల్ ఇంటెలిజెన్స్)స్సు అమలుకు కసరత్తు ప్రారంభమైంది. నేవల్ సిస్టమ్స్, మెటీరియల్స్‌లో కృత్రిమ మేథస్సుకు ప్రాధాన్యం ఇచ్చే దిశగా కేంద్రంలోని బిజెపి సర్కారు అడుగులు వేస్తోంది. ఈ మేరకు విశాఖలో నేవల్ సైన్స్ అండ్ టెక్నాలజికల్ లేబొరేటరీ (ఎన్ఎస్‌టిఎల్) అకాడమీ మీట్ -2019 (నామ్) ఇక్కడ మొహాపాత్ర మనసి ఆడిటోరియంలో శనివారం నిర్వ హించారు. నామ్-2019 ఒక ఆదర్శవంతమైన వేదికను రక్షణ రంగంలో కృత్రిమ మేథస్సు (ఎఐ)ను స్థాపించేందుకు చర్యలు తీసుకుంటుందని, దేశంలోని 18 యూనివర్సిటీలకు చెందిన (గాలక్సీ ఆఫ్ రీసెర్చర్స్) డిఆర్‌డిఒ, ఎన్ఎస్‌టిఎల్, ఎన్ఎం ఆర్ఎల్, సిఎఐఆర్, ఎన్‌పిఓఎల్, డిఎంఆర్ఎల్, అండ్ డిఇఎల్ (డీల్) సంస్థలు ఇందులో పాల్గొని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై చర్చలు జరిపాయి. ఈ సందర్భంగా ఎన్ఎస్ టిఎల్ డైరెక్టర్ డాక్టర్ ఒఆర్.నందగోపన్ (అవుట్ స్టాండింగ్ సైంటిస్టు) పాల్గొని అధునాతన ఆవిష్కరణలకు రక్షణ రంగం వేదిక కావాలని పిలుపునిచ్చారు. రీసెర్చి అండ్ డెవలప్‌మెట్ (ఆర్అండ్‌డి) సంస్థ భవిష్యత్ శాస్త్రజ్ఞాన పురో గతికి కావాల్సిన రోడ్‌మ్యాప్‌ను తయారు చేసేందుకుగానూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను నేవల్ సిస్టమ్స్‌లో పాదుకొల్పేం దుకు ప్రణాళిక చేసినట్లు తెలిపారు. నేవల్ సిస్టమ్స్ అండ్ మెటీరియల్స్ డైరెక్టర్ జనరల్ (డిఆర్‌డిఒ) డాక్టర్ సమీర్ వి.కామత్ మాట్లాడుతూ సామాజిక, సాంకేతిక విజ్ఞానానికి కావాల్సిన ఆవిష్కరణలకు ప్రాధాన్యం ఇచ్చేలా, భవిష్యత్ యుద్ధభూమిలో ప్రముఖ పాత్ర పోషించేలా ఇక్కడకు విచ్చేసి పాల్గొన్న వారంతా ఇంటరాక్షన్ జరపాలని కోరారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్య అతిథి ఎయు వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ జి.నాగేశ్వరరావు మాట్లాడుతూ, నేవల్ సిస్టమ్స్‌లో సృజనాత్మకతకు కావాల్సిన శక్తిని రీసెర్చర్‌లంతా ఇవ్వాలన్నారు. కీలకోపన్యాసాన్ని ఈ కార్యక్రమంలో డాక్టర్ అనిల్‌కుమార్ అగర్వాల్ (ఇఆర్అండ్ ఐపిఆర్, డిఆర్‌డిఒ) సహా పలువురు నిపుణులు, ప్రొఫెసర్లు జి.రవికుమార్, టెక్నాలజీ డైరెక్టర్ (ఎన్ఎస్‌టిఎల్, నామ్ చైర్మన్), పలువురు రీసెర్చి, సైంటిస్టులు పాల్గొన్నారు.

కోటప్పకొండ హిల్ ఫెస్టివల్ ప్రారంభం



కర్రబిళ్ల ఆడుతున్న స్పీకర్ కోడెల

ప్రజాశక్తి - నరసరావుపేట రూరల్

దేశంలోనే తొలిసారిగా నిర్వహిస్తున్న గుంటూరు జిల్లా నరసరావుపేట మండలం కోటప్పకొండ హిల్ ఫెస్టివల్ శనివారం ప్రారంభమైంది. రెండ్రోజుల పాటు ఉండే ఈ కార్యక్రమాన్ని స్పీకర్ కోడెల ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు. ఇందులో భాగంగా ముఖ్యఅతిథులుగా హాజరైన ఉప ముఖ్యమంత్రి కెఈ.కృష్ణమూర్తి, మంత్రి అయ్యన్నపాత్రుడు కలిసి ఆ ప్రాంతంలో పర్యటించారు. ముందుగా విద్యాశాఖ, డ్వాక్రా, మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బజార్లను పరిశీలించారు. ఫుడ్‌కోర్టుల్లో ఆంధ్రా, తెలంగాణ, రాయలసీమ వంటకాలతో ఏర్పాటు చేసిన పదార్థాలను రుచి చూశారు. పర్యాటకుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన లేపాక్షి హ్యాండి క్రాఫ్ట్స్, చేనేత వస్త్ర దుకాణాలను తిలకించారు. గ్రామీణ క్రీడలైన గోలీ, కర్రాబిళ్లా, బొంగరం, తాడు తదితర ఆటల్లో స్పీకర్ కోడెల స్వయంగా పాల్గొని పలువురిని ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా కోడెల మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, అడవులు, కొండల గొప్పదనాన్ని నేటితరానికి తెలిపేందుకు హిల్ ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్యారా మోటార్, ప్యారా సైలింగ్, హాట్ ఎయిర్ బెలూన్ రైడ్స్ ప్రత్యేక ఆకర్షణగా ఉంటాయని చెప్పారు. నేటి నుండి హెలికాప్టర్ రైడింగ్ అందుబాటులో ఉంటుందని వెల్లడించారు. ఈ రెండ్రోజులపాటు పర్యాటకుల కోసం 5 గంటల సేపు సినిమా కళాకారులతోనూ, జబర్దస్త్ టీంతో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో సుప్రీం కోర్టు న్యాయమూర్తులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

'పశ్చిమ'లో నెరవేరని హామీలు

అధికార పార్టీ ఎమ్మెల్యేల తీరుపై ప్రజాగ్రహం



ప్రజాశక్తి-ఏలూరు ప్రతినిధి

2014 ఎన్నికల్లో 'పశ్చిమ'లో క్లీన్‌స్వీప్ చేస్తూ 15 అసెంబ్లీ స్థానాలనూ సొంతం చేసుకున్న టిడిపికి ఈసారి ఎదురుగాలి వీస్తోందంటూ ప్రజల్లో విస్తృతమైన చర్చ కొనసాగుతోంది. ప్రభుత్వం అనుసరించిన విధానాలతోపాటు, స్థానికంగాఅధికార పార్టీ ఎమ్మెల్యేలు సాగించిన అవినీతి దందానే ప్రధానకారణంగా అభిప్రాయం వ్యక్తమవుతోంది. గతంలో ఎన్నడూలేని విధంగా ప్రజాప్రతినిధులు రూ. వందల, వేలకోట్లు దోచుకున్నారన్న ఆరోపణలు పెల్లుబుకుతున్నాయి. ఇసుక, మట్టి, చేపల చెరువులు, కంకర, నీరు, చెట్టు, ఉపాధిహామీ ఇలా అన్నింటా అవినీతి పరంపర కొనసాగింది. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఈ నాలుగున్నరేళ్లలో రూ. రెండువేల కోట్లు వరకూ అవినీతి సొమ్ము కూడబెట్టినట్లు చర్చ సాగుతోంది. బినామీపేర్లతో చింతలపూడి మండలంలో 120 ఎకరాలు కబ్జా చేసినట్లు చెబుతున్నారు. తమ్మిలేరులోని ఇసుక, పోలవరం కుడికాలువపై మట్టి, కొల్లేరులో అడ్డగోలుగా సాగిస్తున్న చేపల చెరువులు ఇలా అన్నింటా ఎమ్మెల్యే దందా సాగించినట్లు జనం బహిరంగంగానే మాట్లాడుకుంటున్న పరిస్థితి నెలకొంది. ఇసుక దందాను అడ్డుకున్నందుకు తహశీల్దార్ వనజాక్షిపై దాడి, పోలవరం కుడికాలువపై మట్టి తవ్వకాలు అడ్డుకున్నందుకు విజిలెన్స్ అధికారులను నిర్బంధించిన తీరు, అక్రమ చేపల చెరువులను అడ్డుకున్నందుకు అటవీ అధికారుల నిర్బంధం, భూములు కబ్జాచేశారంటూ దళిత కుటుంబాలు చేస్తున్న ఆందోళనలు వంటివన్నీ ప్రత్యక్షంగా కనిపిస్తున్నాయి. సామాన్యులు, అధికారులపై చేస్తున్న దాడులకు అంతేలేకుండా పోయింది. దీంతో ప్రజల్లో తీవ్రమైన అసంతృప్తి నెలకొంది. నిడదవోలు ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు ఇసుక దందాలో వందల కోట్లలో దండుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఏలూరు ఎమ్మెల్యే భూకబ్జాలతోపాటు, రౌడీయిజానికి తెరలేపారన్న చర్చ ప్రజల్లో విస్తృతంగా ఉంది. భీమవరం ఎమ్మెల్యే పులపర్తి ఆంజనేయులు జనం గురించి పట్టించుకున్న పాపన పోలేదంటూ మండిపడుతున్నారు. తుందుర్రు ఫుడ్‌పార్క్‌పై ఆయన వ్యవహరించిన తీరుపై ప్రజలు తీవ్ర అసహనంతో ఉన్నారు. మంత్రులు పితాని సత్యనారాయణ, .జవహర్ ఇసుక దందాతో రూ. కోట్లు కొల్లగొట్టారన్న ఆరోపణలున్నాయి. అందుకు అనేక ఉదంతాలు సైతం చోటుచేసుకున్నాయి.

పోలవరం ఎమ్మెల్యే మొడియం శ్రీనివాస్ గిరిజనులకు సంబంధించిన ఎల్‌టిఆర్ భూముల వ్యవహారంలో అడ్డగోలుగా గిరిజనేతర భూస్వాములకు తొత్తులుగా మారి పెద్దఎత్తున డబ్బులు దండుకున్నారంటూ గిరిజనుల్లో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. చింతలపూడి ఎమ్మెల్యే పీతల సుజాత ఇంటివద్ద నోట్ల కట్టలు దొరకడంతోపాటు, పలు అవినీతి ఆరోపణలున్నాయి. ఉంగుటూరు ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు చేపల చెరువులు, భూకబ్జాల పేరుతో కోట్లు గడించినట్లు ప్రజల్లో విస్తృతమైన చర్చ కొనసాగుతోంది. ఉండి ఎమ్మెల్యే వేటుకూరి శివరామరాజు గరగపర్రు దళితుల ఘటనల్లో వ్యవహరించిన తీరు పలు అంశాలపై ఆయన వైఖరిపైనా నియోజకవర్గంలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడుపై ఆ పార్టీకి చెందిన ఎంఎల్‌సి అంగర రామ్మోహన్‌నే అవినీతి ఆరోపణలు చేయడం గమనార్హం. గోపాలపురం ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు రిజర్వుడు కోటాలో ఎమ్మెల్యే అయినా దళితులకు వ్యతిరేకంగా అగ్రవర్ణాలకు తొత్తుగా వ్యవహరిం చారంటూ జనం తీవ్రంగా మండిపడుతున్న పరిస్థితి నెలకొంది. అవినీతి ఆరోపణలతోపాటు, జిల్లాలో ప్రజలకు మౌలిక వసతులైన తాగునీరు, రహదారులు సమస్యలు నాలుగున్నరేళ్లలో టిడిపి ప్రభుత్వం పరిష్కరించలేకపోయింది. గ్రామాల్లో సిమెంట్ రోడ్లు మినహాయించి ఆర్అండ్‌బి రోడ్లన్నీ జిల్లాలో అధ్వానంగా తయారయ్యాయి.

జిల్లాలో ఏ ఒక్క గ్రామంలోనూ తాగేందుకు గుక్కెడు నీళ్లు లేకుండా పోయాయి. తాగునీరు కలుషితంగా మారడంతో కొనుగోలు చేసి దాహం తీర్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. జన్మభూమి కమిటీల సభ్యులు గ్రామాల్లో సాగించిన దందా అంతా ఇంతాకాదు. కార్పొరేషన్ రుణాలు, రేషన్‌కార్డు, పించన్ ఇలా ప్రతిపనికీ ఇంత రేటు నిర్ణయించి సామాన్యులను పీల్చి పిప్పిచేశారు. గృహనిర్మాణ పథకం అమలు జిల్లాలో ఘోరంగా ఉంది. ఇంటి నిర్మాణం పూర్తయినా లబ్ధిదారుల్లో చాలామందికి చిల్లిగవ్వ కూడా అందలేదు. గతంలో ఎన్నడూలేని విధంగా నిబంధనలతో సంబంధం లేకుండా తాము చెప్పిన పని చేయాల్సిందేననట్లు అధికారులపై తీవ్రమైన ఒత్తిడి, దౌర్జన్యాలు చేసిన ఘటనలు కోకొల్లలు. మాట వినకపోతే బదిలీల పేరిట జిల్లాలో లేకుండా చేశారు. రుణమాఫీ, ఉచిత వడ్డీ, దెబ్బతిన్న పంటల పరిహారం వంటివి రైతులకు సక్రమంగా అందిన దాఖలాలూ లేకుండా పోయాయి. ఎన్నికల తర్వాత జిల్లాలో ఎయిర్‌పోర్టు, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, సిరామిక్ ప్యాక్టరీ, కొల్లేరుకు పూర్వవైభవం, పరిశ్రమలకాలుష్యం నియంత్రణ, నరసాపురం పోర్టు వంటి అనేక హామీలిచ్చినా ఏ ఒక్కటీ నెరవేర్చలేదు. దీంతో టిడిపిపై ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత చోటు చేసుకుంది.

ప్రభుత్వాస్పత్రుల్లో కార్పొరేట్ తరహా సేవలు

ప్రజాశక్తి- అనంతపురం సిటీ

కార్పొరేట్ తరహాలో వైద్య సేవలను రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వాస్పత్రుల్లో అమలు చేస్తున్నామని రాష్ట్ర వైద్య విద్య, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండి.ఫరూక్ పేర్కొన్నారు. శనివారం అనంతపురం సర్వజన ఆసుపత్రిలో రూ.60 కోట్లతో అభివద్ధి కార్యక్రమాలకు మంత్రి శంకుస్థాపన చేశారు. మెడికల్ కళాశాలలో 100 నుంచి 150 ఎంబిబిఎస్ సీట్లు పెంచడానికి భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రం లోటు బడ్జెట్‌లో ఉన్న వైద్య, విద్యా రంగానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దడానికి ముఖ్యమంత్రి కషి చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి, మేయర్ స్వరూప, ప్రభుత్వ విప్ అత్తర్ చాంద్‌బాషా, చీఫ్ విప్ పల్లె రఘునాథ్ రెడ్డి, ఇన్‌ఛార్జి కలెక్టర్ ఢిల్లీరావు పాల్గొన్నారు

సంపాదకీయం

దేశభక్తి

'భారతదేశం నా మాతృభూమి/ భారతీయులందరూ నా సహోదరులు/ నేను నా దేశాన్ని ప్రేమిస్తున్నాను/ సుసంపన్నమైన, బహువిధమైన నాదేశ వారసత్వసంపద నాకు గర్వకారణం' అన్న పైడిమర్రి వెంకట సుబ్బారావు ప్రతిజ్ఞా గీతం... ప్రతిరోజూ కోట్లాది మంది భారతీయుల గొంతుల్లో ప్రతిధ్వనిస్తూంటుంది. 'అందాల బంధం ఉంది ఈ నేలలో/ ఆత్మీయ రాగం ఉంది ఈ గాలిలో/ ఏ కులమైనా ఏ మతమైనా/ భరతమాతకొకటేలేరా' అంటూ ఈ నేలతో, ఈ గాలితో ఉన్న ఆత్మీయానురాగాన్ని, దేశభక్తిని నెమరువేసుకుంటాడు కులశేఖర్. 'ఒక అందమైన తోట/ ఆ తోటలో రకరకాల పూలు/ రంగురంగుల పూలు గులాబీలు మందారాలు చమేలీలు/ మొగలిపూలు బంతిపూలు గుల్‌మొహర్‌లు/ అన్ని రకాల పూలతో చాలా అందంగా కనబడుతుందా తోట/ అయితే/ ఆ పూలన్నింటినీ నలిపేసి, తొక్కేసి, నరికేసి/ ఒక్క కమలమే విస్తరించాలంటే/ ఆ తోట అందమంతా ఏమైపోతుంది?!' అంటాడు జల్‌జలా కవి అఫ్రీన్. ఇప్పుడు దేశంలో అదే జరుగుతోంది. భిన్న కులాలు, మతాలు, భాషలు, సంస్కృతులను రూపుమాపి ఒక్క 'హిందుత్వ'మే ఈ దేశంలో మిగలాలని కలలు కంటున్నారు. హిందుత్వ అంటే జాతీయత అనే భావనను చొప్పించే యత్నం తీవ్రంగా జరుగుతోంది. 'భారత మాతాకీ జై' నినాదం- హిందుత్వ సాంస్కృతిక జాతీయ వాదానికి, జాతి సమగ్రతకు ప్రతీకగా, జనగణమనతో సమానంగా మారింది. ఒకని దేశభక్తిని ఆ కోణం నుంచే నిర్ణయిస్తున్నారు. 'దారాపుత్రాదులతో సాంగకముగా, జిత్త బుద్ధ్యాత్మలతో నెవ్వండు నిష్ఫలాపేక్షతో దేశమునకు దన్నర్పణము చేసికొనునో వాడే దేశభక్తుడు. అంతేకాని దేశభక్తి దేశభక్తియని ఉపన్యాస పీఠములపై గొంతెత్తి యరచినంత మాత్రమున దేశభక్తి యుదయించునా? దేశ ప్రజలను సోదర ప్రేమతో జూచుటకు మీకు హృదయములే లేప్పుడు మీకెక్కడి దేశభక్తి?' అని ప్రశ్నిస్తాడు పానుగంటి. 'దేశభక్తి అవధులు దాటిన సైనిక కార్యకలాపాలకు దారి తీస్తుంద'న్నారు టాగూర్. 'దేశభక్తి మనకు అంతిమ విశ్రాంతి మందిరం కాలేదు. నేను జీవించి ఉండగా మానవత్వం మీద దేశభక్తిది పైచేయి కానివ్వను' అని స్పష్టం చేశాడు.

'ఒక దుర్మార్గుడి అంతిమ ఆశ్రయం (దిక్కు) దేశభక్తి' అని 18వ శతాబ్దపు బ్రిటన్ రచయిత శామ్యూల్ జాన్సన్ వ్యాఖ్యానం నిజమే అనిపిస్తుంది కొందరి విషయంలో. స్వచ్ఛభారత్ అంటూ చీపుర్లు పట్టుకుని వీధుల శుభ్రం చేయడాన్నే దేశభక్తి అంటాడొకాయన. డిజిటిల్ ఇండియా, మేకిన్ ఇండియా అనడమే అసలైన దేశభక్తి అని, సినిమా థియేటర్లలో 'జనగణమన' వేయగానే.. నిలబడి గొంతెత్తి సెల్యూట్ చేయడమే నిఖార్సైన దేశభక్తి అంటాడు ఇంకొకాయన. మేము చెప్పే పురాణాల్లోనే నిజమైన సైన్స్ వుంది- అదే 'వేదం'... అదే 'ధర్మం'. కాదన్నవారంతా దేశద్రోహులే అంటాడు ఇంకాస్త ముదిరిన ఊసరవెల్లి. అందుకే 'గజాని కొక గాంధారి కొడుకు గాంధీగారి దేశంలో' అని తిలక్ చమత్కరిస్తే... 'దేశభక్తీ! నీ పేరున గాదా దేశద్రోహం జరిగేదంతా' అంటూ ప్రశ్నిస్తాడు సదాశివం. సుదీర్ఘ స్వాతంత్ర్య పోరాటానికి దూరంగా ఉంటూ, బ్రిటిష్ పాలకులకు అనుకూలంగా వ్యవహరించింది సంఘ్ పరివార్. నాడు గాంధీని హత్యచేసిన గాడ్సే వారసులు ఇప్పుడు అతి దేశభక్తిని ప్రదర్శిస్తూ... ఇతరుల దేశభక్తిని సవాలు చేయడం విడ్డూరం. బిజెపికి వ్యతిరేకంగా మాట్లాడే ప్రతివారిని జాతీయవాదం ముసుగులో దేశ ద్రోహులుగా చిత్రీకరిస్తున్నారు. హిందుత్వ సృష్టికర్త సావర్కర్ బ్రిటీష్ వారికి లొంగిపోయి క్షమాపణ పత్రాలిచ్చి జైలు నుండి బయట పడిన చరిత్ర వీరిది. ఈ దేశ పతాకాన్ని కూడా అంగీకరించబోనని బహిరంగంగా ప్రకటించాడు సావర్కర్. వాజ్‌పాయి సైతం ఆనాడు అరెస్టుకు జడిసి క్షమాపణ పత్రం రాసిచ్చాడు. 'తనను ఉరితీసినా సరే... క్షమాపణ రాసిచ్చేది లేదన్న' భగత్‌సింగ్‌ది నిజమైన దేశభక్తి. అటువంటి వారి సరసన సంఘపరివార జనాన్ని ఊహించగలమా?

'భారతమాత సేవలో అన్నింటినీ మించిన నేరం అన్యాయంతోనూ, అక్రమంతోనూ రాజీపడటమే' అంటూ ఆంగ్లేయుల ఏకాధిపత్య పిడికిలి నుంచి భారత్‌ను రక్షించేందుకు దూసుకొచ్చిన ఓ అగ్నికణం నేతాజీ సుభాష్ చంద్రబోస్. 'దేశం కోసం చావడానికి సాహసం చెయ్యకపోతే, దేశంలో బ్రతికే హక్కు ఎక్కడిది?' అని ప్రశ్నిస్తూ... పోరాటం ద్వారానే స్వాతంత్ర్యం సిద్ధిస్తుందని నమ్మి, భారతీయులను సైనికులుగా తీర్చిదిద్దిన స్వాతంత్ర్య సమరయోధుడు ఆయన. ప్రజల్లో దేశభక్తి భావనను పెంపొందించేందుకు సుభాష్ చంద్రబోస్ జయంతి అయిన జనవరి 23ను 'దేశభక్తి దినం'గా పాటిస్తున్నారు. సుభాష్ చంద్రబోస్ స్ఫూర్తిని యువతరానికి అందించడమే నిజమైన దేశభక్తి. మతాల పేరుతో దేశభక్తిని కొలిచే పద్ధతులకు స్వస్తి చెప్పి, అన్ని మతాలవారూ ఈ దేశంలో జీవించేందుకు సమాన హక్కులున్నాయని గుర్తించడమే అసలైన దేశభక్తికి నిదర్శనం.

ఇదీ విషయం



నా ముఖానికి వేలాడేసిన 'నఖాబ్'
ఎత్తి చూశావా ఎన్నడైనా
నా కళ్లు
రెండు అమాస చంద్రుళ్లను మోస్తుంటాయ్!
ఈ మురికి గుంటలో
అత్తర్లు జల్లుకుంటూ ఎంతకాలం!
ప్రవాహంగా విస్తరించాలి కదా!

- స్కైబాబ

విశ్లేషణ

మన ఆర్థిక వ్యవస్థకేమయింది?

ఎంవిఎస్ శర్మ



'ప్రపంచంలోనే బలమైన ఆర్థిక వ్యవస్థలలో భారతదేశం అయిదవ స్థానంలో ఉంది' అని మోడీ గొప్పగా చెబుతున్నారు. అది వినగానే మనస్సు ఉప్పొంగుతుంది. '2030 నాటికి చైనా తర్వాత స్థానంలో భారతదేశమే రెండో బలమైన ఆర్థిక వ్యవస్థగా ఎదగనుంది' అని బిజెపి నేతలు చెప్పుకుంటున్నారు. ఇది తెలియగానే సంతోషించకుండా ఎవరైనా ఉంటారా? అయితే ఇంకోవైపు వేరే వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. 1. మన జిడిపి పెరుగుదల రేటు అంచనాల కన్నా తగ్గిపోతోంది. 2. 2016-17 సంవత్సరంలోనే ఏకంగా కోటీ పది లక్షల ఉద్యోగాలు తరిగిపోయాయి. 3. పన్నుల వసూళ్ల లక్ష్యాలు చేరుకోలేకపోతున్నాయి. 4. బ్యాంకుల పారు బకాయిలు గత నాలుగేళ్లలో రెండు లక్షల కోట్ల నుండి పది లక్షల కోట్ల రూపాయలకు పెరిగిపోయాయి. 5. పోర్టుఫోలియో పెట్టుబడులు దేశంలోకి వచ్చే వేగం తగ్గడమే గాక ఇతర దేశాలకు తరలిపోయే వేగం పెరిగింది. 6. ఆర్థిక నేరగాళ్ల శిక్షలను తప్పించుకోడానికి విదేశాలకు పారిపోవడం పెరిగింది. విదేశాంగ మంత్రి పార్లమెంటుకు ఇచ్చిన సమాచారం మేరకు గత నాలుగున్నరేళ్లలో విజయ్‌మాల్యా, నీరవ్‌మోడీ, మెహుల్ చోక్సీ వంటి వారు 31 మంది విదేశాలకు పారిపోయారు.

ఇటువంటి వార్తలు చూడగానే మోడీ అండ్‌కో చెప్పుకుంటున్న గొప్పలన్నీ ఒట్టి గాలి కబుర్లేనని అర్థం అవుతుంది. ఇటీవల కాలంలో ఆర్‌బిఐ మాజీ గవర్నరు రాఘురాం రాజన్ వెల్లడించిన విషయాలు, ఊర్జిత్ పటేల్ రాజీనామా, ఆ సందర్భంగా రిజర్వుబ్యాంకు ఆర్థిక నిల్వలను బడ్జెట్ లోటు పూడ్చుకోడానికి వాడుకోజూస్తున్న మోడీ ప్రభుత్వపు అనాలోచిత చర్యలు చూస్తుంటే మన దేశ ఆర్థిక వ్యవస్థ ఇప్పటికే గాడి తప్పిందని, ఇబ్బందులు తప్పవని అర్థం అవుతోంది.

ఎక్కడుంది లోపం? జరుగుతున్నది ఉపాధి రహిత అభివృద్ధి అని కొందరు విమర్శిస్తే, ఏదైతేనేం, మొత్తానికి అభివృద్ధే కదా! అని స్వాగతించిన పెద్దలు, ప్రపంచీకరణ మంచిదేనని సమర్థించిన ఆర్థిక వేత్తలు చాలామంది ఉన్నారు. మనం గమనించాల్సిన విషయం ఒకటుంది. పెట్టుబడి మార్కెట్‌లోకి వచ్చాక అది ఉత్పత్తి పెరుగుదలకు దారితీయాలి. ఉత్పత్తి పెరగడం అంటే ఆ క్రమంలో ఉపాధి పెరుగుతుంది. ప్రజల కొనుగోలు శక్తీ పెరుగుతుంది. ఉత్పత్తి అయిన సరుకు మార్కెట్‌లోకి వచ్చాక ఈ పెరిగిన కొనుగోలుశక్తి దానిని కొనుగోలు చేస్తుంది. అప్పుడు పెట్టుబడి పెట్టిన వారికి లాభాలు వస్తాయి. ఇది సాధారణ పెట్టుబడిదారీ పద్ధతి. కాని ఇప్పుడు అమలు జరుగుతున్నది నయా ఉదారవాద విధానం. ఇందులో ఉత్పత్తికి దారి తీసే పెట్టుబడి చాలా స్వల్పం. ఫైనాన్సు పెట్టుబడి చాలా అధికం. ఫైనాన్సు పెట్టుబడి సరుకుల తయారీకి దానంతట అదే దారితీయదు. కాని ఫైనాన్సు పెట్టుబడి రాగానే మార్కెట్‌లో డబ్బు చెలామణి పెరిగినట్టు అనిపిస్తుంది. కృత్రిమమైన, నిలదొక్కుకోలేని పెరుగుదల ఇది. తాత్కాలికంగా అభివృద్ధి జరిగినట్లు అనిపిస్తుంది. కాని ఒక్కమారు గాలిబుడగ పేలినట్టు టప్‌మని పేలిపోయి ఆర్థిక వ్యవస్థ కూలబడుతుంది. మన దేశమూ అదే దారిలో పోతోందిప్పుడు. నయాఉదారవాద విధానాలు మొదలయ్యాక, పెద్దపెద్ద కార్పొరేట్ కంపెనీలకు బ్యాంకులు విరివిగా రుణాలివ్వడం ప్రారంభించాయి. ఆ కార్పొరేట్ కంపెనీలు ఒక్కొక్కటిగా తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించలేక చేతులెత్తెయ్యడం ప్రారంభించాయి.

ఈ పని మోడీ వలన జరగదుగనక, మోడీని, బిజెపిని సాగనంపాలి. అదొక్కటే చాలదు. ప్రత్యామ్నాయంగా వచ్చే ప్రభుత్వం నయా ఉదారవాద పంథాను విడనాడేలా పెద్ద ఎత్తున ఉద్యమాలు నడవాలి. రైతులు, కార్మికులు, ప్రస్తుతం సాగిస్తున్న ఉద్యమాలు ప్రజలందరి ఉద్యమాలుగా విస్తృతం కావాలి. ఒక పార్టీని ఓడిస్తేనో, మరొక పార్టీని గెలిపిస్తేనో మన బాధ్యత తీరిపోదు. ప్రస్తుత విధానాలను మార్చాలన్నది అసలు లక్ష్యంగా ఉండాలి.

ప్రజల కొనుగోలు శక్తి ఎప్పుడు పెరుగుతుంది? కనీస వేతన స్థాయి పెరగాలి. భూ పంపకం జరగాలి. రైతులకు వ్యవసాయాన్ని గిట్టుబాటు అయ్యేలా చేయాలి. విద్య, వైద్యం వంటి రంగాలలో ప్రభుత్వ పాత్ర పెరగాలి. అంటే కార్పొరేట్లను పక్కనబెట్టాలి. ఇదంతా జరగాలంటే నయా ఉదారవాద పంథాను వదిలిపెట్టాలి.

మామూలుగానైతే అలా బకాయిపడ్డ కంపెనీలు దివాలా ఎత్తినట్టు ప్రకటించి చట్టపరమైన చర్యలు ప్రారంభించాలి. ఆ కంపెనీ ఆస్తులను జప్తు చేయాలి. మళ్లీ మరో పేరుతో ఆ కంపెనీ కొత్త బోర్డు పెట్టినా ఎటువంటి రుణాలూ ఇవ్వకూడదు.

కాని మోడీ ప్రభుత్వం ఆ పని చేయడంలేదు. బడాబడా కార్పొరేట్ కంపెనీలు దివాళా ఎత్తినట్టు ప్రకటిస్తే దేశ ఆర్థిక వ్యవస్థపై విశ్వాసం దెబ్బతింటుందని, ఉన్న ఫైనాన్సు పెట్టుబడి విదేశాలకు తరలి పోతుందని ప్రభుత్వం అంటోంది. కాబట్టి అప్పులు ఎగ్గొట్టిన కంపెనీలకే మళ్లీ కొత్త అప్పులు ఇవ్వాలని అందుకు బ్యాంకులు ముందుకు రావాలని మోడీ ప్రభుత్వం కోరుతోంది. కొత్త అప్పు ఇవ్వాలంటే పాత అప్పును మాఫీ చేయడం అవసరం అంటోంది. బ్యాంకుల దగ్గర డబ్బెక్కడిది? అందుకే బ్యాంకులకు బడ్జెట్ నుండి కేటాయిస్తాం అంటోంది. బడ్జెట్‌లో కేటాయించడానికి డబ్బెక్కడిది? అనడిగితే రిజర్వుబ్యాంకు ఆర్థిక నిల్వల నుంచి ఇమ్మనమని అడుగుతోంది. అలా ఇవ్వకుంటే సంక్షేమ పథకాలలో కోత, రాష్ట్రాల వాటాలో కోత పెట్టాల్సి వుంటుంది. ప్రస్తుతం ఎన్నికల సంవత్సరం గనుక సంక్షేమ పథకాలలో, రాష్ట్రాల వాటాలో కోత ప్రతిపాదనలు ఉండవు. ఎన్నికలై పోయాక తప్పనిసరిగా సంక్షేమంలోను, రాష్ట్రాల వాటాల్లోను కోతలు తప్పవు.

ఇక్కడ మనం గ్రహించాల్సిన సారాంశం ఏంటి? మొట్టమొదట కార్పొరేట్లు బకాయి పెట్టిన లక్షల కోట్ల రూపాయల పారుబకాయిల సొమ్ము ఎవరిది? బ్యాంకుల్లో సామాన్యులు దాచుకున్న సొమ్మే. దాన్ని వసూలు చేయకుండా మాఫీ చేయాలని మోడీ ప్రతిపాదిస్తున్నారు. అంటే మన సొమ్ముకు ఎగనామం పెడుతోందీ కేంద్రప్రభుత్వం. పోనీ అక్కడితో ఆగిందా అంటే అదీ లేదు. మళ్లీ ఆ కార్పొరేట్లకే తిరిగి అప్పులివ్వాలట! ఎవరి డబ్బు ఇవ్వాలి? రిజర్వు బ్యాంకు దగ్గరున్న మూలధనం. అదీ ప్రజల సొమ్మే. అది కాకపోతే బడ్జెట్ నుంచి కేటాయించాలంటోంది. బడ్జెట్ సొమ్ము ప్రజల నుంచి వసూలు చేసినదే.

వెరసి ప్రజాధనాన్ని అప్పనంగా ఎగవేతదారులకు కట్టబెట్టడమే మోడీ విధానమని గ్రహించాలి. అందుకే ఆర్థిక వ్యవస్థ అడుగు జారిపోతున్నా అంతా బ్రహ్మాండంగా ఉందంటూ ఊదరగొడుతున్నారు. ఇంకోపక్క కార్పొరేట్లతో కలిసి ప్రజాధనానికి కన్నం వేస్తున్నారు. రాఫెల్ ఉదంతం కూడా ఇటువంటిదే. పేరుకు యుద్ధ విమానాల కొనుగోలు ఒప్పందంగా ఉన్నా, వాస్తవంగా వేలకోట్ల రూపాయల ప్రజాధనాన్ని దివాలా ఎత్తుతున్న అనిల్ అంబానీ గ్రూపుకు కట్టబెట్టే ఒప్పందం అది. ఎందుకిలా చేస్తున్నారు? కార్పొరేట్ల నుంచి అధికారికంగానే వందలకోట్ల రూపాయల విరాళాలు బిజెపికి అందుతున్నాయి. ఇది ఇటీవల అన్ని పత్రికలలోనూ వచ్చిన సమాచారం. ఇక అనధికారికంగా ఎంత అందుతోందో ఊహించుకోవచ్చు. అందుకే కార్పొరేట్లకి ఊడిగం చేస్తునది మోడీ ప్రభుత్వం. అంతకుమునుపు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందీ అదే. మరి ఈ పరిస్థితి నుండి బయటపడటం ఎలా?

ఉపాధి కల్పనతో ముడిపడే విధంగా పెట్టుబడులు పెట్టాలి. ప్రజల కొనుగోలు శక్తి పెరగాలి. ఈ రెండూ జరగాలంటే ప్రభుత్వ రంగం జోక్యం, ప్రభుత్వ జోక్యం పెరగాలి. ద్రవ్యలోటు నిబంధనలను పక్కనబెట్టి ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను మలుపు తిప్పాలి. ప్రజల కొనుగోలు శక్తి ఎప్పుడు పెరుగుతుంది? కనీస వేతన స్థాయి పెరగాలి. భూ పంపకం జరగాలి. రైతులకు వ్యవసాయాన్ని గిట్టుబాటు అయ్యేలా చేయాలి. విద్య, వైద్యం వంటి రంగాలలో ప్రభుత్వ పాత్ర పెరగాలి. అంటే కార్పొరేట్లను పక్కనబెట్టాలి. ఇదంతా జరగాలంటే నయా ఉదారవాద పంథాను వదిలిపెట్టాలి.


ఈ పని మోడీ వలన జరగదుగనక, మోడీని, బిజెపిని సాగనంపాలి. అదొక్కటే చాలదు. ప్రత్యామ్నాయంగా వచ్చే ప్రభుత్వం నయా ఉదారవాద పంథాను విడనాడేలా పెద్ద ఎత్తున ఉద్యమాలు నడవాలి. రైతులు, కార్మికులు, ప్రస్తుతం సాగిస్తున్న ఉద్యమాలు ప్రజలందరి ఉద్యమాలుగా విస్తృతం కావాలి. ఒక పార్టీని ఓడిస్తేనో, మరొక పార్టీని గెలిపిస్తేనో మన బాధ్యత తీరిపోదు. ప్రస్తుత విధానాలను మార్చాలన్నది అసలు లక్ష్యంగా ఉండాలి. ఫ్రాన్స్‌లో 'ఎల్లో వెస్ట్స్ ఉద్యమం' పేర ప్రజానీకం సాగిస్తున్న పోరాటం నుంచి మనం గ్రహించాల్సింది ఇదే.

సమీక్ష

విధానాల మార్పుతోనే వ్యవసాయ సంక్షోభం పరిష్కారం

ఎ కోటిరెడ్డి

సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ వ్యవసాయ సంక్షోభ పరిష్కారం, రైతుల ఆదాయాలను రెట్టింపు చేయటం గురించి కేంద్ర ప్రభుత్వం ప్రకటనలు చేస్తోంది. అందుకనుగుణంగా కొందరు మేధావులు ప్రచారం చేస్తున్నారు. ఒకవైపున ఇటువంటి ప్రకటనలు చేస్తూ, మరోవైపున రైతుల ఆదాయాలను రెట్టింపు చేసే స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయని ప్రభుత్వం రకరకాల జిమ్మిక్కులతో కాలం గడుపుతున్నది. అనేక మంది మేధావులు, వ్యవసాయ రంగ నిపుణులు కూడా కమిషన్ సూచనలను పరిగణనలోకి తీసుకోవడం లేదు. ప్రభుత్వ ప్రతిపాదనలకు అనుగుణంగా రైతుల ఆదాయాల రెట్టింపుకు రకరకాల సూచనలు చేస్తున్నారు. మెరుగైన వ్యవసాయ మార్కెట్లు ఉండాలని, రైతులు స్వేచ్ఛగా క్రయ విక్రయాలు జరుపుకొనే పరిస్థితులు నెలకొంటే పంటలకు అధిక ధరలు లభిస్తాయని, ఆదాయాలు రెట్టింపు అవుతాయని అంటున్నారు. ఇంకా ప్రైవేటు పెట్టుబడులను స్వేచ్ఛగా రానివ్వాలని, వాటిని నిరుత్సాహపరిచే చర్యలు తీసుకోకూడదని చెబుతున్నారు. వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులపై ఆంక్షలు విధించకూడదని, అవి రైతులకు నష్టదాయకంగా పరిణమిస్తాయని సలహాలిస్తున్నారు. ఇటువంటి ప్రతిపాదనలు చేస్తున్నవారు వ్యవసాయ రంగంలోని పరిస్థితులు, దేశ ఆహార భద్రత తదితరాలను పరిగణనలోకి తీసుకోవటం లేదని స్పష్టమౌతున్నది.



స్వామినాథన్ కమిషన్ సిఫార్సులకు అనుగుణంగా వ్యవసాయోత్పత్తులకు మద్దతు ధరలు నిర్ణయించటం, వ్యవసాయోత్పత్తులను రైతుల నుండి ప్రభుత్వమే కొనుగోలు చేయటం, వాస్తవ సాగుదార్లకు ప్రభుత్వం రుణాలందించటం, ప్రభుత్వ, మిగులు భూములు పంచటం తదితర చర్యలు తీసుకోవటం ద్వారానే వ్యవసాయ సంక్షోభం పరిష్కారమౌతుంది.

ఆదాయ రెట్టింపునకు తీసుకోవలసిన చర్యలు

రైతుల ఆదాయాలు రెట్టింపు కావాలంటే స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం వ్యవసాయ పెట్టుబడులు, వడ్డీలు, రైతు కుటుంబం చేసిన శ్రమ తదితరాలను కలిపి, మొత్తం ఖర్చుకు 50 శాతం అదనంగా చేర్చి వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధరలు నిర్ణయించాలి. ఆ విధంగా ధరలు నిర్ణయించటంతో పాటు నిర్ణయించిన ధరలకు వ్యవసాయోత్పత్తులను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. గిట్టుబాటు ధర గురించి ఎంత చెప్పినా, ఎన్ని నిర్ణయాలు చేసినా అంతిమంగా, రైతు తన పంటను అమ్ముకొని, డబ్బు పొందినపుడే అది వాస్తవ రూపం దాలుస్తుంది. కాని ప్రభుత్వం మద్దతు ధర నిర్ణయించిన తర్వాత రైతు నుండి సరుకును కొనుగోలు చేస్తున్న వ్యాపారి ఆ ధరను పరిగణనలోకి తీసుకోవటం లేదు. దీంతో వచ్చిన రేటుకే అమ్ముకోవటంతో ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు, మార్కెట్‌లో రైతు పొందుతున్న ధరకు పొంతన ఉండటం లేదు. కాబట్టి వ్యవసాయోత్పత్తులకు ధరలు నిర్ణయించటంతో పాటు ధరలు తగ్గినపుడు ప్రభుత్వం మార్కెట్లోకి ప్రవేశించాలి. నిర్ణయించిన మద్దతు ధరలకే ఉత్పత్తులను కొనుగోలు చేయాలి. ఆ విధంగా చేస్తే ప్రైవేటు వ్యాపారులు కూడా ప్రభుత్వంతో పోటీ పడటానికి ప్రయత్నిస్తారు. ఫలితంగా ధరలు పెరిగి రైతులకు లబ్ధి చేకూరుతుంది.

రైతులు తమ ఉత్పత్తులను స్వేచ్ఛగా మార్కెట్లో అమ్ముకునే అవకాశం కల్పిస్తే మెరుగైన ధరలకు అమ్ముకుంటారని కొందరు వాదిస్తున్నారు. అయితే గతం నుండే రైతులు తమ ఉత్పత్తులను స్వేచ్ఛా మార్కెట్లోనే అమ్ముకుంటున్నా మార్కెట్ ధరలను పొందలేక పోతున్నారు. కారణం రైతులకు సకాలంలో రుణం, వ్యవసాయోపకరణాలు దొరకక, వడ్డీ వ్యాపారులు, ప్రైవేటు రుణాలపై ఆధారపడుతున్నారు. దీంతో పంట కళ్ళంలోకి రాగానే తప్పని సరిగా అప్పిచ్చిన వారికే తన ఉత్పత్తులను అమ్ముకోవలసిన పరిస్థితి రైతుకు ఎదురౌతున్నది. ఒకవేళ సరుకును మార్కెట్‌కు తీసుకు రాగలిగిన రైతులు కూడా వ్యాపారులు కుమ్మక్కవటంతో కనీస ధరలు కూడా దక్కక నష్టపోతున్నారు. నేటికీ గ్రామీణ ప్రాంతంలో ఎక్కువ మంది వాస్తవ సాగుదార్లకు ప్రభుత్వ రుణాలు అందే పరిస్థితి లేదు. దీంతో వడ్డీ వ్యాపారులపైనే ఆధారపడుతున్నారు. రుణ వితరణలో వాస్తవ సాగుదార్లను పరిగణనలోకి తీసుకోకుండా, మార్కెట్లో ప్రభుత్వం శక్తివంతంగా జోక్యం చేసుకోకుండా రైతులకు మద్దతు ధరలు దక్కటం సాధ్యం కాదు.

మద్దతు ధరలు లభించక నష్టాలు

మద్దతు ధరలు లభించకపోవటంతో రైతులు మాత్రమే కాక గ్రామీణ ప్రజానీకం అంతా నష్టపోతున్నారు. దేశంలో 40 కోట్ల ఎకరాల సాగు భూమి ఉన్నది. ప్రభుత్వం మద్దతు ధరలు నిర్ణయించకపోవటంతో ఎకరానికి సంవత్సరానికి సగటున రూ.20 వేలు రైతులు నష్టపోతున్నారు. దేశంలోని సాగు భూమి 40 కోట్ల ఎకరాలకు రూ.80,000 కోట్లు నష్టపోతున్నారు. రైతులకు వ్యవసాయం గిట్టుబాటు కాకపోవటానికి పెద్దమొత్తం ఆదాయాన్ని కోల్పోవటమే ప్రధాన కారణం. ఈ నష్టాన్ని భర్తీ చేయకుండా, స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం గిట్టుబాటు ధరలు నిర్ణయించి, అమలు జరపకుండా వ్యవసాయ రంగాన్ని సంక్షోభం నుండి బయటపడవేయటం సాధ్యం కాదు. మద్దతు ధరల విధానాన్ని సక్రమంగా అమలు జరిపితే రైతాంగానికి వచ్చే రూ.80 వేల కోట్ల ఆదాయం వారికే పరిమితం కాదు. అందులో కొంత మొత్తం మాత్రమే. వ్యవసాయ కార్మికులు, వృత్తిదారులు, చిరు వ్యాపారులు, గృహనిర్మాణం తదితర గ్రామీణ జీవితంలోని అన్ని రంగాలకూ ఆ మొత్తం చేరుతుంది. ఫలితంగా వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది. మార్కెట్ విస్తరిస్తుంది. గ్రామీణ మార్కెట్ విస్తృతమైతే లాభాలు సంపాదించుకోవటానికి దేశంలోకి విదేశీ పెట్టుబడులు కూడా ఎక్కువగా వస్తాయి. ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయి. విద్యాస్థాయి పెరుగుతుంది. ఆరోగ్య సూచీలు మెరుగవుతాయి.

ఆహార భద్రతను విస్మరించరాదు

ఎగుమతులను పెంపొందించటం ద్వారా వ్యవసాయ ఆదాయాలను పెంచవచ్చునని సలహాలు ఇస్తున్నారు. ఎగుమతులను పెంచటానికి ముందు దేశ ప్రజలకు ఆహార భద్రత కల్పించటం ప్రధానాంశం అన్న విషయాన్ని మర్చిపోరాదు. వాణిజ్య పంటలను పెంచాలని, వాటిని ఎగుమతి చేయటం ద్వారా అధిక ఆదాయం పొందవచ్చునని ప్రభుత్వం ప్రచారం చేస్తున్నది. ఎగుమతులను పెంచటానికి ముందు దేశ ప్రజలకు సరిపడా ఆహారాన్ని అందించేందుకు ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రజలందరికీ సరిపడా ఆహారం అందాలంటే మన ప్రజలకు సరిపోయే ఆహారం మనమే పండించాలి. అందువలన ఆహార ధాన్యాల ఉత్పత్తికి ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలి. దానితో పాటు రైతుల ఆదాయాలను పెంచటానికి కూడా చర్యలు తీసుకోవాలి. అయితే కొన్ని పంటల ఎగుమతులపై ఆంక్షలు విధించటంతో రైతులకు నష్టం కలుగుతుందని వాదిస్తున్నారు. నిత్యావసర సరుకులను ఎగుమతి చేయటం వలన ఆ సరుకులకు దేశంలో కొరత ఏర్పడే పరిస్థితి ఉన్నట్లయితే ప్రభుత్వమే మద్దతు ధరలకు రైతుల నుండి సేకరించి, ప్రజల అవసరాలు తీర్చటానికి ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రభుత్వం ఏ చర్య తీసుకున్నా రైతుల ఖర్చు, వారి శ్రమకు అదనంగా 50 శాతం కలిపిన ఆదాయం వారికి చేరే విధంగా చూడాలి. ఆ విధంగా రైతులు, వినియోగదారుల అవసరాల మధ్య సమతుల్యత సాధించాలి. అవసరమైనపుడు బియ్యం, గోధుమ, పప్పులు, నూనెలు, తదితరాలకు సబ్సిడీలు ఇవ్వాలి. ప్రజల అవసరాలు తీరిన తర్వాత ఉన్న మేరకు ఎగుమతులు చేస్తుంటే అభ్యంతరం ఏముంటుంది?

అందువలన ప్రైవేటు పెట్టుబడులు రావటం, ఎగుమతులు చేయటం, స్వేచ్ఛా మార్కెట్ తదితరాలు వ్యవసాయ సంక్షోభం, రైతుల ఆదాయాల రెట్టింపుకు పరిష్కారం కాదు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులకు అనుగుణంగా వ్యవసాయోత్పత్తులకు మద్దతు ధరలు నిర్ణయించటం, వ్యవసాయోత్పత్తులను రైతుల నుండి ప్రభుత్వమే కొనుగోలు చేయటం, వాస్తవ సాగుదార్లకు ప్రభుత్వం రుణాలందించటం, వ్యవసాయ కార్మికులు, పేద రైతులకు ప్రభుత్వ, మిగులు భూములు పంచటం, సాగు నీరు అందించటం, పంటల బీమా పథకాన్ని సక్రమంగా అమలు చేయటం తదితర చర్యలు తీసుకోవటం ద్వారానే వ్యవసాయ సంక్షోభం పరిష్కారమౌతుంది. రైతుల ఆదాయాలు రెట్టింపు అవుతాయి.

విమర్శ

'మందిర్-మసీద్' వివాద మర్మమదే



అరుణ

అయోధ్యలో రామ మందిర నిర్మాణం తమ లక్ష్యం కాదని, ముప్పై ఒక్క సంవత్సరాల క్రితమే రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) స్పష్టం చేసింది. ఢిల్లీ పీఠాన్ని చేజిక్కించుకునేందుకు, భారత దేశాన్ని హిందూ రాజ్యంగా మార్చేందుకే 'రామ మందిర నిర్మాణ' అంశాన్ని ఉపయోగించుకోవాలని భావించింది.

27 డిసెంబర్ 1987లో ఆశ్చర్యకరంగా దేశంలో ఆనాడు వున్న మరే పత్రికల్లో రాని వార్త ఆర్ఎస్ఎస్ పత్రికలు 'పాంచజన్య, ఆర్గనైజర్'లో ప్రచురితమైంది. 'రామ భక్తులు విజయం సాధించారు. రామ మందిరం నిర్మాణం జరగనున్నది. కాంగ్రెస్ సర్కారు తప్పనిసరి పరిస్థితులలో రామ మందిర నిర్మాణం చేయనున్నది. రామ మందిర నిర్మాణం కోసం ఒక ట్రస్ట్ ఏర్పాటు కానున్నది'. అన్నదే ఆ వార్త సారాంశం. అయితే ఈ వార్త చదివిన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సర్వ సంఘ సంచాలకుడు బాలసాహబ్ దేవరస్, ఢిల్లీలోని ఆర్ఎస్ఎస్ కార్యాలయానికి, విశ్వ హిందూ పరిషత్ అధ్యక్షుడు అశోక్ సింఘాల్‌ను పిలిపించారు. 'నువ్వు చాలా ఏళ్లుగా స్వయం సేవకుడిగా పని చేస్తున్నావు...అటువంటి రామ మందిర నిర్మాణానికి ఆమోద ముద్ర ఎలా వేశావు?' అంటూ కోపంగా అశోక్ సింఘాల్‌ను ప్రశ్నించారు. 'మన ఆందోళన రామ మందిర నిర్మాణం కోసమే కదా! మందిర నిర్మాణం జరుగుతుందని నా ముందుంచిన ఫార్ములాని స్వాగతించాను' అన్నారు సింఘాల్. ఈ మాట విన్న దేవరస్ కోపంతో 'నీ తెలివి గడ్డి తినటానికి పోయిందా?' అంటూ మండిపడ్డారు. 'దేశంలో ఎనిమిది వందల రామ మందిరాలు వున్నాయి. అయోధ్యలో రామ మందిర నిర్మాణం జరిగితే.. అది దేశంలో ఎనిమిది వందల ఒకటవ రామ మందిరం అవుతుంది. కాకపోతే ఈ మందిరం కోసం జరుగుతున్న ఆందోళన ప్రజలలో పాపులర్ అవుతుంది. మందిర నిర్మాణం కోసం ప్రజా మద్దతు పెరుగుతుంది. ఈ ప్రజా మద్దతును మనం రాజకీయ రూపంలో వాడుకుని ఢిల్లీ గద్దె ఎక్కే అవకాశం వుంది. రాజకీయంగా ఇంతటి ప్రయోజనం చేకూర్చే రామ మందిర నిర్మాణ అంశంలో ఒక పరిష్కారంపై సమ్మతి తెలిపి మొత్తం ఆందోళనకు వెన్నుపోటు పొడిచావు' అని దేవరస్, సింఘాల్‌తో అన్నారు.



దేవరస్, అశోక్ సింఘాల్ మధ్య జరిగిన ఆనాటి మాటల సంవాద సమాచారం నా కల్పనతో నేను రాయటం లేదు. ఈ సమాచారం ఆసాంతం 1987లో అయోధ్య వివాదాన్ని పరిష్కరించటానికి ఏర్పాటు చేసిన 'అయోధ్య ట్రస్ట్'లో కన్వీనర్‌గా పని చేసిన శీతలా సింగ్ అందించారు. శీతలా సింగ్ ప్రఖ్యాత సీనియర్ జర్నలిస్టు. ఫైజాబాద్ నుండి ప్రచురితమయ్యే 'జన మోర్చ' దిన పత్రిక సంపాదకులు. 'అయోధ్య రామ జన్మభూమి బాబ్రీ మజిద్ కా సచ్' (అయోధ్య రామ జన్మ భూమి బాబ్రీ మసీదు నిజం) పుస్తకాన్ని హిందీలో రచించారాయన. ఆ పుస్తకం నూట పదవ పేజీలో పై సమాచారాన్ని అందించారు. 1987లోనే రామ మందిర నిర్మాణ వివాద పరిష్కారానికి 'అయోధ్య ట్రస్ట్' ఒక ఫార్ములా తయారు చేసింది. దాని ప్రకారం విదేశీ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి బాబ్రీ మసీద్‌కు ఎటువంటి హాని లేకుండా అది వున్న చోటు నుంచి వేరొక ప్రదేశానికి తరలించాలని, ఆ తర్వాత రామ్ చబుత్రా నుంచి రామ మందిర నిర్మాణం మొదలుపెట్టాలని. దీనిపై విశ్వ హిందూ పరిషత్ మహా మంత్రి అశోక్ సింఘాల్ సమ్మతి తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సర్వ సంఘ్ సంచాలకుడు బాల సాహబ్ దేవరస్, ఆయనపై ఆగ్రహాన్ని వ్యక్తపరిచారు. అంతేకాదు 'అయోధ్య ట్రస్ట్' చూపిన పరిష్కారానికి ఇచ్చిన సమ్మతి వెనక్కి తీసుకోవాలని అశోక్ సింఘాల్‌కి స్పష్టం చేసారు. 'అయోధ్య ట్రస్ట్' ఫార్ములాని అప్పటి ముస్లిం నాయకుడు సయ్యద్ షాహబుద్దీన్ కూడా అంగీకరించారు. మసీదుకు హాని లేకుండా కదిలించటానికి జామా మసీద్ ఇమాంతో కూడా ఒప్పించారు. అంతేకాదు 'అయోధ్య ట్రస్ట్' ఫార్ములాకి అప్పటి విశ్వహిందూ పరిషత్ ముఖ్య నాయకుడు మహంత్ అవైద్యనాథ్ కూడా తన సమ్మతిని ప్రకటించారు. మహంత్ పరమహంస. నృత్యగోపాల్ దాస్, జస్టిస్ దేవకీ నందన్ అగర్వాల్, నారాయణచారి వంటి నాయకులు ఆర్ఎస్ఎస్‌ని కాదని మహంత్ అవైద్యనాథ్ అనుచరులుగా వున్నారు. మహంత్ అవైద్యనాథ్ 'అయోధ్య ట్రస్ట్'లో సభ్యులు కారు. అయితే విశ్వహిందూ పరిషత్ ముఖ్య నాయకుడు.'అయోధ్య ట్రస్ట్' ఫార్ములాపై ఆమోద ముద్ర వేశారు. రచయిత శీతలా సింగ్ ప్రకారం ఓ సమావేశంలో మహంత్ అవైద్యనాథ్, శీతలా సింగ్‌తో ఇలా అన్నారు 'బిడ్డా మందిర నిర్మాణం జరిగేలా చూడు. విశ్వహిందూ పరిషత్‌లో ఉన్న అగ్ర కుల ఆర్ఎస్ఎస్ నాయకులకు కేవలం ఓట్లు ..నోట్లకు రాజకీయం కావాలి'.

దేవరస్ మాట విన్న విశ్వహిందూ పరిషత్ నాయకులు నెమ్మదిగా 'అయోధ్య ట్రస్ట్' రామ మందిర నిర్మాణానికి ఇచ్చిన పరిష్కార ఫార్ములా నుండి బయటకి రావటానికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని శీతలా సింగ్ తన పుస్తకంలో రాశారు. అలాగే రామ మందిర వివాదాన్ని ఎన్నికల కోసం కాంగ్రెస్ ఎలా వాడుకున్నదీ తెలిపారు. రామ మందిర వివాదం పుట్టుక, పూర్వోత్తరాలు, వివాదాలు, మందిరం చుట్టూ వున్న ఆధ్యాత్మిక భావాలను రాజకీయ పార్టీలు వాడుకున్న తీరుపై 'అయోధ్య ట్రస్ట్' కన్వీనరుగా వ్యవహరించిన శీతలా సింగ్ ఎంతో విలువైన సమాచారాన్ని అందించారు. 'నిజం తెలుసుకోవాలనుకునే భావితరాల ముందు ఒక నిజాయితీ రికార్డు ఉంచాలనే ఈ పుస్తకం రాశా' అని శీతలా సింగ్ అంటున్నారు. సుప్రీం కోర్టులో రామ జన్మ భూమి కేసు నడుస్తున్నది. హిందువుల సహనాన్ని పరీక్షిస్తున్నారని బిజెపి, ఆరెఎస్ఎస్‌లు అంటున్నాయి. అసలు హిందువుల సహనంతో ఆడుకున్నదెవరో తెలుసుకోవాలంటే శీతలా సింగ్ రాసిన 'అయోధ్య రామ జన్మభూమి బాబ్రీ మజిద్ కా సచ్' పుస్తకాన్ని చదవాలి.

(ఢిల్లీ నుంచి)


వ్యాసాలు, ఉత్తరాలు పంపాల్సిన చిరునామా
editpageps@gmail.com





సరిహద్దుల్లో.. సాహస ప్రయాణం..

తెలుగునాట మీడియా అంటే.. రాజకీయవార్తలే.. ఇంకేముండదు.. అనే ఓ అపవాదూ ఉంది. ముఖ్యంగా ఛానల్స్ వచ్చాక.. ఆ రాజకీయ వార్తాధోరణి మరింత పెరిగిందనే చెప్పాలి. అలాంటి సమకాలీన మీడియా పరిస్థితుల్లోనూ.. కాస్త సాహసోపేతమైన వార్తల్ని ప్రేక్షకుల ముందుంచడం అలవాటుగా చేసుకుందామె. నిజానికి మీడియా ప్రతినిధుల బాధ్యత ఇదే. సమాజంలోని డొల్లతనాన్ని ఎండగట్టేందుకు ఎక్కడా వెనకడుగు వేయకూడదు. వృత్తికి న్యాయం చేయాలి. ఈమె అదే చేసింది. అలా లోకంలో జరిగే చీకటి మోసాల నుంచీ సరిహద్దుల్లో వీరోచితంగా స్వైరవిహారం చేసే సైనికుల పోరాటాలకూ తానో సాక్ష్యంగా నిలిచింది. పేరు రెహాన. వృత్తి మీడియా జర్నలిస్ట్. ఆ వృత్తిలో కొత్త పంథాను వెదుక్కోవడం వల్లనే ఆమె మరికొందరికి స్ఫూర్తిగా నిలిచింది. రండి రెహాన సరిహద్దుల వెంబడి సాగించిన సాహస ప్రయాణం గురించి తెలుసుకుందాం!



కృష్ణాజిల్లా ఉయ్యూరులో పుట్టారు రెహాన. కుటుంబంలో చదువుకున్న వాళ్లులేరు. సంప్రదాయాలకు విలువిచ్చే కుటుంబం. కెరీర్ గురించి ఆలోచించేలోపే టీచర్ ఉద్యోగంలో స్థిరపడ్డారు. 'పిజి ఎకానామిక్స్ చేశాక నా పరిధి వేరు. నేనుండాల్సింది ఇక్కడ కాదు. ఇంకా ఏదో చెయ్యాలనే తపన లోలోపల నన్ను వెంటాడేది' అని అంటారు రెహాన. అప్పుడే ఈనాడు జర్నలిజం స్కూల్ ప్రకటన చూశారామె. ముందు నుంచీ న్యూస్, ఆర్టికల్స్ చదవడం ఆమెకు అలవాటు. రెహాన అమ్మ చదువుకోకపోయినా ఆమెను బాగా ప్రోత్సహించారు. రెహానాకు ముగ్గురు అన్నయ్యలు, ఒక అక్క ఉన్నారు. డిగ్రీ వరకూ చదివింది మాత్రం ఆమె ఒక్కతే. జర్నలిజం స్కూల్ నుంచి ఆమె కెరీర్ అనుకోని మలుపు తిరిగింది. చేసే పనిలో ఛాలెంజ్ ఉండాలని కోరుకుంటారు రెహాన. అందుకే ఎలక్ట్రానిక్ మీడియా రంగంలోకి అడుగుపెట్టారు. ఈ విషయాలన్నీ ఇంట్లోవాళ్లకు తెలీదు. జాబ్ కోసం వెళ్తోంది అనుకునేవారంతా.

స్టింగ్ ఆపరేషన్‌తో మొదలై..

ఓ టీవీలో పనిచేస్తూ... అరబ్ షేకులపై 2006లో ఒక స్టింగ్ ఆపరేషన్ చేశారు రెహాన. పాతబస్తీలో మైనర్ అమ్మాయిలను అరబ్బు షేకులకిచ్చి కాంట్రాక్ట్ వివాహం చేస్తుంటారు. అమ్మాయి వయస్సు, అందాన్ని బట్టి డిమాండ్ ఉంటుంది. సగానికి పైగా మధ్యవర్తులు తీసుకుని, మిగతా డబ్బు పెళ్లికూతురు తల్లిదండ్రులకు ఇస్తారు. ఇదంతా అమ్మాయి కుటుంబం మోజుతోనో, ఏదో సరదాకు చేస్తున్నారు అనుకుంటే పొరబడినట్టే.. పాతబస్తీలో ఒక్కో కుటుంబానికి పదిమంది పిల్లలుంటారు. పేదరికంతో అల్లాడుతుంటారు. బిడ్డలకు ఇంత ముద్ద పెట్టాలనే ఆరాటంలో అరవై, డెబ్బై ఏళ్ల వారితో పెళ్లిచేసి, పసిమొగ్గల్ని కాలరాస్తున్నారు. ఉన్నంత కాలం అమ్మాయితో ఉండి, ఆరునెలలు డబ్బు పంపి, తర్వాత నిర్దాక్షిణ్యంగా వదిలేస్తారు వాళ్లు. అమ్మాయి గర్భం దాల్చినా ఎవరూ పట్టించుకోరు..'ముస్లిం మహిళను కావడంతో దీన్ని బట్టబయలు చెయ్యాలని ఈ రాకెట్‌లోకి వెళ్లా. అక్కడి వాతావరణం ఎలా ఉంటుంది? అమ్మాయిల్ని షేకుల ముందు గొర్రెల్లా ఎలా ప్రదర్శిస్తారు? పెళ్లి తంతు ఎలా జరుగుతుంది? ఇలా నాలో అనేక ప్రశ్నలు. వేషం మార్చుకుని పెళ్లి కావాల్సిన అమ్మాయిలా వెళ్లాను. ఒక దుబాయి షేక్ నన్ను ఇంటర్వ్యూ చేశాడు. నిప్పుతో చెలగాటమే.. అయినప్పటికీ వెనకడుగు వెయ్యలేదు. ఇదంతా టీవీలో చూసి ఇంట్లో చాలా భయపడ్డారు. ఇంటికి రమ్మనీ ఒత్తిడి చేశారు. మంచి గుర్తింపు తెచ్చిన అంశంతో పాటు పూర్తి సంతృప్తి చెందిన అనుభవమూ ఇదే' అని ఒళ్లు గగుర్పొడిచే విషయాలు చెప్పారు రెహాన.

బెదిరింపులకు.. అదరక బెదరక

హైదరాబాద్‌లోని ఒక చారిత్రిక ప్రాంతాన్ని ఒక పహిల్వాన్ కబ్జా చేశాడు. ఆ విషయాన్ని రెహాన ఆధారాలతో సహా బట్టబయలు చేశారు. దీంతో కబ్జాదారుల నుంచి బెదిరింపులు మొదలయ్యాయి. అయినా ఆమె ఏమాత్రమూ భయపడలేదు. 'ఏది చేసినా నిజాయితీగా చేస్తున్నాను. తప్పు చెయ్యట్లేదు అనే నమ్మకం ఎప్పుడూ ఉండేది. అందుకే దేనికీ భయపడలేదు. అలా అని గుడ్డిగానూ వెళ్లిపోను. తగిన జాగ్రత్తలతోనే ముందుకు వెళ్తాను' అని ఆత్మవిశ్వాసంతో చెప్పారు రెహాన. దేశవ్యాప్తంగా జరిగిన అనేక ముఖ్యమైన సంఘటనలను ప్రత్యక్షంగా రిపోర్టు చేశారు. ఉత్తరాఖండ్‌లో వరదలతో అన్ని దారులూ మూసుకుపోయిన క్లిష్ట పరిస్థితిలోనూ కొండలు, గుట్టలు ఎక్కి వెళ్లి వరదలో చిక్కుకున్న తెలుగువాళ్లను ఇంటర్వ్యూ చేశారు. 2008, 26/11 ముంబయి సంఘటనలో ఓ పక్క కాల్పులు జరుగుతున్నా... ధైర్యంగా లైవ్ కవరేజీ ఇచ్చారు. ఈ కవరేజ్‌కు తరువాత 'బెస్ట్ జర్నలిస్ట్' అవార్డు కూడా వచ్చింది. ఈ మారణహోమంలోనే పోలీసులు ఉగ్రవాదుల్ని చంపి, కసబ్‌ను పట్టుకున్నారు. ఇది అన్నింటికన్నా అతి క్లిష్టమైన ఆపరేషన్ అంటారు రెహాన.

ధైర్యంగా.. ముందడుగు

బోర్డర్‌లో సర్జికల్ స్ట్రైక్స్ జరిగినప్పుడు ఆఫీస్ నుంచి రాత్రి మూడు గంటలకు ఫోన్ చేసి, ఉదయం 6 గంటల ఫ్లైట్‌కి వెళ్లాలన్నారు. అప్పటికప్పుడు ప్రయాణానికి సిద్ధమవ్వలేక ఇంకో ఫ్లైట్‌కి టిక్కెట్ బుక్ చెయ్యమన్నారు ఈమె. జమ్మూకాశ్మీర్ విషయం అప్పటికి ఆఫీస్‌లో అసైన్ చెయ్యలేదు. ఢిల్లీ వెళ్లాక, రిస్క్ ఉండదని ఈమెను పంజాబ్, మేల్ రిపోర్టర్‌ని జమ్మూకాశ్మీర్ పంపుతామన్నారు. 'రిస్క్ లేకుండా ఏపనీ చెయ్యలేను.. జమ్మూకాశ్మీర్ నేనే వెళ్తాను' అన్నారు రెహాన. అక్కడ పూర్తిగా యుద్ధ వాతావరణం. దీనికి తోడు ఆమె జమ్మూ వెళ్లింది లేదు. అనుమతి లేనిదే కెమేరా బయటకు తియ్యలేం సరికదా.. వెళ్లినవారిని బంధించినా చేసేదేమీ లేదు. ఆర్మీకి ఈ విధమైన రైట్స్ ఉంటాయి. అయినా.. గట్టి ప్రయత్నంతో షూట్ చెయ్యడానికి అనుమతి సంపాదించారు రెహాన. 'ఆర్మీ సమర్థతతో పాటు, పాకిస్తాన్ దాడి చేస్తే ఎలా ఎదుర్కొంటారు? షూట్ చెయ్యాలని అనుకున్నాను. రాత్రుళ్లు రిస్క్ ఎక్కువ, పగలు షూట్ చెయ్యండి అన్నారు ఒక ఆఫీసర్. సిపాయి ప్రాణాలకు తెగించి ఎలా పోరాడుతున్నాడో చూపించాలంటే.. వాటిని నేనూ ఫేస్ చెయ్యాలని చెప్పాను' అని రిపోర్టర్ పరిణితిని కళ్లకు కట్టారు రెహాన.

సైనికుల మధ్య విధులు

అంతర్జాతీయ బోర్డర్‌లో చిన్న అలికిడైనా, మనిషి కదలికలు ఉన్నా.. ఏదో హాని జరగబోతోందని కాల్పులు మొదలుపెడతారు. అంతేకాదు సర్జికల్ స్ట్రైక్స్ జరగడంతో ఉగ్రవాదులు కసితో ఉంటారు. జరగరానిది జరిగితే జాతీయ సమస్య అవుతుంది. జర్నలిస్ట్‌ని ఎందుకు తీసుకెళ్లారు..? అనే ప్రశ్నలూ వస్తాయి. 'ప్రాణాలకు తెగించి ఎందుకు వస్తున్నావమ్మా? ఇలాంటి ఉద్యోగం అవసరమా?' అని అప్పటికే ఒక ఆఫీసర్ అడిగారు. 'భారతదేశాన్ని కంటికి రెప్పలా కాపాడుతున్న సైన్యం మధ్యే ఉన్నాను కదా.. నాకింక భయమెందుకు? అనడంతో.. ఆ ఆఫీసర్ సంతోషించి, నాకూ 17 కిలోల బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్, 4 కిలోల టోపీ ఇచ్చారు. ఇవి లేకుండా పాకిస్తాన్ బోర్డర్‌లోకి వెళ్లలేం. వీటిని తొడిగితేనే కదా! సోల్జర్ ఎలా మోస్తున్నాడో తెలియడంతో పాటు రిపోర్టు కచ్చితంగా వస్తుంది. ఎక్కడ సంక్లిష్టత ఉంటుందో... ఏదైతే ఎవరూ చూడలేరో దాన్ని ప్రపంచానికి చూపాలి అనుకుంటాను' అని వివరించారు రెహాన.

సవాళ్ళు.. అధిగమించి

ఏవృత్తిలోనైనా.. రోల్‌మోడల్‌గా నిలవాలంటే.. అందుకు తగ్గ వేదికలు అవసరం. ఉద్యోగి ప్రతిభకు తగ్గట్టుగా ప్రోత్సహించే సంస్థలూ ఉండాలి. మొదట్నుంచీ తను పనిచేసే సంస్థలు రెహానాకు అండగా నిలిచాయి. ఆ క్రమంలోనే భిన్నమైన టాస్క్‌లు చేసే అవకాశాలు దక్కాయి. అలా తను చేసే ఛానల్ మేనేజ్‌మెంట్ ఆమెను బోర్డర్‌కి పంపడానికి అనుమతించింది. మలేరియా ప్రభావిత అడవుల్లో మొట్ట మొదటిది త్రిపుర. టెర్రరిస్టుల భయం కన్నా ఒక దోమ కుడితే చచ్చిపోతారన్న భయం ఎక్కువగా ఉంటుందక్కడ. వీటితో పాటు సుందర్‌బన్ అడవుల్లోని జలసరిహద్దులో ఎలా కాపలా కాశారు అనే.. వైవిధ్యమైన అంశాలు కవర్ చేస్తూ.. ఇండో-పాకిస్తాన్, ఇండో-బంగ్లాదేశ్ ట్రావెల్ పూర్తి చేశారు. 'ఒక జర్నలిస్ట్‌గా నా ప్రయాణం చాలా సంతృప్తిని ఇచ్చింది. రాజకీయం, యుద్ధ వాతావరణం, డిఫెన్స్ కావొచ్చు.. భిన్నమైన సవాళ్ళను ఎదుర్కొన్నాను. ఇవన్నీ 'కంచె' పేరున ఎన్‌టీవీలో 15 సిరీస్‌లు టెలికాస్ట్ అయ్యాయి. కొన్ని అనుభవాలు టీవీలో చూపలేం. కొన్ని పరిమితులుంటాయి. అప్పుడే వీటిని పుస్తకంగా తీసుకురావాలనే ఆలోచన కలిగింది' అంటారు రెహాన.




ఆ అనుభవాలతో ఓ పుస్తకం

దేశసరిహద్దుల నుంచి.. మన సైన్యం మధ్యలోంచి... దట్టమైన అడవుల్లో తిరుగాడిన అనుభవాల్లోంచి రెహాన ఓ పుస్తకం రాశారు. దాని పేరు 'సరిహద్దుల్లో'. 'ఈ విధంగా బోర్డర్ గురించి తెలియని విషయాలు, అక్కడి జీవితాలు ప్రపంచానికి చూపడం సంతృప్తినిచ్చింది' అని తను రాసిన పుస్తకం గురించి తెలియజేశారు రెహాన. ఒకపక్క జర్నలిజం వృత్తిలో కొనసాగుతూనే 'అంతర్జాతీయ అంశాలు మన తెలుగు మీడియా' అంశంపై పద్మావతి యూనివర్శిటీలో పిహెచ్‌డి చేస్తున్నారు రెహన. భార్యగా, తల్లిగా, బిడ్డగా, చెల్లిగా మన పాత్ర నిర్వర్తించినప్పుడే వృత్తికీ న్యాయం చెయ్యగలమని బలంగా నమ్ముతారామె. నరేంద్రమోడీతో సహా వివిధ రాష్ట్రాల పది మంది ముఖ్యమంత్రులను ఇంటర్వ్యూ చేశారు. అనేక అవార్డులూ రివార్డులూ పొందారు.

రిపోర్టింగ్ కేవలం ఒక వృత్తి కాదు.. అదొక శ్వాస.. తపన.. సాహసం.. తన మాటతో, రాతతో సమాజానికి ఏదో మేలు చేయాలన్న బలమైన ఆకాంక్ష. ఆ క్రమంలో ఒక్కో మెట్టూ ఎక్కుతుంటే మనసుకు ఎనలేని ఆనందం. అలాంటి ఆనందాల వెల్లువలు రహాన వృత్తిజీవితంలో ఎన్నెన్నో..! మరిన్ని విజయసోపానాలు అధిరోహించాలని ఆశిద్దాం.

- వైష్ణవిశ్రీ












జీవన చిత్రం

ఫొటో : కె. అరుణ్ కుమార్



శొంఠితో.. ప్రయోజనాలెన్నో..!



చాలా మంది అనారోగ్య సమస్య వచ్చినప్పుడల్లా రకరకాల మందులను వాడుతుంటారు. వీటిని దీర్ఘకాలంగా వాడటం వల్ల సైడ్ ఎఫెక్ట్స్ వచ్చే అవకాశం ఉంది. అందుకే ఏ రోగానికైనా దీర్ఘకాలంగా మందులు వాడటం మంచిది కాదు. ఇంట్లో సహజంగా లభించే పదార్థాలతోనే అజీర్తి లాంటి అనేక అనారోగ్య సమస్యలను తగ్గించుకోవచ్చు. ముఖ్యంగా శీతాకాలంలో పిల్లలకు తరచూ జలుబు, దగ్గు లాంటివి వస్తూ ఉంటాయి. వీటికి మన ఇంట్లో లభించే శొంఠి చక్కటి ఔషధంలా పనిచేస్తుంది. అది ఎలాగో చూద్దాం..

శొంఠి పొడిని పేస్ట్‌లా చేసి, నుదిటికి రాస్తే తలనొప్పి నుంచి తక్షణ ఉపశమనం కలుగుతుంది. చాలావరకూ తలనొప్పికి ఉపయోగించే థెరపీలలో దీన్ని ఉపయోగిస్తుంటారు. అదే విధంగా గొంతుకు రాయడం వల్ల గొంతునొప్పి నుంచి త్వరగా ఉపశమనం దొరుకుతుంది. శొంఠి చూర్ణాన్ని చెరుకు రసంతో కలిపి తాగడం వల్ల పొట్టలో ఉండే చికాకు తగ్గుముఖం పడుతుంది. ప్రతిరోజూ ఉదయం పరగడుపున దీన్ని తాగడం వల్ల పొట్ట సమస్యలు తగ్గిపోతాయి. శొంఠి చూర్ణంలో యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి. ఇది ఆర్థరైటిస్ నుంచి ఉపశమనం కలిగిస్తుంది. రెండుమూడు టేబుల్ స్పూన్ల శొంఠి పొడికి నీళ్ల కలిపి వేడి చేసి, తాగడం వల్ల జాయింట్ వాపులు తగ్గుతాయి. మోకాళ్ళకు ఈ పేస్ట్ లేదా శొంఠి కలిపిన వాటర్‌ను అప్లై చేస్తే నొప్పి నుంచి త్వరగా ఉపశమనం కలుగుతుంది. శొంఠి పొడిని సాధారణంగా లేదా సీజనల్‌గా వచ్చే జలుబును నివారించడంలో బాగా సహాయపడుతుంది. జలుబు, దగ్గు ఉన్నప్పుడు శొంఠి పొడికి కొద్దిగా మిరియాల పొడి, చిటికెడు బెల్లం కలిపి చేసిన కషాయం తాగడం వల్ల జలుబు, దగ్గు నుంచి ఉపశమనం కలుగుతుంది. శొంఠి చూర్ణానికి లవంగాల పొడి, ఉప్పు కలిపి, రోజుకు రెండుసార్లు తీసుకుంటే జలుబు, దగ్గు త్వరగా తగ్గుతాయి. శొంఠిలో థర్మోజనిక్ ఏజెంట్స్ ఉంటాయి. ఇవి కొవ్వును కరిగించి, ఊబకాయాన్ని తగ్గించే స్వభావాన్ని కలిగి ఉంటాయి. ★

జీవన సౌరభం

మనసు ఉన్నతమైన భావాలతో ఆలోచనలతో ఉంటే.. మనలను ధీరులుగాను, నాయకులుగాను ఎదిగేలా చేస్తుంది.

మీకోసం

మొటిమలు తగ్గాలంటే పది నిమ్మ ఆకుల్ని తీసుకుని, మెత్తగా పేస్టు చేసుకుని అందులో చిటికెడు పసుపు కలిపి రాసుకోవాలి. ఇలా వారం పాటు చేస్తే ఫలితం ఉంటుంది.



విజయవాడలో రేపే లలితా జ్యూయలరీ ప్రారంభం

హాజరుకానున్న యనమల

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

దక్షిణ భారత్‌లో బంగారు నగల విక్రయాల్లో అగ్రగామిగా ఉన్న లలిత జ్యూయలరీ విజయవాడలో అడుగుపెట్టబోతోంది. ఈ నెల 21న ఉదయం 10 గంటలకు విజయవాడలోని సిద్ధార్థ నగర్‌లో తమ నూతన షోరూమ్‌ను ప్రారంభించనున్నట్లు లలిత జ్యూయలరీ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎం కిరణ్‌కుమార్ తెలిపారు. స్థానిక డివి మానర్ హోటల్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ విషయం చెప్పారు. విజయవాడ షోరూమ్‌ను రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు ప్రారంభిస్తారన్నారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, లైకా గ్రూప్ చైర్మన్ ఎ సుభాస్కరన్ ప్రభృతుల సమక్షంలో ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ప్రపంచంలోని నగల విక్రయాల షోరూమ్‌లలో విజయవాడలో ప్రారంభించే షోరూమే అతి పెద్దదని ఆయన చెప్పారు. నాణ్యమైన నగలు విక్రయించడంతో పాటు పారదర్శకత పాటించడం తమ విజయరహస్యమని, అందరికీ తక్కువ ధరలకు బంగారు అభరణాలను అందించాలనే ఉద్దేశంతోనే లలితా జ్యూయలరీని నెలకొల్పామన్నారు.

సిరిబంధం పేరిట కొత్త స్కీమ్

షోరూమ్ ప్రారంభోత్సవం సందర్భంగా 'సిరిబంధం' పేరిట కొత్త స్కీమ్ అందిస్తున్నామనీ, నగల అడ్వాన్స్ బుకింగ్ కోసం మరో ప్రత్యేక స్కీమ్‌ను ప్రవేశపెట్టామని కిరణ్ తెలిపారు. 'సిరిబంధం' వినియోగదారులకు తొలి వాయిదా ఉచితమని తెలిపారు. మిగిలిన మొత్తాన్ని రూ.1000, రూ.1500, రూ.2000, రూ.2500 వంటి 11 సులభ వాయిదాలతో ఈ స్కీమ్‌లో చేరవచ్చునని వివరిం చారు. నగదు రూపంగానూ, బంగారం రూపంగానూ ఆదా చేసుకునే సౌకర్యం కల్పించామన్నారు. ఒకేసారి మొత్తం నగదు చెల్లించి కొనుగోలు చేయాలనుకునే వినియోగదారుల కోసం 'అడ్వాన్స్ నగల బుకింగ్ స్కీమ్'ను ప్రవేశపెట్టామని, ఈ తరహా స్కీమ్‌ను తొలిసారిగా తామే ప్రారంభిస్తున్నామని ఆయన తెలిపారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కిరణ్‌కుమార్

ఎల్అండ్‌టి హోవిట్జర్ ఫ్యాక్టరీ ప్రారంభం

హజిరా : గుజరాత్‌లోని హజిరా వద్ద లార్సన్ అండ్ టబ్రో (ఎల్ అండ్‌టి) సంస్థ నెలకొల్పిన హోవిట్జర్ తుపాకీ తయారీ కేంద్రాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ శనివారం ప్రారంభించారు. కాలిబర్ ట్రాక్డ్ సెల్ఫ్ ప్రొపెల్డ్ సామర్థ్యముండే వంద యూనిట్ల కె9 వజ్రా - టి1555 ఎంఎం/52 తుపాకీ వ్యవస్థలను సైన్యానికి సరఫరా చేసేందుకుగాను రూ.4500 కోట్ల విలువైన కాంట్రాక్టును 2017లో ఎల్అండ్‌టి దక్కించుకుంది. వీటి తయారీ కోసం సూరత్‌కు 30 కిలోమీటర్ల దూరంలోని హజిరా లో 'ఆర్మర్డ్ సిస్టమ్స్ కాంప్లెక్' ను ఎల్ అండ్ టి నెలకొల్పింది. దేశంలో ప్రయివేటు రంగంలో ఇటువంటి కాంప్లెక్స్ ఏర్పాటు చేయడం ఇదే తొలిసారి.

ఉద్యోగాలు కల్పించే స్థాయికి యువత ఎదగాలి

స్టార్ట్ ఎపి సిఇవో సిద్ధార్థ్ మారి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



ఉపాధి కోసం ఎదురుచూసేలా కాకుండా ఉద్యోగాలు కల్పించే స్థాయికి యువత ఎదగాలని స్టార్ట్ ఎపి సిఇవో సిద్ధార్థ్ మారి చెప్పారు. యువ పారిశ్రామిక వేత్తలను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సహిస్తోందన్నారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శనివారం జరిగిన 'స్టార్ట్ ఎపి' కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. రాష్ట్రం నుంచి అత్యధికులు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలనే ఆలోచనతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. యువతరం రూపొందించిన సరికొత్త ఆవిష్కరణలు వెలుగులోకి వచ్చేలా కృషి చేస్తామనీ, భావి పారిశ్రామిక వేత్తల్లో ఉత్తేజాన్ని, విశ్వాసాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు యువకులు తమ ప్రాజెక్టులను ప్రదర్శనకు ఉంచారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీ నిర్మాత శోభూ యార్లగడ్డ, అబి బస్ వ్యవస్థాపకులు సుధాకర్ రెడ్డి పారిశ్రామికవేత్తలుగా తమ అనుభవాలను యువతతో పంచుకున్నారు. సాఫ్ట్‌వేర్ కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకుని తరగతి గదుల నుంచే ప్రాజెక్టులు చేసేలా విద్యార్థులు ఎదగాలని సుధాకర్ చెప్పారు. వృత్తివిద్యా కోర్సుల్లో పట్టాలు పొందిన వారికి సైతం పుస్తక జ్ఞానం తప్ప వృత్తి నైపుణ్యం ఉండడం లేదని, ఇలాంటి కార్యక్రమాలు ద్వారా వృత్తి నైపుణ్యం కూడా అవర్చుకోవచ్చునని శోభూ యార్లగడ్డ తెలిపారు

1.13 లక్షల కోట్లు

ఇది అమ్ముడుపోని అపార్ట్‌మెంట్ల విలువ

- సంక్షోభం దిశగా నిర్మాణ రంగం

ప్రజాశక్తి - న్యూఢిల్లీ



దేశ వ్యాప్తంగా నిర్మాణరంగం సంక్షోభ దిశలో పయనిస్తోందా! తాజా గణాంకాలు ఇదే అనుమానాన్ని కలిగిస్తున్నాయి. దేశంలోని అతి పెద్ద 27 రియల్ ఎస్టేట్ కంపెనీల వద్ద 2018 మార్చి నాటికి 93, 385 కోట్ల రూపాయల విలువైన అమ్ముడుకాని ఆపార్ట్‌మెంట్లు ఉండగా, సెప్టెంబర్ నాటికి అవి 1,13,000 కోట్ల రూపాయలకు చేరుకున్నాయి. అంటే, ఆరు నెల కాలంలోనే అమ్ముడుపోని అపార్ట్‌మెంట్లు,ఇతర నిర్మాణాలు 21 శాతం మేర పెరిగాయి. ఈ దశాబ్దకాలంలో అమ్మకాలు జరగకుండా ఇంత పెద్దమొత్తంలో నిలిచిపోవడం ఇదే మొదటిసారి. భారీ మొత్తం వెచ్చించి చేపట్టిన నిర్మాణాలు ఇలా నిరుపయోగంగా మారడం ఇప్పుడు ఆందోళనకరంగా మారింది. మన దేశంలో సగటున ఒక సంవత్సరానికి 40,000 కోట్ల మేరకు అమ్మకాలు జరుగుతున్నాయన్నది ఒక నిర్ధారణ. దీనిని ప్రమాణికంగా తీసుకుంటే ప్రస్తుత నిర్మాణాలన్నీ అమ్ముడుపోవాలంటే కనీసం మూడు సంవత్సరాల సమయం పడుతుంది. 2014 లో రూ. 46వేల కోట్లు మేర అమ్మకాలు జరిగాయి. అప్పటి నుంచే క్రమంగా తగ్గుతూ ప్రస్తుతం రు.40,000 కోట్లకు చేరింది. అయితే, ఇది అత్యున్నత స్థాయిలో ఉన్న 27 కంపెనీలకు సంబంధించిన సమాచారంమాత్రమే! చిన్న కంపెనీలు, వ్యక్తులు చేసే వ్యాపారాన్నీ కూడా పరిగణలోకి తీసుకుంటే అమ్ముడుపోని ఆస్తుల విలువ ఇంతకు రెండింతలుండే అవకాశముందన్నది అంచనా! ప్రైవేటు రంగంలో పెద్ద ఎత్తున భవన నిర్మాణరంగం ఉపాధి కల్పిస్తున్న విషయం తెలిసిందే. లక్షలాది మంది కార్మికులు దీని మీద ఆధారపడి బతుకుతున్నారు. బ్యాంకులు, ఫైనాన్సు కంపెనీలు ఈ రంగానికి లక్షల కోట్లరూపాయలను రుణంగా సమకూరుస్తున్నాయి. ఇటువంటి కీలకపాత్ర పోషిస్తున్న రియల్‌ఎస్టేట్ రంగంలో అమ్మకాలు సంవత్సరాల తరబడి నిలిచిపోవడమంటే దేశ ఆర్థిక వ్యవస్థపై కలిగే ప్రతికూల ప్రభావాన్ని ఊహించవచ్చు. అమ్మకాలు నిలిచిపోతే అప్పులిచ్చిన ఫైనాన్స్ కంపెనీలకు, బ్యాంకులకు బిల్డర్లు అప్పుతీర్చగలిగే పరిస్థితి ఉండదు. ఒకపక్క అమ్మకాలు ఏటా 3.2 శాతం లెక్కన తగ్గుతుంటే ఇంకోవైపు అమ్ముడుపోని నిర్మాణాల విలువ ఏటా 8.2 శాతం లెక్కన పెరిగిపోతోంది. పరిస్థితి ఇలాగే కొనసాగితే అటు అప్పులిచ్చిన ఫైనాన్స్ కంపెనీలు, ఇటు బిల్డర్లు చేతులెత్తేసే పరిస్థితి వస్తుంది. ఇప్పటికే ఆ ప్రమాదం పొంచి ఉంది. నిర్మాణరంగానికి అప్పులిచ్చే ఫైనాన్స్ సంస్థలలో ముందున్న ఐఎల్అండ్ఎఫ్ (ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లీజింగ అండ్ ఫైనాన్సియల్ సర్వీసెస్) ప్రస్తుతం 91 వేల కోట్ల రూపాయల అప్పుల్లో మునిగిఉంది. దీనిని అనుసరించి మిగిలిన ఫైనాన్స్ కంపెనీలు చేతులెత్తేసే పరిస్థితి వస్తుంది. అతి బలమైన ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా భారతదేశాన్ని నిలబెట్టానని ప్రధానమంత్రి నరేంద్రమోడీ చెబుతున్న మాటలలో డొల్లతనం ఎంతుందో అర్థమవుతోంది కదూ!

కంపెనీ	అమ్ముడుపోని అపార్ట్‌మెంట్లవిలువ (రూ. కోట్లలో)
డి.ఎల్ఎఫ్. కంపెనీ	23,815
హెడిఐఎల్	14,560
డై స్పేజ్ ఎస్టేట్స్	12,795
ఇండియా బుల్స్	10,470
ఒమేక్స్	8,048

హిమాలయ కొత్త ఉత్పత్తులు

హైదరాబాద్ :



హిమాలాయ డ్రగ్ కంపెనీ తన పూర్తి యాంటీ హెయిర్ ఫాల్ శ్రేణీ ఉత్పత్తులను హైదరాబాద్‌లో ప్రదర్శించింది. హెయిర్ ఆయిల్, షాంపు, కండీషనర్, అంటీ హెయిర్ ఫల్ క్రీమ్ తదితర ఉత్పత్తులను ప్రముఖ హీరోయిన్ ప్రనిత సుబాష్ ఆవిష్కరించారు. ఈ ఉత్పత్తులను నిత్యం ఉపయోగించడం ద్వారా శిరోజాలను ఆరోగ్యవంతంగా ఉంచుకోవచ్చని ఆ కంపెనీ పేర్కొంది.

ఒబిసి ప్రగతిపై సమీక్ష..

హైదరాబాద్ : ఓరియంటల్ బ్యాంకు ఆఫ్ కామర్స్ (ఒబిసి) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్ బాలక్రిష్ణ అల్సే తమ హైదరాబాద్, విజయవాడ సర్కిల్ ఉద్యోగులతో హైదరాబాద్‌లో సమావేశం నిర్వహించారు. రెండు నగరాల్లోని బ్యాంకు ప్రగతిపై ఆయన సమీక్షించారు. హైదరాబాద్ సర్కిల్ హెడ్ అరుణ్ కుమార్ అగర్వాల్ ప్రారంభ ఉపన్యాసం చేశారు. ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడానికి ఉద్యోగులు కృషి చేయాలని బాలక్రిష్ణ సూచించారు. ఈ సందర్భంగా స్టార్ పర్ఫార్మెన్స్ కలిగిన బ్యాంకు మేనేజర్లను ఆయన సన్మానించారు.

హెచ్‌డిఎఫ్‌సి లాభాల్లో వృద్ధి

న్యూఢిల్లీ : హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 2018-19 అక్టోబర్ నుంచి డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో 20.31 శాతం వృద్ధితో రూ.5,585.9 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంతక్రితం ఆర్థిక సంవత్సరం ఇదే క్యూ3లో రూ.4,642.60 కోట్ల లాభాలు నమోదు చేసింది. గత త్రైమాసికంలో బ్యాంకు మొత్తం ఆదాయం 26 శాతం పెరిగి 30,811.3 కోట్లకు చేరింది.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

భారత సుప్రీం కోర్టు - నిర్మాణం - అధికారాలు- న్యాయ సమీక్ష



కెఎస్ లక్ష్మణరావు,
శాసనమండలి మాజీ సభ్యులు
సెల్ : 94402 62072

ఆధునిక నాగరిక సమాజంలో న్యాయవ్యవస్థకు ప్రత్యేక స్థానం ఉంది. దేశంలో అన్యాయాలను, అక్రమాలు అరికట్టి ప్రజల ధన, మాన, ప్రాణాలను కాపాడడానికి పటిష్టమైన వ్యవస్థ అవసరం. రాజ్యాంగాన్ని పరిరక్షించడం, కేంద్ర, రాష్ట్ర శాసనసభలు రూపొందించిన శాసనాలు రాజ్యాంగబద్ధంగా ఉన్నాయో లేవో పరిశీలించడం, ఒకవేళ రాజ్యాంగ బద్ధంగా లేకపోయినట్లయితే ఆ శాసనాలను కొట్టివేయడం చేస్తుంది. పౌరుల ప్రాథమిక హక్కులకు భంగం కలిగినట్లైతే న్యాయస్థానాలు తమ తీర్పుల ద్వారా పరీక్షిస్తాయి. భారత రాజ్యాంగం సమాఖ్య రాజ్యాంగం అవడం వల్ల కేంద్ర, రాష్ట్రాల మధ్య ఏర్పడిన వివాదాలను పరిరక్షిస్తుంది.

ఏకీకృత న్యాయవ్యవస్థ

భారత సుప్రీంకోర్టు అత్యున్నత న్యాయస్థానమే గాక హైకోర్టులపైన పర్యవేక్షణాధికారం గల అత్యున్నత న్యాయస్థానం కూడా. ప్రధాన న్యాయమూర్తులను, ఇతర న్యాయమూర్తులను రాష్ట్రపతి నియమిస్తాడు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి సలహాలపై రాష్ట్రపతి హైకోర్టు న్యాయమూర్తులను నియమిస్తాడు. సుప్రీంకోర్టుకు హైకోర్టులపై పాలనాపరమైన పర్యవేక్షణాధికారం ఉంటుంది. రాష్ట్రపతి హైకోర్టు న్యాయమూర్తులను బదిలీచేసే సందర్భంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని సంప్రదిస్తారు. అయితే రాష్ట్రపతి ఆ సలహాలను పాటించాలన్న నియమమేదీ లేదు.

నిర్మాణం

భారత రాజ్యాంగంలోని నాలుగో భాగంలో సుప్రీంకోర్టుకు సంబంధించిన వివరణ ఉంది. రాజ్యాంగంలోని 124 నుంచి 147 వరకూ గల నిబంధనలలో భారత సుప్రీంకోర్టు నిర్మాణం, అధికారాలు, విధులను గురించి చర్చించారు. భారత సుప్రీంకోర్టు 1950 జనవరి 26 నుంచి అమలులోకి వచ్చింది. అంతకుముందు 1935 భారత ప్రభుత్వ చట్టం ఏర్పాటు చేసిన ఫెడరల్ ట్రిబ్యునల్ హోదాను పెంచడం ద్వారా సుప్రీంకోర్టు ఏర్పడింది. 1949, నవంబర్ వరకూ ప్రివీకౌన్సిల్‌కు చెందిన జుడీషియల్ కమిటీ ఉన్నత న్యాయస్థానంగా వ్యవహరించింది. 'ప్రపంచంలో ఏ సుప్రీంకోర్టుకు లేని అధికారాలు భారత సుప్రీంకోర్టుకు గలవని' అల్లాడి కృష్ణస్వామి అయ్యంగార్ అభిప్రాయపడ్డారు.

రాజ్యాంగంలోని 124వ నిబంధన ఈ అత్యున్నత న్యాయస్థానంలో ఒక ప్రధాన న్యాయమూర్తి, కొందరు న్యాయమూర్తులు ఉంటారని వివరిస్తుంది. అవసరాన్ని బట్టి ఈ సంఖ్యను పెంచే అధికారం పార్లమెంటుకు ఉంది. దీని ప్రకారం మొదట్లో ఒక ప్రధాన న్యాయమూర్తి ఏడుగురు న్యాయమూర్తులు ఉన్నారు. న్యాయమూర్తుల సంఖ్యను 1956లో 10కి, 1960లో 13కు, 1977లో 17కు, 1987లో 26కు, 2009లో 30కు పెంచారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులను, ప్రధాన న్యాయమూర్తులను రాష్ట్రపతి నియమిస్తారు.

సుప్రీంకోర్టు - రాజ్యాంగ నిబంధనలు

124	- సుప్రీంకోర్టు నిర్మాణం
124 (1)	- న్యాయమూర్తుల సంఖ్య
(2)	- న్యాయమూర్తుల నియామకం
(3)	- న్యాయమూర్తుల అర్హతలు
(4)	- న్యాయమూర్తుల తొలగింపు విధానం
125	- న్యాయమూర్తుల జీతభత్యాలు
129	- సుప్రీంకోర్టు కోర్టు ఆఫ్ రికార్డ్సగా వ్యవహరించడం
130	- సుప్రీంకోర్టు ఉండే ప్రదేశం
131	- సుప్రీంకోర్టు ఒరిజినల్ అధికార పరిధి
133	- సివిల్‌కేసులలో సుప్రీంకోర్టుకు అప్పీళ్ల విచారణ పరిధి
134	- క్రిమినల్ కేసులలో సుప్రీంకోర్టు అప్పీళ్ల విచారణ పరిధి
143	- రాష్ట్రపతి సుప్రీంకోర్టు సలహాను కోరడం

కొలీజియం వ్యవస్థ ఏర్పాటు

హైకోర్టులు, సుప్రీంకోర్టు న్యాయమూర్తుల నియామకాలు, బదిలీల కోసం కొలీజియం వ్యవస్థ అనేక ఏళ్లుగా ఉంది. దీనిలో భారత ప్రధాన న్యాయమూర్తి, సుప్రీంకోర్టుకు చెందిన నలుగురు సీనియర్ న్యాయమూర్తులు ఉంటారు. నియామకాలు, బదిలీలను వీరు సిఫార్సు చేస్తారు. అయితే ఈ వ్యవస్థకు భారత రాజ్యాంగంలో చోటులేదు. 1993, అక్టోబరు 6న తొమ్మిదిమంది న్యాయమూర్తుల ధర్మాసనం ఓ తీర్పును వెలువరించింది. కొలీజియం వ్యవస్థకు అది పునాదులు వేసింది. 1998, అక్టోబరు 28న ముగ్గురు న్యాయమూర్తుల కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుల ఆధారంగా కొలీజియం వ్యవస్థ రూపుదిద్దుకుంది. ఇతర న్యాయమూర్తులను సంప్రదించకుండానే ప్రధాన న్యాయమూర్తి నిర్ణయాలు తీసుకున్న సందర్భాలు, రాష్ట్రపతి పాత్ర కేవలం ఆమోద ముద్ర వేయడానికే పరిమితం కావడం వంటివి వివాదానికి దారితీశాయి. ప్రధాన న్యాయమూర్తి ఓ నిర్ణయానికి రావడానికి ముందు నలుగురు అత్యంత సీనియర్ న్యాయమూర్తులతో తప్పనిసరిగా సంప్రదించాలని సుప్రీంకోర్టు గతంలో స్పష్టం చేసింది. రాష్ట్రపతి హోదాలో కె.ఆర్.నారాయణన్ తీసుకువచ్చిన ప్రస్తావనపై ఈ స్పష్టతనిచ్చింది. సీజేఐ పాత్ర పైనా, సంప్రదించడం అనే పదానికి ఉన్న నిజమైన అర్థాలపైనా విస్తృతంగా చర్చ జరిగింది. న్యాయమూర్తుల్లోనూ భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

ఎన్డీయే అధికారంలోకి వచ్చిన తర్వాత కొలీజియం స్థానంలో జాతీయ న్యాయ నియామక కమిషన్ (ఎన్‌జేఏసీ)ను ఏర్పాటు చేశారు. 99వ రాజ్యాంగ సవరణ దీని ఏర్పాటు జరిగింది. 20 రాష్ట్రాల అసెంబ్లీలూ ఈ బిల్లును ఆమోదించాయి. దీంతో భారత రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ 31, డిసెంబర్ 2014న ఆమోద ముద్ర వేశారు. 2015 ఏప్రిల్ 13న ఎన్‌జేఏసీ అమల్లోకి వచ్చింది.

ఎన్‌జెఏసీ ... ఏం చేస్తుంది?



న్యాయమూర్తుల నియామకాలను పారదర్శకంగా, విశాల ప్రాతిపదికన చేపట్టడానికంటూ జాతీయ న్యాయనియామకాల కమిషన్ (ఎన్.జే.ఏ.సీ)ని తీసుకువచ్చారు. న్యాయ, శాసనవ్యవస్థల నుంచే కాకుండా పౌర సమాజం నుంచీ దీనిలో ప్రతినిధులు ఉంటారు. కొలీజియం వ్యవస్థను ఇది తొలగిస్తుంది. ఈ వ్యవస్థ చెల్లుబాటు గురించి రాజ్యాంగంలో 124వ నిబంధనలో కొన్ని సవరణలు చేశారు. కమిషన్ గురించి, దానిలో సభ్యులు, వారి విధులు గురించి వీటిలో చేర్చారు. మున్ముందు న్యాయమూర్తుల నియామక విధానాన్ని నియంత్రించే అధికారాన్ని పార్లమెంటుకు కట్టబెడుతూ 124 సి నిబంధనను చేర్చారు. ఆరుగురు సభ్యులుండే ఈ కమిషన్‌కు భారత ప్రధాన న్యాయమూర్తి నేతృత్వం వహిస్తారు. న్యాయశాఖ మంత్రి, సుప్రీంకోర్టుకు చెందిన ఇద్దరు సీనియర్ న్యాయమూర్తులు, ఇద్దరు ప్రముఖ వ్యక్తులు దీనిలో సభ్యులు. ఎన్‌జెఎసిలో న్యాయవ్యవస్థ ప్రతినిధులైన ప్రధాన న్యాయమూర్తి, ఇద్దరు అత్యంత సీనియర్ న్యాయమూర్తులు తమ ముందుకు వచ్చిన ప్రతిపాదనల నుంచి ఏ పేరునైనా తిరస్కరించవచ్చు (వీటో చేయవచ్చు). ఒకసారి వారి వీటో చేస్తే ఆ పేర్లు మళ్లీ పంపడం కుదరదు. అదే సమయంలో - ఏ పేరునైనా ఆమోదించడానికి న్యాయమూర్తులకు ఇతర సభ్యుల మద్దతూ అవసరం.

ఎన్.జే.ఏ.సీ కాలక్రమం

ఆగస్టు 2014 : 99వ రాజ్యాంగ సవరణకు, ఎన్.జే.ఏ.సీ ఏర్పాటుకు పార్లమెంటు ఆమోదం.

ఆగస్టు - డిసెంబర్ 2014 : ఈ రెండు బిల్లులకు 16 రాష్ట్రాల చట్టసభల ఆమోదం.

డిసెంబర్ 31, 2014 : రాష్ట్రపతి ఆమోద ముద్ర.

ఏప్రిల్ 13, 2015 : ఎన్.జే.ఏ.సీ చట్టం, రాజ్యాంగ సవరణ చట్టం అమల్లోకి వచ్చాయి.

అక్టోబరు 16, 2015 : ఎన్.జే.ఏ.సీ.ని కొట్టివేసిన సుప్రీంకోర్టు.

సుప్రీంకోర్టు తీర్పు

జాతీయ న్యాయ నియామక కమిషన్ (ఎన్.జే.ఏ.సీ) చట్టం చెల్లదని సుప్రీంకోర్టు అక్టోబరు 16, 2015న సంచలనాత్మక తీర్పు వెలువరించింది. ఆ చట్టానికి రాజ్యాంగబద్ధత లేదని సర్వోన్నత ధర్మాసనం స్పష్టం చేసింది. ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనంలో నలుగురు న్యాయమూర్తులు ఈ చట్టం చెల్లదని స్పష్టం చేయగా, మరో న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ భిన్నమైన అభిప్రాయాన్ని వెలువరించారు. 99వ రాజ్యాంగ సవరణ చట్టం చెల్లుతుందని చెప్పారు. కోర్టు తీర్పుతో కొలీజియం వ్యవస్థ తిరిగి అమల్లోకి వచ్చింది. మొత్తం 1,030 పేజీలతో కూడిన తీర్పులో ఆపరేటివ్ భాగాన్ని వెలువరించారు. ఎన్.జే.ఏ.సీ చట్టం, అందుకు రాజ్యాంగాన్ని సవరిస్తూ తీసుకొచ్చిన 99వ సవరణ చట్టం రాజ్యాంగబద్ధం కాదని, చెల్లదని జస్టిస్ జె.ఎస్.ఖేహర్, జస్టిస్ ఎం.బి.లోకుర్, జస్టిస్ కురియన్ జోసెఫ్, జస్టిస్ ఆదర్శ్ కుమార్ గోయెల్ స్పష్టం చేశారు. కోర్టు తుది తీర్పుపై ఐదుగురు న్యాయమూర్తులు సంతకం చేశారు.

'విస్తృత రాజ్యాంగ ధర్మాసనానికి నివేదించాలన్న విజ్ఞప్తిని, కొలీజియం వ్యవస్థను ఆమోదించిన 1983, 1998 నాటి కేసులను తిరిగి పరిశీలించాలని చేసిన విజ్ఞప్తిని తిరస్కరించారు. రాజ్యాంగ (99వ సవరణ) చట్టం ద్వారా ఏర్పడిన జాతీయ న్యాయ నియామకాల కమిషన్ రాజ్యాంగబద్ధం కాదని, చెల్లుబాటు కాదని ప్రకటిస్తున్నాం' అని ధర్మాసనం పేర్కొంది. 'సుప్రీం కోర్టుకు న్యాయమూర్తులను, హైకోర్టులకు ప్రధాన న్యాయమూర్తులను, ఇతర న్యాయమూర్తులను నియమించే వ్యవస్థ హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులు, ఇతర న్యాయమూర్తులను ఒక హైకోర్టు నుంచి మరో హైకోర్టుకు బదిలీ చేసే విధానం 99వ రాజ్యాంగ సవరణ చట్టానికి ముందు ఉన్నట్లుగా (కొలీజియం వ్యవస్థ) పని చేస్తుంది' అని ప్రకటించారు. ఆరుగురు సభ్యుల ఎన్‌జేఏసీలో ఇద్దరు ప్రముఖ వ్యక్తులకు చోటు కల్పించే నిబంధన రాజ్యాంగ విరుద్ధమని ధర్మాసనంలోని మెజార్టీ సభ్యులు అభిప్రాయపడ్డారు.

అర్హతలు : సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులవడానికి ఈ కింది అర్హతలుండాలి.

1. భారతదేశ పౌరుడై ఉండాలి.
2. కనీసం ఏదైనా హైకోర్టులో ఐదు సంవత్సరాలు న్యాయమూర్తిగా పనిచేసి ఉండాలి.
3. పది సంవత్సరాలు హైకోర్టు న్యాయవాదిగా అనుభవం కలిగి ఉండాలి.
4. రాష్ట్రపతి అభిప్రాయంలో న్యాయశాస్త్ర నిపుణుడై ఉండాలి.

ప్రధాన న్యాయమూర్తి నియామకం

భారత రాజ్యాంగం న్యాయమూర్తుల నియామకానికి కావాల్సిన అర్హతలు సూచించిందేగానీ ప్రధాన న్యాయమూర్తికి సంబంధించిన అర్హతలను గురించి ప్రత్యేకంగా ప్రస్తావించలేదు. అయితే సుప్రీంకోర్టు న్యాయమూర్తుల్లో అత్యధిక కాలం నుంచి పనిచేస్తున్న న్యాయమూర్తిని సీనియారిటీ ఆధారంగా చేసుకొని, ప్రధాన న్యాయమూర్తిగా నియమించడం ఒక సంప్రదాయం. అయితే ఈ సంప్రదాయానికి 1973లో గండి పడింది. ఆనాడు ప్రధాన న్యాయమూర్తి పదవికి అందరికంటే సీనియర్ అయిన న్యాయమూర్తిని కాకుండా నాల్గో స్థానంలో ఉన్న జస్టిస్ 'రే'ను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమించారు. ఆ సమయంలో దేశం మొత్తంమీద ఈ నియామకం పట్ల భారత ప్రభుత్వం అనుసరించిన వైఖరి సర్వత్రా విమర్శకు గురైంది. 1977లో ఎ.ఎస్.రే పదవీకాలం పూర్తయిన తరువాత సీనియర్ న్యాయమూర్తి అయిన జస్టిస్ హెచ్.ఆర్.ఖన్నాను కాకుండా ఆయన జూనియర్ అయిన ఎం.హెచ్.బేగ్‌ను ప్రధాన న్యాయమూర్తిగా నియమించారు. అటు తరువాత నియమితులైన ప్రధాన న్యాయమూర్తులందరూ సీనియారిటీ ప్రకారమే నియమితులయ్యారు.

పదవీకాలం - తొలగింపు

సుప్రీంకోర్టు న్యాయమూర్తుల పదవీ విరమణ వయస్సు 65 సంవత్సరాలు. వారి పదవీకాలంలో వారి వేతనాలను తగ్గించకూడదు. పదవీకాలం పూర్తికాకముందే సుప్రీంకోర్టు న్యాయమూర్తులను తొలగించాలంటే పార్లమెంటు ఉభయ సభలు మహాభియోగ తీర్మానం ద్వారా తొలగిస్తారు. ★

నమూనా ప్రశ్నలు

1. సుప్రీం కోర్టు జడ్జి పదవీ విరమణ వయస్సు ?
ఎ. 60 సంవత్సరాలు బి. 62 సంవత్సరాలు
సి 63 సంవత్సరాలు డి. 65 సంవత్సరాలు

2. మెంబరు ఆఫ్ కౌన్సిల్ ఆఫ్ స్టేట్స్‌గా పోటీ చేయడానికి నిర్ణయించిన కనీస వయస్సు ?
ఎ. 18 సంవత్సరాలు బి. 30 సంవత్సరాలు
సి. 21 సంవత్సరాలు డి. 25 సంవత్సరాలు

3. రాజ్యాంగం ప్రకారం కిందివారిలో ఎవరు నిజమైన నిర్వహణ శాఖ అధికారాలు నిర్వహిస్తారు ?
ఎ. కేంద్ర మంత్రిమండలి బి. రాష్ట్రపతి
సి. ప్రధాన మంత్రి డి. పార్లమెంటు

4. మనీ బిల్లులు ఏ అధికరణ ప్రకారం ప్లాన్ చేస్తారు ?
ఎ. ఆర్టికల్ 109 బి. ఆర్టికల్ 129
సి. ఆర్టికల్ 119 డి. ఆర్టికల్ 139

5. అధికరణ 105 ఎవరి అధికారాలు, విశేష అధికారాలు (ప్రివిలేజస్)కు సంబంధించినవి ?
ఎ. శాసనసభ సభ్యులు బి. పార్లమెంటు కమిటీ
సి. పార్లమెంటు సభ్యులు డి. లోక్‌సభ అధ్యక్షుడు

6. రాజ్యాంగంలోని 76వ అధికరణ కింద పేర్కొన్న ఎవరికి పార్లమెంటుకు అందుబాటు కల్పిస్తుంది ?
ఎ. సుప్రీంకోర్టు జడ్జి బి. హైకోర్టు జడ్జి
సి. అటార్నీ- జనరల్ ఆఫ్ ఇండియా
డి. అడ్వకేట్- జనరల్ ఆఫ్ ఇండియా

సమాధానాలు : 1.డి, 2.బి, 3.ఎ, 4.ఎ, 5.బి అండ్ సి, 6.సి

టిడిపి ఓటు బ్యాంకు రాజకీయాలు

కేశవ శంకరరావు

ప్రజాశక్తి - గుంటూరు సిటీ ప్రతినిధి

రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం సైతం ఓటు బ్యాంకు కోసం కాపు రిజర్వేషన్లను తెరపైకి తెచ్చిందనిబీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశవ శంకరరావు మండిపడ్డారు. పాలకవర్గ సామాజిక తరగతులకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించడం ద్వారా ఒకటి రెండు పార్టీల మినహా మిగిలినవన్నీ అగ్రకుల రాజకీయ పక్షపాతం అవలంబిస్తున్నాయని అన్నారు. గుంటూరులోని సంఘ కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 103వ రాజ్యాంగ సవరణ ద్వారా బీసీలకు సామాజిక న్యాయం చేయకుండానే ఆర్థిక అంశాన్ని పొందుపరచడం వల్ల భవిష్యత్తులో ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్ల విషయంలో అన్యాయం జరుగుతుందన్నారు.

నివాళి



తెలకపల్లి నర్సింహయ్య భౌతికకాయం వద్ద నివాళ్లు అర్పిస్తున్న పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత

తెలకపల్లి నర్సింహయ్య పార్థివదేహానికి పలువురి నివాళి

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

సిపిఎం సీనియర్ నాయకులు తెలకపల్లి నర్సింహయ్య భౌతికకాయాన్ని సందర్శించి పలువురు రాజకీయ నాయకులు, ప్రజాసంఘాల నేతలు నివాళులర్పించారు. శుక్రవారం హైదరాబాద్‌లో కన్నుమూసిన నర్సింహయ్య భౌతికకాయాన్ని శనివారం కర్నూలులోని ఆయన నివాసంలో ఉంచారు. వైసిపి పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, మంత్రాలయం టిడిపి ఇన్‌ఛార్జీ తిక్కారెడ్డి, పంచాయతీ శాఖ మాజీ ముఖ్య కార్యదర్శి దాసరి శ్రీనివాస్, రాష్ట్ర కమిటీ సభ్యులు నారాయణ, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.రామాంజనేయులు, ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్‌బాబు, ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దిలేటి, పత్తికొండ టిఎస్‌టియుసి రాష్ట్ర అధ్యక్షులు అశోక్, కెవిపిఎస్ తెలంగాణా నాయకులు పరంజ్యోతి, యుటిఎఫ్ తెలంగాణ నాయకులు రమేష్‌లు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన పార్థివదేహాన్ని సాయంత్రం 7 గంటలకు ఇందిరాగాంధీనగర్‌లో ఉన్న సిపిఎం కార్యాలయానికి జన సందర్శనార్థం తరలించారు. తెలంగాణ రాష్ట్ర టిడిపి అధ్యక్షులు ఎల్.రమణ, ఉపాధ్యక్షులు రావుల చంద్రశేఖర్‌రెడ్డి , తదితరులు నర్సింహయ్య కుమారుడు, ప్రజాశక్తి మాజీ సంపాదకులు తెలకపల్లి రవికి ఫోన్ చేసిసంతాపం ప్రకటించారు. ఆయన కుటుంబానికి సానుభూతి తెలిపారు.

నేటి నుంచి పక్షుల పండుగ

ప్రజాశక్తి-నెల్లూరు

నెల్లూరులో నేటినుంచి ఫ్లెమింగో ఉత్సవాలు (పక్షుల పండుగ) జరగనున్నాయి. ఈ ఉత్సవాలను విజయవంతం చేయాలని జెసి-2 కెఎం కమలకుమారి పిలుపునిచ్చారు. శనివారం నెల్లూరులోని ఏసి స్టేడియం నుంచి కస్తూర్బా కళాక్షేత్రం వరకు ఫ్లెమింగో ఉత్సవాలపై అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి నుంచి ఈ నెల 22వ తేదీ వరకు మూడు రోజులపాటు ఫ్లెమింగో ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు. ఈ ఉత్సవాలు సూళ్లూరుపేట, నేలపట్టు, ఆటగానితిప్ప, బి.వి పాళెం ప్రాంతాల్లో నిర్వహించనున్నారని తెలిపారు. సూళ్లూరుపేటలో సినీ ప్రముఖులతో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. పర్యాటకులకు, సందర్శకులకు ఎటువంటి సమస్య తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

రాష్ట్ర విచ్ఛిన్నానికి జగన్ కుట్ర

ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ చైర్మన్ శివాజీ

ప్రజాశక్తి - కాకినాడ

తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావుతో కలిసి ఎపి రాష్ట్ర విచ్ఛిన్నానికి వైసిపి అధ్యక్షులు వైఎస్.జగన్మోహన్‌రెడ్డి కుట్ర చేస్తున్నారని ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ చైర్మన్ కారెం శివాజీ ఆరోపించారు. పోలవరాన్ని అడ్డుకోడానికి తెలంగాణ ఎంపీ, కెసిఆర్ కుమార్తె కవిత సుప్రీంకోర్టులో కేసు వేసిన ఆ పార్టీతో ఎలా కలుస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కుట్రలో భాగంగానే తెలంగాణ పోలీసులు మఫ్టీలో వచ్చి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల సర్వేలు చేశారన్నారు. తెలంగాణ ఎన్నికల సమయంలో టిఆర్ఎస్ పంచిపెట్టిన గడియారాలు మిగిలిపోగా, వాటిని ఎపికి తరలించి జగన్ బొమ్మలను అంటించారని తెలిపారు. ప్రధాని మోడీ చేతిలో కెసిఆర్, జగన్ కీలుబొమ్మలుగా మారారని ఎద్దేవా చేశారు. ఆంధ్రప్రదేశ్ అధికారులు, పోలీసులపై నమ్మకం లేని జగన్ ముఖ్యమంత్రి ఎలా అవుతారని ప్రశ్నించారు.

నేటి నుంచి బిసి ధర్మ దీక్ష

ప్రజాశక్తి - సత్యనారాయణపురం (విజయవాడ)

వెనుకబడిన కులాల హక్కుల కోసం జనవరి 20వ తేదీన విజయవాడలోని ధర్నా చౌక్ వద్ద 'బీసీ ధర్మ దీక్ష' చేయనున్నట్లు నేషనల్ బ్యాక్ వర్డ్ క్లాస్ సంఘం జాతీయ అధ్యక్షులు డేరంగుల ఉదయ్‌కిరణ్ తెలిపారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వచ్చే ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలూ 100 శాసనసభ, 15 లోక్‌సభ స్థానాలు బీసీలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు చట్టసభల్లో అడుగుపెట్టని బీసీ కులాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

ప్రజ్ఞ

జవాబులు

1.డా.డాస్ క్లీన్ ల్యాండ్,
డా. సౌమ్య స్వామినాథన్
2.మనుసాహ్ని
3.48వ సారి
4.సత్యరూప్
5.సంజాయ్ జైన్

కలగానే వంద పడకల ఆసుపత్రి

- అంతంత మాత్రంగానే వైద్యసేవలు
- పట్టించుకోని ఎమ్మెల్యే శ్రీనివాసరావు

ప్రజాశక్తి-గాజువాక

పారిశ్రామిక ప్రాంతమైన గాజువాకలో వంద పడకల ఆసుపత్రి కలగానే మిగిలిపోయింది. ప్రతి ఎన్నికల్లో గాజువాక ఆసుపత్రిని 100 పడకలగా మార్చుతామని చెప్పడం, ఎన్నికల్లో గెలిచిన తరువాత విస్మరించడం పాలకులకు అలవాటై పోయింది. ప్రస్తుత అధికార పార్టీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు కూడా ఇదే హామీ ఇచ్చి, నేటికీ నెరవేర్చలేదు. మరో మూడు నెలల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఓట్ల కోసం వచ్చే పాలకులను నిలదీయడానికి ప్రజలు, కార్మికులు సన్నద్ధమవుతున్నారు.

గాజువాకలో 2 లక్షల మంది జనాభా నివాసముంటున్నారు. వీరిలో ఎక్కువమంది ప్రజలు భవన నిర్మాణ కార్మికులుగాను, ఆటోనగర్‌లో రోజువారి కూలీలుగాను, పారిశుధ్య కార్మికులుగాను ఉంటూ జీవనం సాగిస్తున్నారు. మరికొంతమంది ప్రయివేటు సంస్థలు, వాణిజ్య దుకాణాల్లో పనిచేస్తున్నారు. వీరి ఆదాయం నెలకు రూ.10 వేలు లోపే. వీరికి ఏమాత్రం అనారోగ్యం చేసినా ప్రయివేటు ఆసుపత్రులకు వెళ్లి వైద్యం చేయించుకోలేని పరిస్థితి. గాజువాకలో ఉన్న ప్రాథమిక ఆరోగ్యకేంద్రమే దిక్కు. ఇక్కడ పది పడకలు మాత్రమే ఉండటం వల్ల వైద్యం కోసం అగనంపూడి ఆసుపత్రికి వెళ్లాల్సివస్తోంది. అలాగే, ఆసుపత్రికి రోజూ 200 మంది రోగులు వస్తుంటారు. ఇక్కడ వైద్య పరీక్షలు చేయడానికి తగిన పరికరాలు లేకపోవడం, ఆసుపత్రిలో తగిన సిబ్బంది కొరత, స్పెషలిస్టు వైద్యులు లేకపోవడం వంటి సమస్యలు వెంటాడుతున్నాయి. 2002లో పూనం మాలకొండయ్య కలెక్టర్‌గా ఉన్న సమయంలో 30 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసేందుకు సర్వే నిర్వహించారు. తర్వాత తగినంత స్థలం లేదని అధికారులు వెనక్కి తగ్గారు. అప్పటినుంచి ప్రతి ఎన్నికల్లోనూ 100 పడకల ఆసుపత్రిని అభివృద్ధి చేస్తామని నాయకులు హామీ ఇవ్వడం, అది నెరవేర్చకపోవడం గత 15 ఏళ్లగా జరుగుతోంది. ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఇప్పుడు కొత్త పల్లవి అందుకున్నాడు. అగనంపూడి ఆసుపత్రి 8 కిలోమీటర్ల దూరంలో ఉందని, కనుక గాజువాక ఆసుపత్రిని అభివృద్ధి చేయడం కుదరదని, నిబంధనలు ఒప్పుకోవని చెబుతున్నారు.



శిథిలావస్థలో ఆసుపత్రి

గాజువాక ఆరోగ్య కేంద్రాన్ని 200 గజాల స్థలంలో 15ఏళ్ల క్రితం నిర్మించారు. ఆ భవనం శ్లాబు బీటలు వారింది. దీంతో వర్షాలు పడితే కారుతోంది. గోడలు కూడా బీటలు వారాయి. ఏ సమయంలో కూలుతాయోనని రోగులు, ఆసుపత్రి సిబ్బంది భయపడుతున్నారు. ఎక్కువ మంది రోగులు వస్తే తగినంత స్థలం లేక పోవడంతో ఆసుపత్రి బయటే ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఆసుపత్రిలో మరుగుదొడ్లను తరచూ శుభ్రం చేయడం లేదు.

సిపిఎం విస్తృత పోరాటం

గాజువాకలో వంద పడకల ఆసుపత్రిని నిర్మించాలని సిపిఎం గత పదేళ్లుగా ఆందోళన చేస్తోంది. ధర్నాలు, ర్యాలీలు, సంబంధిత అధికారులకు వినతిపత్రాలు అందజేత వంటి కార్యక్రమాలు చేపట్టింది. అయితే, సమస్య పరిష్కరించడానికి ప్రజాప్రతినిధులు ఆసక్తి చూపడం లేదు. దీంతో ఏళ్ల తరబడి ఆసుపత్రి అభివృద్ధికి దూరంగా ఉంది. ఇటీవల గాజువాకలో సిపిఎం ఆధ్వర్యాన జరిగిన 'ప్రత్యామ్నాయ రాజకీయం' సభలో తమ కూటమి అభ్యర్థి గెలిస్తే 300 పడకల ఆసుపత్రి నిర్మించడానికి కృషి చేస్తామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి మధు చెప్పారు.

డ్రై రిసోర్స్ సెంటర్‌ను తరలించాలని ధర్నా

ప్రజాశక్తి-గాజువాక, విశాఖ

విశాఖ జిల్లా పెదగంట్యాడ మండల పరిధి బాలచెరువు వద్ద ఏర్పాటుచేసిన డ్రై రిసోర్స్ సెంటర్‌ను తక్షణమే తరలించాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యాన జివిఎంసి గాజువాక జోనల్ కార్యాలయం వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. డ్రై రిసోర్స్ సెంటర్‌ను ఎత్తివేయాలని గ్రామస్తులు నినాదాలు చేశారు. అనంతరం అఖిలపక్ష రాజకీయ పార్టీల నాయకుల ఆధ్వర్యాన జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం విశాఖ నగర కమిటీ కార్యదర్శి డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ, నగరం నడిబొడ్డున డ్రై రిసోర్స్ సెంటర్ ఏర్పాటు వల్ల ప్రజలు అనారోగ్యాలకు గురవుతారన్నారు. 18 రోజులుగా స్థానికులు ఆందోళన చేస్తున్నా స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వం స్పందించకపోవడం తగదని తెలిపారు. జనసేన జిల్లా కో-కన్వీనర్ చింతలపూడి వెంకటరామయ్య మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్ నిర్మాణం కోసం భూములు కోల్పోయిన నిర్వాసితులకు సాంస్కృతిక వికాసం కోసం కేటాయించిన ఈ స్థలంలో డ్రై రిసోర్స్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం సబబు కాదని పేర్కొన్నారు.

హామీలను అమలు చేయాలి

ఎపి చేనేత కార్మిక సంఘం

ప్రజాశక్తి - భట్టిప్రోలు (గుంటూరు జిల్లా)

చేనేత కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని ఎపి చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన భట్టిప్రోలుకు శనివారం వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. 20 ఏళ్ల పోరాట ఫలితంగా చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్‌ను ప్రకటించారని, దీన్ని తక్షణం అమలు చేయాలని కోరారు. ఇతర హామీల అమలుకూ జీవోలివ్వాలన్నారు. వర్షాల నేపథ్యంలో రెండు నెల్లపాటు నెలకు రూ.2 వేలు పరిహారం ప్రకటించినా విడుదల చేయలేదని, మార్కెట్ ధరలకు అనుగుణంగా కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలనే సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రూ.18 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. చేనేత పరిశ్రమకు 18 రకాలను పవర్‌లూమ్ పై తయారీ చేయకుండా చేనేత కార్మికులకే వర్తించేలా చూడాలని కోరారు. జవహర్ బునకర యోజన పథకం ద్వారా కార్మికుల పిల్లలు చదువుకుంటే ఏడాదికి రూ.12 వేలు చొప్పున అందించాల్సి ఉన్నా దాన్ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడంతో కార్మికుల పిల్లలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం రద్దు చేసిన ఆరోగ్య పథకాన్ని పున:ప్రారంభించాలన్న ఆయన దేశంలోనే రెండో అతి పెద్ద రంగమైన చేనేతను కాపాడాలని కోరారు.

సమాజాన్ని ప్రభావితం చేసే కవిత్వం రావాలి

'ఏడవ రుతువు' పుస్తకావిష్కరణలో సాహితీ స్రవంతి అధ్యక్షులు వొరప్రసాద్



'ఏడవ రుతువు' పుస్తకావిష్కరణలో వొరప్రసాద్, శాంతి, హైమవతి, మోతి, అనిల్, సత్యాజీ, వైష్ణవిశ్రీ

ప్రజాశక్తి - సత్యనారాయణపురం (విజయవాడ)

పాఠకుల్ని కదిలించి సమాజాన్ని ప్రభావితం చేసే కవిత్వం రావాల్సిన అవసరం ఉందని సాహితీస్రవంతి రాష్ట్ర అధ్యక్షులు వొరప్రసాద్ అన్నారు. వైష్ణవిశ్రీ రాసిన కవితా సంకలనం 'ఏడవ రుతువు' పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. సాహితీస్రవంతి అమరావతి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమం విజయవాడలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో శనివారం జరిగింది. ఈ కార్యక్రమంలో వొరప్రసాద్ మాట్లాడుతూ మధ్యతరగతి ప్రజల్లో ఉన్న అభద్రతా భావం గురించి రచయిత్రి ఈ పుస్తకంలో స్పష్టంగా పేర్కొన్నారని అన్నారు. సభకు అధ్యక్షత వహించిన కమిటీ ప్రధాన కార్యదర్శి ఒ.శాంతిశ్రీ మాట్లాడుతూ సమాజ మార్పుతోనే స్త్రీ విముక్తి సాధ్యమవుతుందన్నారు. ప్రముఖ రచయిత్రి మందరపు హైమవతి 'ఏడవ రుతువు' పుస్తకాన్ని పరిచయం చేశారు. పుస్తకం తొలిప్రతిని మోతి అందుకున్నారు. ఈ కార్యక్రమంలో కవి అనిల్ డానీ, సాహితీస్రవంతి అమరావతి గౌరవాధ్యక్షులు సత్యాజీ ఆప్తవాక్యం పలికారు. ఈ కార్యక్రమంలో రచయిత్రి వైష్ణవిశ్రీ, పలువురు సాహితీవేత్తలు, కవులు పాల్గొన్నారు.

జిందాల్ పరిశ్రమ వద్ద కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి - కొత్తవలస (విజయనగరం జిల్లా)

పండగ అలవెన్సు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కార్మికులు ఆందోళన చేయడాన్ని జీర్ణించుకోలేని కొత్తవలస జిందాల్ పరిశ్రమ యాజమాన్యం శనివారం కార్మికులను లోపలకు రాకుండా గేట్లు మూసివేసింది. దీంతో కార్మికులు గేటు వద్ద ఆందోళన చేపట్టారు. పండుగ అలవెన్సు విషయంలో జిందాల్ కర్మాగార యాజమాన్యం వైఖరిని నిరసిస్తూ గత రెండు రోజులుగా కార్మికులు విధులను బహిష్కరించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం పరిశ్రమ యాజమాన్యం, కార్మిక సంఘాల నాయకులు సిఐటియు నాయకులు డేగల అప్పలరాజు , టిఎన్‌టియుసి నాయకులు పొలమరశెట్టి రాజన్న, వైఎస్ఆర్‌టియుసి నాయకులు నెక్కల నాయుడు బాబుతో చర్చలు విఫలమయ్యాయి. అయితే శనివారం యథావిధిగా విధులకు వచ్చిన కార్మికలకు చేదు అనుభవం ఎదురైంది.

'ఉపా' చట్టాన్ని రద్దు చేయాలి

పౌర హక్కుల సంఘం డిమాండ్

ప్రజాశక్తి - సత్యనారాయణపురం (విజయవాడ)

భావ ప్రకటనా స్వేచ్ఛను హరిస్తున్న 'ఉపా' (చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం) చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని పౌర హక్కుల సంఘం నేతలు డిమాండ్ చేశారు. ఉపా చట్టాన్ని రద్దు చేయాలనే అంశంపై పౌర హక్కుల సంఘం కృష్ణాజిల్లా శాఖ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. విజయవాడలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం హక్కుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు టి.ఆంజనేయులు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టానికి వ్యతిరేకంగా ఉద్యమించటం ద్వారానే జీవించే హక్కును కాపాడు కోగలమన్నారు. కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంధ్ర.మాల్యాద్రి మాట్లాడుతూ.. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వచ్చిన తరువాత తినే ఆహారం, ధరించే దుస్తుల విషయంలో ఆంక్షలు పెరిగాయన్నారు. మనువాద సిద్ధాంతాన్ని ప్రజలపై రుద్దాలని బిజెపి కుట్ర చేస్తోందని విమర్శించారు. ప్రజల హక్కులు కాపాడుకోవటం కోసం ఐక్య ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కెఎన్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దుడ్డు ప్రభాకర్, పౌరహక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి నంబూరి శ్రీమన్నారాయణ, వివిధ సంఘాల నాయకులు టి శ్రీరాములు, అరసవిల్లి కృష్ణ, ఎం.రామకృష్ణ, కె.పోలారి, ఎ.రవిచంద్ర, ఎల్.వి. కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆంధ్ర.మాల్యాద్రి

మంత్రి ఇలాకాలో 'స్నేహ'కు గండం

- మూడేళ్లుగా నిలిచిన రుతు రుమాళ్ల పంపిణీ
- ఏటా రూ.5 కోట్లకు పైగా భారం

ప్రజాశక్తి - అనంతపురం ప్రతినిధి

రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ, సెర్ప్ శాఖా మంత్రి పరిటాల సునీత ఇలాకాలోనే ఆడపిల్లలకు ప్రభుత్వ ఆదరణ కరువైంది. గత మూడేళ్లుగా ఆడపిల్లలకిచ్చే రుతు రుమాళ్ల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. స్వయాన మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న అనంతపురం జిల్లా రాప్తాడు, రామగిరి ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలలో 11 నుండి 15 సంవత్సరాలలోపు విద్యార్థినులు 396 మంది వున్నారు. వీరందరికీ మూడేళ్లుగా రుతు రుమాళ్లఅందటం లేదు. ఇదే క్రమంలో జిల్లా వ్యాప్తంగా 1,36,484 మందికి రుతు రుమాళ్లఅందని పరిస్థితి ఉంది. ప్రభుత్వం మాత్రం ఎన్నికల ఏడాది ప్రారంభం కావడంతో కొత్తగా 'రక్ష' పథకానికి శ్రీకారం చుడుతున్నట్లు ప్రచారం చేయడంతో క్షేత్ర స్థాయిలో విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. గతంలో ఎక్కువ మంది బాలికలు రుతు రుమాళ్లకు బదులుగా పాత వస్త్రాలను వాడుతున్నారు. ఫలితంగా కొన్ని సమస్యలు తలెత్తుతున్నాయని గుర్తించిన ప్రభుత్వం బాలికలకు (నాప్కిన్లు) రుమాళ్లు ఉచితంగా సరఫరా చేయాలని నిర్ణయించి 'స్నేహ' పథకాన్ని ప్రారంభించింది. అనతికాలంలోనే పంపిణీ నిలిపివేయడంతో విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో ఉచిత ప్యాడ్స్ సరఫరా ఆగిపోవడంతో పాఠశాలల్లో, కళాశాలల్లో బాలికలకు ఇబ్బందులు ప్రారంభమయ్యాయి. వయస్సుకు వచ్చిన బాలికలు రుతుక్రమ సమయంలో పాత బట్టల స్థానంలో విద్యాశాఖ సరఫరా చేసిన రుమాళ్లను వాడేవారు. ఫలితంగా ఆరోగ్య సమస్యలు తగ్గాయి. అయితే మూడేళ్లుగా సరఫరా నిలిపేయడంతో డబ్బు పెట్టి కొనుగోలు చేయాల్సి వస్తోందని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరికి ఇది ఆర్థిక భారంగా మారింది మరికొందరు డబ్బు పెట్టుకోలేక పూర్వపు శాస్త్రీయ పద్ధతులను ఆశ్రయించడం జరుగుతోంది. దీంతో బాలికలు అసౌకర్యంతో పాటు అనారోగ్యం బారిన పడే ప్రమాదకర పద్ధతి ఏర్పడింది. 2013లో అప్పటి ప్రభుత్వం నేస్తం కార్యక్రమాన్ని ప్రారంభించింది. 11 నుండి 16 సంవత్సరాల మధ్య ఉన్న కౌమార దశ బాలికలకు నేస్తం పేరుతో రుతు రుమాళ్లను సరఫరా చేయడం ప్రారంభించి 2014, 15 సంవత్సరాల వరకు పంపిణీ చేసింది. వీటి పంపిణీ తర్వాత మంచి ఫలితాలొచ్చాయని వైద్యులు సైతం చెప్పారు. 2015 సంవత్సరం నుంచి ప్రభుత్వం రుమాళ్ల సరఫరా నిలిపి వేసింది. అనేక అవకతవకలు జరిగాయనే విమర్శలు రావడంతో సరఫరా ఆగిపోయిందని పాలకులు, అధికారులు చెబుతున్నారు.

దీంతో బయట కొనాలంటే ఆర్థిక భారంగా మారిందని ఎంతో విద్యార్థులు మొర పెట్టుకున్నా ప్రభుత్వం స్పందించలేదు. ప్రభుత్వ ఉచిత సరఫరా నిలిచిపోవడంతో బయట మార్కెట్లో కొనుగోలు చేయాల్సి వస్తోందని విద్యార్థులు చెబుతున్నారు. బజార్లో ఒక్కో ప్యాడ్‌కు రూ.40 నుండి రూ.100 వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. నెలకు ఒకటి చొప్పున ఏడాదికి 12 ప్యాకెట్లకు దాదాపుగా 500 రూపాయలు నుండి వెయ్యి రూపాయల వరకు వెచ్చించాల్సి వస్తోందని విద్యార్థులు చెబుతున్నారు. జిల్లాలో ఐదు వేల పాఠశాలల్లో 1,36 లక్షల మందికి పైగా బాలికలు చదువుతున్నారు. జిల్లాలో మొత్తంగా బాలికలందరికీ ఏడాదికి 5 కోట్లకు పైగా భారం పడుతోంది. పక్క రాష్ట్రాల్లో కౌమార బాలికలకు ఆయా ప్రభుత్వాలు న్యాప్కిన్స్ సరఫరా చేస్తున్నాయి. కర్ణాటక తమిళనాడు, కేరళ, బీహార్ వంటి రాష్ట్రాలు కొనసాగిస్తున్నా.. ఆంధ్ర రాష్ట్రంలో మాత్రం ఈ విధానం అమలు కావడం లేదు. ప్రస్తుతం ఎన్నికల సంవత్సరం ప్రారంభమవుతుంది టిడిపి ప్రభుత్వం రక్ష అనే పేరుతో ఈ పథకాన్ని ప్రారంభించనుండడంపై పలు విమర్శలు వినబడుతున్నాయి.

మోడీ డైరక్షన్‌లో కెసిఆర్, జగన్

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి-ఒంగోలుటౌన్

రానున్న ఎన్నికల్లో చంద్రబాబును ఓడించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక మల్లయ్యలింగం భవన్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. టిడిపి కోట్లు ఖర్చుతో ప్రచారానికి శ్రీకారం చుట్టిందని విమర్శించారు. బాబు మళ్లీ రావాలంటూ టిడిపి కార్యకర్తలు ఫ్లెక్సీలు కడుతున్నారన్నారు. రాష్ట్ర విభజన సమయానికి మన రాష్ట్ర అప్పు రూ.94 వేలు కోట్లు ఉంటే ఇప్పుడు రూ.2,49,000 కోట్లకు పెంచిన ఘనత చంద్రబాబుదే అన్నారు. సిఎం రాష్ట్రాన్ని ప్రమాదకరమైన అప్పుల్లోకి తీసుకెళుతున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో యూనివర్శిటీలకు వైస్‌ఛాన్సలర్లు లేరని, వారిని నియమించడానికి కూడా చంద్రబాబుకు తీరికలేదా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో 16 ప్రయివేట్ యూనివర్శిటీలను తీసుకొచ్చిన ఘనత సిఎంకే దక్కుతుందన్నారు. మోడీకి అనుకూలంగా ఉండే ఫెడరల్ ఫ్రంట్‌ను కెసిఆర్ తీసుకొస్తున్నారని విమర్శించారు. బిజెపి వ్యతిరేక కూటమిలోని పార్టీలను చీల్చడానికి కెసిఆర్ చేసిన ప్రయత్నం ఫలించలేదన్నారు. ఇప్పుడు కెసిఆర్‌కు జగన్మోహన్‌రెడ్డి దిక్కయ్యారన్నారు. మోడీ డైరక్షన్‌లో కెసిఆర్, కెసిఆర్ డైరక్షన్‌లో జగన్ పనిచేస్తున్నారని విమర్శించారు. సిపిఐ ఎన్నికల ఎత్తుగడలు ఆయా రాష్ట్రాల పరిస్థితులను బట్టి ఉంటాయన్నారు. ఎపిలో మాత్రం సిపిఐ, సిపిఎం, జనసేన కలిసే ఎన్నికలకు వెళతాయన్నారు. 25న విశాఖలో మూడు పార్టీల సమావేశం జరుగుతుందన్నారు. నిర్దిష్టమైన విధానంతో ముందుకు వస్తామని తెలిపారు. కెసిఆర్ ఆంధ్రాకు వచ్చి ప్రచారం చేస్తే అది చంద్రబాబుకు లాభిస్తుందన్నారు. .

రాజస్థాన్‌లో స్వైన్ ఫ్లూ విజృంభణ

జైపూర్ : రాజస్థాన్‌లో స్వైన్‌ఫ్లూ వ్యాధి విజృంభిస్తోంది. రాష్ట్రంలో శనివారం ఒక్కరోజే ఐదుగురు ఈ వ్యాధితో మరణించారు. దీనిపై వైద్యాధికారి ఒకరు మాట్లాడుతూ... జోధ్‌పూర్, ఉదయ్‌పూర్‌లో మొత్తం నలుగురు, బార్మర్ లో ఒకరు ఈ వ్యాధితో మరణించారని అన్నారు. దీంతో మొత్తం మరణాల సంఖ్య 48కి చేరుకున్నదని తెలిపారు. ఇప్పటి వరకు మొత్తం 5061 మంది నుంచి రక్తనమూనాలను సేకరించామన్నారు. వారిలో 1173 మందికి స్వైన్‌ఫ్లూ వచ్చినట్టు గుర్తించామని అధికారి వెల్లడించారు. కాగా ప్రతి ఇంటికి తిరిగి వైద్యపరీక్షలు నిర్వహించాలని ఆరోగ్యశాఖ మంత్రి ఆదేశించారు. గతేడాది దేశవ్యాప్తంగా సుమారు 15వేల మందిలో ఈ వ్యాధిని గుర్తించారు. అందులో సుమారు11 వందల మంది మరణించిన సంగతి తెలిసిందే.

అన్వేషణ

జమ్ముకాశ్మీర్‌లోని కర్‌దుంగ్లా వద్ద మంచుపెళ విరిగిపడిన ప్రమాదంలో చిక్కుకుపోయిన ఐదుగురి కోసం శనివారం అన్వేషణ కొనసాగిస్తున్న సహాయక సిబ్బంది.



మోడీ పాలనలో అప్పులు 49 శాతం పెరిగాయి

దేశానికున్న రుణం రూ.82 లక్షల కోట్లు

న్యూఢిల్లీ : ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం కేంద్రంలో అధికారం చేపట్టిన తర్వాత ఈ నాలుగున్నరేళ్ల కాలంలో అప్పులు 49 శాతం పెరిగి రూ.82 లక్షల కోట్లకు చేరుకున్నాయి. ప్రభుత్వ అప్పులపై ఆర్థికశాఖ విడుదల చేసిన 8వ స్థాయీ పత్రంలో ఈ వివరాలను వెల్లడించింది. యుపిఎ ప్రభుత్వం అధికారం కోల్పోయిన సమయంలో (2014 జూన్ వరకు) దేశానికి ఉన్న అప్పుల మొత్తం రూ.54,90,763 కోట్లు కాగా, 2018 సెప్టెంబర్ వరకు అవి రూ.82,03,253 కోట్లకు చేరుకున్నాయి. ఆర్థికశాఖ 2010-11 నుంచి ప్రతిఏటా దేశానికున్న అప్పులపై స్థాయీ పత్రాన్ని విడుదల చేస్తోంది. ప్రభుత్వ అవసరాలు, పలు పథకాలకు అవసరమైన నిధుల్ని అప్పుల రూపంలో సేకరిస్తుంది. ఏటా అప్పులపై చెల్లించే వడ్డీలు, ఆదాయానికి మించి చేసే ఖర్చులను బడ్జెట్‌లో ద్రవ్యలోటుగా ఆర్థికశాఖ చూపిస్తుంది. ఈ ఆర్థిక సంవత్సరం పూర్తయ్యేనాటికి అంచనాకన్నా అధికంగానే ద్రవ్యలోటు ఉండనున్నట్టు ఇప్పటికే స్పష్టమైంది. 2018-19 ద్రవ్యలోటు లక్ష్యం రూ.6.24 లక్షల కోట్లు కాగా, నవంబర్ నాటికే రూ.7.17 లక్షల(114.8 శాతం)కు చేరుకున్నది. అంటే అను కున్న లక్ష్యానికన్నా 14.8 శాతం ఇప్పటికే అదనంగా ఖర్చయిందని అర్థం.

పెరిగిన పెట్రోలియం ధరలు

పెట్రోల్‌పై 17పైసలు, డీజిల్‌పై 20పైసలు



న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం వరుసగా చమురు ధర పెంచటంలో భాగంగా శనివారం నాడు కూడా పెట్రోల్, డీజిల్ ధరలను పెంచటం ద్వారా సామాన్యులపై భారం మోపింది. ప్రధాన నగరాల్లో లీటరు పెట్రోల్ ధర 17పైసలు పెరగగా, లీటరు డీజిల్ ధరపై 20 పైసల దాకా పెరిగింది. ఢిల్లీలో లీటరు పెట్రోల్ ధర 17 పైసలు పెరిగి రూ.70.72కు, డీజిల్ ధర 19 పైసలు పెరిగి రూ.65.16కు చేరింది. ముంబయిలో పెట్రోల్ 17 పైసలు పెరిగి లీటరు ధర రూ.76.35 కు చేరగా, డీజిల్ ధర 20 పైసలు పెరిగి రూ.68.22కు చేరింది.

తప్పుడు అంకెలతో మభ్యపెడుతున్న బిజెపి : చిదంబరం వ్యాఖ్య



న్యూఢిల్లీ : నీతి ఆయోగ్ ఇచ్చిన తప్పుడు అంకెలతో తమ ప్రభుత్వం మంచి వృద్ధిరేటు సాధించిందని బిజెపి ప్రభుత్వం చెప్పుకుంటోందని కాంగ్రెస్ నేత, మాజీ ఆర్థికమంత్రి పి.చిదంబరం వ్యాఖ్యానించారు. గత యుపిఎ ప్రభుత్వ హయాంలో కన్నా అత్యధిక అభివృద్ధి రేటును సాధించామని బిజెపి ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆ అంకెలను ప్రతి ఆర్థికవేత్త, గణాంకవేత్తలు తిరస్కరిస్తారని శనివారం చిదంబరం ట్వీట్ చేశారు. గతంలో ప్రచురించిన సిఎస్‌ఒ సంఖ్యలు, ఆగస్టులో రియల్ సెక్టార్ స్టాటిస్టిక్స్‌లో ఎన్‌ఎస్‌సి కమిటీ విడుదల చేసినవి మాత్రమే నమ్మదగినవని చిదంబరం అన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన అనంతరం యుపిఎ హయాంలో (2004-2009) మాత్రమే ఒక్క ఏడాది అత్యుత్తమ అభివృద్ధిరేటును సాధించిందని ఆయన పేర్కొన్నారు. బిజెపి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుండి ఈ 4, 5 సంవత్సరాలలో దేశ రుణభారం 50 శాతం పెరిగి 82 లక్షల కోట్ల రూపాయలకు చేరుకుందని కాంగ్రెస్ సీనియర్ నేత అహ్మద్ పటేల్ ట్వీట్ చేశారు. విచక్షణా రహిత వ్యయాలు, అప్పులు చేయడం గుజరాత్ మోడల్ అభివృద్ధి అని ఆయన ట్వీట్ చేశారు.

వేర్పాటువాది సాహిద్‌ను విడుదల చేయండి : ముఫ్తీ



శ్రీనగర్ : ఎన్ఐఎ కస్టడీలో ఉన్న వేర్పాటువాద నాయకుడు సాహిద్-ఉల్-ఇస్లాంను, అతని భార్య అనారోగ్యం దృష్ట్యా మానవతా దృష్టితో విడుదల చేయాలని మాజీ ముఖ్యమంత్రి, పిడిపి అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ కోరారు. ఈ మేరకు ఆమె శనివారం కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో ఫోన్లో మాట్లాడారు. సాహిద్‌ను విడుదల చేయాలన్న ట్విట్టర్ ఖాతాదారుని అభ్యర్థనకు ముఫ్తీ స్పందించి రాజ్‌నాథ్‌ను సంప్రదించారు. సాహిద్ భార్య మెదడుకు సంబంధించిన వ్యాధితో బాధ పడుతున్నట్లు ఆమె తెలిపారు. పిడిపి యువజన విభాగం అధ్యక్షుడు వాహిద్ పర్రా మాట్లాడుతూ రాష్ట్రానికి చెందిన ఖైదీలు, జెఎన్‌యు యూనివర్సిటీలో కాశ్మీర్ యువకులపై పెడుతున్న కేసుల గురించి కూడా ముఫ్తీ రాజ్‌నాథ్‌తో మాట్లాడినట్లు తెలిపారు.

లాలూకు రెగ్యులర్ బెయిల్

రబ్రీ, తేజస్వికి బెయిల్ పొడిగింపు



న్యూఢిల్లీ : భారత రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్(ఐఆర్‌సిటిసి) కుంభకోణం కేసులో ఆర్జేడీ నేత లాలూ ప్రసాద్ యాదవ్‌కు ఢిల్లీ హైకోర్టు శనివారం రెగ్యులర్ బెయిల్‌ను మంజూరు చేసింది. సిబిఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఇడి) దాఖలు చేసిన ఈ కేసులో లాలూ భార్య రబ్రీదేవి, కుమారుడు తేజస్వి యాదవ్‌కు ఈ నెల 28 వరకు రెగ్యులర్ బెయిల్‌ను పొడిగిస్తూ ప్రత్యేక జడ్జి అరుణ్ భరద్వాజ్ తీర్పునిచ్చారు. తొలుత ఈ కేసుకు సంబంధించి గతంలో లాలూకు ఇచ్చిన మధ్యంతర బెయిల్‌ను జనవరి 28 వరకు పొడిగించగా, రెగ్యులర్ బెయిల్‌పై జనవరి 28న తీర్పు ప్రకటిస్తామని వెల్లడించింది. అయితే శనివారం మధ్యాహ్నం లాలూ పిటిషన్‌ను మరోసారి విచారించిన కోర్టు లక్ష రూపాయల పూచికత్తుపై రెగ్యులర్ బెయిల్ ఇచ్చేందుకు అంగీకరించింది. ఐఆర్‌సి టిసికి నిర్వహణలో ఉన్న రెండు హోటళ్లను ప్రైవేటు యాజమాన్యానికి అప్పగిం చేందుకు అవకతవకలకు పాల్పడ్డరనే ఆరోపణలతో ఈ కేసు నమోదైన సంగతి తెలిసిందే.

ములక్కల్ నుండి రక్షణ కల్పించండి

కేరళ ముఖ్యమంత్రికి లేఖలు రాసిన ఐదుగురు నన్‌లు

కొచ్చి : నన్‌పై అత్యాచారానికి పాల్పడిన జలంధర్ బిషప్ ఫ్రాంకో ములక్కల్‌ను అరెస్టు చేయాలంటూ నిరసనలు తెలిపిన ఐదుగురిలో నలుగురు నన్‌లు తమకు భద్రత కల్పించాలని ముఖ్యమంత్రి పినరయ్ విజయన్‌కు లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. ములక్కల్ నుండి ప్రాణహాని ఉందని బాధిత మహిళ కూడా లేఖ రాయడం గమనార్హం. ములక్కల్‌కు వ్యతిరేకంగా నిరసన తెలిపినందుకు కొట్టాయానికి సమీపంలోని సెయింట్ ఫ్రాన్సిస్ మిషన్ హోమ్ నుండి వెళ్లాలని నలుగురు నన్‌లకు ఇటీవల ఆదేశాలు అందాయి. తమకు భద్రత కల్పించడంతో పాటు తమ బదిలీల ఉత్తర్వులు నిలిపివేయాలని, దీని వల్ల ఈ కేసు విచారణ పూర్తయ్యేంత వరకు కురవిలంగడ్ కాన్వెంట్‌లో నివసించడానికి అనుమతించాలని కోరుతూ తమ లేఖల్లో పేర్కొన్నారు. వీరితో పాటు కాన్వెంట్‌లో ఉంటున్న మరో నన్ నీనా రోజీకి కూడా బదిలీ నుండి రక్షణ కల్పించాలని కోరారు. తనకు మద్దతు తెలుపుతున్న ఈ ఐదుగురు నన్‌లకు వైద్య సహాయంతో పాటు కనీస అవసరాలను ఇచ్చేందుకు కాన్వెంట్ మత బోధకులు నిరాకరిస్తున్నారని బాధిత నన్ లేఖలో తెలిపారు.

గుర్గావ్‌లో మహిళ హత్య

అత్యాచార కేసును వెనక్కు తీసుకోలేదన్న అక్కసు

గుర్గావ్ : తనపై నమోదైన అత్యాచార కేసును ఉపసంహరించుకోలేదన్న కారణంతో హర్యానాలోని కర్నాల్ ప్రాంతానికి చెందిన మహిళపై సందీప్ అనే నిందితుడు కాల్పులు జరిపిన ఘటన గుర్గావ్‌లోని కుష్బు చౌక్ వద్ద చోటుచేసుకుంది. ప్రస్తుతం ఢిల్లీలో ఓ ఉద్యోగం చేస్తున్న ఆమెను అతడే హత్యచేశాడని బాధిత మహిళ సహోద్యోగి ఒకరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతడిపై నమోదైన అత్యాచార కేసును వెనక్కు తీసుకోలేదన్న కారణంగానే హత్య చేసినట్లు తెలిపారు. వివరాల్లోకి వెళితే సందీప్, బాధిత మహిళకు గతంలో పరిచయం ఉందని, రెండేళ్ల పాటు వారిద్దరూ సహజీవనం చేశారని పేర్కొన్నారు. విభేదాలు తలెత్తిన అనంతరం తనపై సందీప్ అత్యాచారానికి పాల్పడ్డాడని ఆమె ఫిర్యాదు చేయగా 2017లో అతడిపై కేసు నమోదైంది. గత ఏడాది జూన్‌లో బెయిల్‌పై విడుదలయ్యాడని తెలిపారు. అయితే ఈ శుక్రవారం తనను కలవాలని బాధిత మహిళకు నిందితుడు ఫోన్ కాల్ చేశాడు. దీంతో ఆమె తన స్నేహితునితో కలిసి వెళ్లగా..సందీప్ కూడా తన స్నేహితునితో కలిసి బయటకు వెళ్లారు. తనపై ఉన్న కేసును ఉపసంహరించుకోవాలని పలు మార్లు కోరాడు.

మతోన్మాద 'జోడీ'కి ముగింపు పలకండి

బెంగాల్ ప్రజలకు ఏచూరి పిలుపు

దారివిత (ఇస్లాంపూర్) : దేశంలోనూ, రాష్ట్రంలోనూ బిజెపి, తృణమూల్ కాంగ్రెస్‌లు ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తున్నాయని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి విమర్శించారు. బిజెపితో పాటు కమ్యూనిస్టులపై పోటీ చేస్తే దేశం నుంచి మతతత్వ బిజెపి పాలన పోతుందా అని ఏచూరి ప్రశ్నించారు. డివైఎఫ్ఐ పశ్చిమ బెంగాల్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జరిగిన మెగా ర్యాలీలో ఏచూరి ప్రసంగించారు. ఇస్లాంపూర్ సబ్‌డివిజన్‌లోని దారివిత పాఠశాలలో పోలీస్ కాల్పులకు బిజెపి, టిఎంసిలు మతం రంగును పూయడాన్ని వ్యతిరేకిస్తూ డివైఎఫ్ఐ ఈ ర్యాలీని నిర్వహించింది. ఈ ర్యాలీలో 3 వేలకుపైగా డివైఎఫ్ఐ కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ ర్యాలీలో ఏచూరితో పాటు సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు, స్థానిక ఎంపి ఎండి సలీం, డివైఎఫ్ఐ నేత అభయ్ ముఖర్జీ, ఇతర నాయకులు పాల్గొన్నారు. ఈ ర్యాలీకి డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు మీనాక్షి ముఖర్జీ అధ్యక్షత వహించారు.

ఈ ర్యాలీలో ఏచూరి మాట్లాడుతూ వామపక్షాలు నిర్వహించిన ఉద్యమాల్లో పాల్గొన్నందుకు ఈ జిల్లాలోనే 3 వేలకు పైగా అక్రమ కేసులు నమోదు చేశారని, ఎక్కువగా యువ కార్యకర్తలపై నమోదయ్యాయని తెలిపారు. బిజెపి ప్రభుత్వ విధానాలతో దేశంలో 2018లోనే 10 లక్షల మంది ఉద్యోగాలను కోల్పోయారని, మోడీ ప్రభుత్వ విధానాలతో రైతుల ఆత్మహత్యలు కొనసాగుతూనే ఉన్నాయని విమర్శించారు. దేశం నుంచి బిజెపి-ఆర్‌ఎస్‌ఎస్‌లను తరిమికొట్టాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని తెలిపారు. ప్రజాస్వామ్యంపై దాడులు చేస్తున్న బిజెపికి, తృణమూల్ కాంగ్రెస్‌కు సారూప్యత ఉందని, నాలుగున్నర సంవత్సరాలుగా ప్రజలను దోచుకున్న ఈ రెండు పార్టీలు ఆగ్రహంతో వున్న ప్రజలను బుజ్జగించడానికి ఎన్నికల ముందు హామీలు ఇస్తున్నాయని విమర్శించారు. దారివిత పాఠశాలలో పోలీస్‌కాల్పులు జరగడంతో ఆ ప్రాంతంలో మత ఉద్రికత్తలు తలెత్తాయి. వీటిని నివారించడానికి వామపక్ష కార్యకర్తలు రాత్రింబవళ్లు కృషి చేశారు. అయితే వీరికి న్యాయం లభించడానికి బదులు పోలీసులు అక్రమ కేసులు బనాయించారు. సిపిఎం స్థానిక కమిటీ సభ్యుడు, యువ కార్యకర్త నిఖిల్ సిక్దర్‌ను పోలీసులు అసత్య ఆరోపణలతో అరెస్టు చేశారు.



జెఎన్‌యు హాజరు వివాదంపై ఢిల్లీ హైకోర్టు స్టే



న్యూఢిల్లీ : జెఎన్‌యు విశ్వ విద్యాలయ ఫ్యాకల్టీకి హాజరును తప్పనిసరి చేస్తూ అకడమిక్, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్స్ తీసుకున్న నిర్ణయంపై ఢిల్లీ హైకోర్టు శుక్రవారం స్టే ఇచ్చింది. బోధనా సిబ్బంది సర్వీసు నిబంధనల ప్రకారం అనుమతి లేకుండా గైర్హాజరు కావడాన్ని నిరోధించేందుకు హాజరును తప్పనిసరి చేస్తున్నట్లు అకడమిక్ కౌన్సిల్(ఎసి), ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్(ఇసి) పేర్కొన్నాయి. బోధనా సిబ్బందికి సంబంధించి రోజుకు ఒక్కసారైనా సరే హాజరు తీసుకోవడాన్ని తప్పనిసరి చేస్తూ జారీ చేసిన జెఎన్‌యు సర్క్యులర్‌పై ఈ నెల 14న ఇచ్చిన ఆదేశాల మేరకు జస్టిస్ సురేష్ కైట్ స్టే ఉత్తర్వులు జారీ చేశారు. జెఎన్‌యు ప్రొఫెసర్ అయేషా కిద్వాయ్ దాఖలు చేసిన పిటిషన్‌పై హై కోర్టు విచారణ జరిపింది. ఈ ఆదేశాలను సవాల్ చేస్తూ ఆయన పిటిషన్ దాఖలు చేశారు. దీంతో కోర్టు యూనివర్సిటీకి నోటీసులు జారీ చేసింది. దీనిపై తదుపరి విచారణ మే 3న కొనసాగుతుంది. అనధీకృత సెలవుపై వెళ్ళిన సిబ్బందిపై ఎసి నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని కోర్టు ఆదేశించింది. సిబ్బంది హాజరును తప్పనిసరిగా నమోదు చేయాలని జులై 13 2018న రెండు కౌన్సిల్స్ నిర్ణయం తీసుకున్నాయి. అయితే కౌన్సిల్స్ తీసుకున్న నిర్ణయం సరిగా లేదని కిద్వాయ్ తరుపు న్యాయవాది ధ్రువ్ మెహతా కోర్టుకు తెలిపారు. హాజరు నమోదు చేసేందుకు బయోమెట్రిక్ వ్యవస్థను ప్రవేశపెట్టాలని కూడా నిర్ణయం తీసుకున్నాయి. అయితే బయోమెట్రిక్ ఒక వ్యక్తి గోప్యతను ఉల్లంఘించడమేనని హైకోర్టుకు ఆయన తెలిపారు.

ఇవిఎంలపై అనుమానాలొద్దు

సిఇసి సునీల్ అరోరా

పాట్నా : ఎన్నికల్లో ఓటమి చెందితే ఒకలా...గెలిస్తే మరొకలా రాజకీయ పార్టీలు వ్యవహరిస్తున్నాయనీ, ఒక ఫుట్‌బాల్ మాదిరిగా ఇవిఎంలతో రాజకీయ పార్టీలు ఆడుకుంటున్నాయనీ కేంద్ర ఎన్నికల కమిషనర్ సునీల్ అరోరా అన్నారు. ఇవిఎంల పనితీరుపై రాజకీయ పార్టీలు ఆందోళనను ఉద్దేశించి ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రెండు రోజుల బీహార్ పర్యటనలో ఉన్న ఆయన అక్కడ శనివారం మీడియాతో మాట్లాడుతూ... 'ఇవిఎంల పనితీరును ప్రభావితం చేయటం సాధ్యమయ్యే పని కాదు. వివిధ రాష్ట్రాల్లో ఇవిఎంలపై ఆందోళన వ్యక్తం అవుతోంది. కొన్ని చోట్ల మాత్రమే సాంకేతిక సమస్యలు తలెత్తాయనీ, ఇవిఎంలను పూర్తిగా నమ్మవచ్చు అని ఆయన అన్నారు. ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో 1.76 లక్షల ఇవిఎంలను ఉపయోగించామన్నారు.

శ్రీనగర్‌లో భారీగా హిమపాతం

విమాన రాకపోకలకు అంతరాయం

కార్గిల్‌లో మైనస్ 18.9 డిగ్రీలు నమోదు

శ్రీనగర్ : శ్రీనగర్‌లో భారీగా మంచుకురుస్తోంది. దీంతో విమాన రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. పలు విమానాలు ఆలస్యమవగా, మరికొన్నింటిని రద్దు చేసినట్లు అధికారులు ప్రకటించారు. శ్రీనగర్ ప్రాంతంలో గతంలో ఎన్నడూ లేని విధంగా మంచుకురుస్తోందని వాతావరణశాఖ అధికారులు ప్రకటించారు. రన్‌వే అనుకూలంగా లేకపోవడంతో విమానాలు రద్దు చేయాల్సివచ్చిందని విమానాశ్రయ అధికారులు తెలిపారు. ఒకటి, రెండు రోజుల్లో పరిస్థితి మెరుగుపడవచ్చని అన్నారు. కార్గిల్‌లో శనివారం అత్యధికంగా మైనస్ 18.9 డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదుకాగా, లేహ్‌లో మైనస్ 16.2 లడఖ్‌లో మైనస్ 9.2, డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ సీజన్లో ఇదే రికార్డని అధికారులు తెలిపారు.

ఇద్దరు పిఎన్‌బి డైరెక్టర్లపై వేటు

నీరవ్ మోడీ కేసులో తొలగించిన కేంద్రం

చెన్నై : పంజాబ్ నేషనల్ బ్యాంకును వజ్రాల వ్యాపారి రూ.13500 కోట్ల మేర మోసం చేసిన కేసులో ఆ బ్యాంకుకు చెందిన ఇద్దరు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లపై వేటు పడింది. ఈ విషయాన్ని స్టాక్ ఎక్స్ఛేంజీలకు పంజాబ్ నేషనల్ బ్యాంక్ తెలిపింది. పిఎన్‌బిలో రూ.13,500 కోట్ల మేర రుణాలను ఎగ్గొట్టి వజ్రాలవ్యాపారి నీరవ్‌మోడీ విదేశాలకు పారిపోయిన సంగతి తెలిసిందే. ఈ కేసుతో ప్రమేయముందన్న ఆరోపణల నేపథ్యంలో బ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు సంజీవ్ శరణ్, కె.వీరా బ్రహ్మాజిరావులను వారి పదవుల నుంచి ప్రభుత్వం తొలగించిందని పిఎన్‌బి తెలిపింది.

ఇదే తొలిసారి

బ్యాంకుల జాతీయకరణ పథకం - 1970 కింద ఒక జాతీయ బ్యాంక్‌కు చెందిన డైరెక్టర్లను తొలగించడం ఇదే తొలిసారి. 2018 జులైలో శరణ్, బ్రహ్మాజీలకు కేంద్రం షోకాజ్ నోటీసులు జారీ చేసింది. బ్రాడీ హౌస్ బ్రాంచ్‌లో స్విఫ్ట్ వ్యవస్థను దుర్వినియోగంపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో వివరించాలని నోటీస్‌లో పేర్కొంది. వారి వివరణలు తీసుకున్నాక బ్యాంకు బోర్డు అభిప్రాయాన్ని పరగణలోకి తీసుకొని పదవుల నుంచి వారిని తొలగించింది. కేంద్ర ప్రభుత్వ చర్యను స్వాగతిస్తున్నామని ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఎఐబిఇఎ) ప్రధాన కార్యదర్శి సిహెచ్ వెంకటాచలం తెలిపారు. బ్యాంకు యాజమాన్యానికి సంబంధం లేకుండా ఇంత మొత్తంలో కుంభకోణం సాధ్యంకాదన్నారు. అయితే ఈ కుంభకోణంలో ఇద్దరు ఎగ్జిక్యూటివ్‌లే కాక ఇతర అధికారుల ప్రమేయం కూడా ఉండివుంటుందని వెంకటాచలం సందేహం వ్యక్తం చేశారు.

మహారాష్ట్ర బిజెపి మంత్రి అధికార దుర్వినియోగం

బాంబే హైకోర్టు ఆగ్రహం

ముంబయి : అధికార దుర్వినియోగానికి పాల్పడిన మహారాష్ట్ర బిజెపి మంత్రి గిరీశ్ బాపట్‌పై బాంబే హైకోర్టు ఆగ్రహించింది. రెవెన్యూ అధికారులు ఒక రేషన్ షాపును రద్దు చేస్తూ జారీ చేసిన ఉత్తర్వులను కాదని రాష్ట్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రి బాపట్ మళ్లీ ఆ డీలర్‌కు అనుమతులనిచ్చారు. సదరు రేషన్ షాపులో అవకతవకలు జరుగుతున్నా యని స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకే సంబంధిత అధికారులు ఆ చౌకధరల దుకాణం లైసెన్స్ రద్దు చేశారు. అయితే ఆ రేషన్ షాప్ ఓనర్‌కు మరొక అవకాశమివ్వాలని పేర్కొంటూ మంత్రి బాపట్ మళ్లీ అనుమతులనిచ్చారు. కాగా, ఈ విషయం తెలుసుకున్న స్థానికులు బాంబే హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసు విచారిస్తున్న న్యాయస్థానం.. మంత్రి బాపట్ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని తెలుపుతూ.. ఆయనకు వార్నింగ్ ఇచ్చింది. మంత్రులు ప్రజా సంక్షేమాన్ని బాధ్యతగా తీసుకోవాలని ఔరంగాబాద్ ధర్మాసనం తెలిపింది. కానీ ఈ కేసులో మంత్రి బాపట్ తనకున్న అధికారాన్ని దుర్వినియోగం చేశారని, చట్టాన్నీ ఖాతరు చేయలేదని వివరించింది.

ఐసిసిడబ్ల్యూ నిధుల దుర్వినియోగం

- ఎఫ్ఐఆర్ దాఖలు చేసిన కేంద్రం

న్యూఢిల్లీ : ప్రతియేటా జాతీయ సాహస బాలల అవార్డులను ప్రదానం చేసే ఎన్జీవో ఇండియన్ కౌన్సిల్ ఫర్ చైల్డ్ వెల్ఫేర్ (ఐసిసిడబ్ల్యూ)పై కేంద్రం ఎఫ్ఐఆర్ దాఖలు చేసింది. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులను ఆ సంస్థ దుర్వినియోగం చేసిందని, ఖర్చు చేయని నిధులను తిరిగి చెల్లించడంలో విఫలమైందని ఆరోపిస్తూ కేంద్ర మహిళా శిశుసంక్షేమాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఈ చర్యకు పూనుకున్నది. సదరు ఎన్జీవో నిధుల దుర్వినియగానికి పాల్పడిందంటూ పేర్కొంటూ 2015లో హైకోర్టులో కేంద్రం రిట్ పిటిషన్ దాఖలు చేసింది. ఈ విషయంలో డబ్ల్యూసీడీ మంత్రిత్వశాఖ కింద త్రిసభ్య కమిటీని న్యాయస్థానం ఏర్పాటు చేసింది. అనంతరం తన నివేదికను కోర్టుకు సదరు మంత్రిత్వశాఖ సమర్పించింది. ఎన్జీవోపై తదుపరి దర్యాప్తు కోసం కేంద్రానికి న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. దీంతో కేంద్రం ఓ అంతర్గత కమిటీని నియమించింది. ఐసిసిడబ్ల్యూకు చెందిన బ్యాంకు ఖాతాలను కమిటీ ఆడిట్ చేసింది.

2014-16 మధ్య ఆ ఎన్జీవోకు ప్రభుత్వం కేటాయించిన మొత్తం నిధుల్లో ఖర్చు చేయని రూ. మూడుకోట్లకు పైగా నిధులను తిరిగి చెల్లించలేదని అంతర్గత కమిటీ దర్యాప్తులో తేలిందని కేంద్రం తెలిపింది. ఈ సంస్థ గతేడాది వరకు సాహస అవార్డుల కార్యక్రమాన్ని నిర్వహించేది. అయితే ఎన్జీవో నిధుల అంశం హైకోర్టు దృష్టికి రావడంతో జాతీయ సాహస బాలల అవార్డుల పథకాన్ని పునరుద్ధరించడానికి సంబంధిత మంత్రిత్వశాఖ గతవారం నిర్ణయం తీసుకున్నది. ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ 2019గా ఈ ఏడాది అవార్డులను వివిధ విభాగాల్లో ప్రకటించనున్నది.

ప్రత్యేకం

కొత్త నీట్ నిబంధనల ఫైల్ అదృశ్యం

వెల్లడించిన మెడికల్ కౌన్సిల్

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా వైద్య, దంత కళాశాలల్లో ప్రవేశాలకు నిర్వహించే నీట్ (ఎన్ఇఇటి) పరీక్షల కోసం కొత్తగా రూపొందించిన నిబంధనలతో కూడిన కీలకమైన ఫైల్ ఒకటి కనిపించడం లేదు. ఆయా కళాశాలల్లో ప్రవేశం పొందేందుకు అర్హతలను ప్రవేశ పరీక్షలో పొందిన పర్సంటేజ్ నుండి పర్సంటైల్‌కు మారుస్తూ కొత్త నిబంధనలను మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసిఐ) రూపొందించింది. ప్రవేశాల ప్రక్రియలో ఇలా మార్పు ఎందుకు చేయాల్సి వచ్చిందో ఎంసిఐ ఆ నిబంధనల పత్రంలో వివరించింది. కొత్త నిబంధనల ప్రకారం తక్కువ మెరిట్ కలిగిన విద్యార్థులకు కూడా వైద్య, దంత కళాశాలల్లో ప్రవేశం లభిస్తుంది. దీని వల్ల ప్రైవేటు కళాశాలలు కూడా లాభాలు పొందుతాయి.

అంతేకాక కేవలం అర్హులుగా ప్రకటించిన ధనికులైన విద్యార్థులు సీట్లు కొనుక్కుని చదువుకునే అవకాశం ఉంది. ఈ నిర్ణయానికి సంబంధించిన ఫైల్ ఇప్పుడు గల్లంతైనట్లు ఎంసిఐ నిర్ధారించింది. ఈ ఫైల్‌కు సంబంధించిన వివరాలను కోరుతూ న్యాయవాది, సామాజిక కార్యకర్త దేవ్ అశిష్ భట్టాచార్య 2018 డిసెంబరులో సమాచార హక్కు చట్టం కింద పిటిషన్ దాఖలు చేశారు. నీట్ కోసం రూపొందించిన కొత్త నిబంధనలకు సంబంధించిన ఫైల్ నోటింగ్‌లు, నోట్ షీట్లు తదితర వివరాలతో కూడిన పత్రాల కాపీలు కావాలని పిటిషనర్ తన అభ్యర్థనలో కోరారు. కొత్త నిబంధనలు అమలు చేసే విధంగా మెడికల్ కౌన్సిల్ చట్టం నిబంధనల్లో ఈ మార్పులను చేర్చారా లేదా అనే విషయాన్ని కూడా తెలియచేయాలని ఆయన కోరారు. దీనికి డిసెంబరు 19న ఎంసిఐ సభ్యులు స్పందిస్తూ దానికి సంబంధించిన ఫైల్ కనిపించడం లేదని, అందువల్ల కోరిన పత్రాలను అందించలేక పోతున్నామని తెలిపింది.

దీంతో ఈ ఫైల్ కనిపించకపోవడంపై ఢిల్లీ పోలీసు కమిషనర్ అమూల్య పట్నాయక్‌కు జనవరి 14న భట్టాచార్య ఫిర్యాదు చేసి, ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరారు.



ఢిల్లీ స్థిరాస్తి వ్యాపారులకు ఐటీ నోటీసులు ?

న్యూఢిల్లీ : దేశరాజధాని పరిధిలోని స్థిరాస్తి రంగంలో రూ.20వేలకు పైబడి నగదు రూపంలో లావాదేవీలు జరిపిన వ్యాపారులందరికీ ఆ ప్రాంత ఐటీశాఖ తాఖీదులు జారీ చేయనున్నట్లు సమాచారం. ఇందుకోసం ఇప్పటి వరకూ జరిగిన రిజిస్ట్రేషన్లను ఐటీ అధికారులు జల్లెడ పడుతున్నారు. తద్వారా 2015-18 మధ్య జరిపిన స్థిరాస్తి కొనుగోళ్లు, అమ్మకాల్లో అవకతవకలపై కొరడా ఝుళిపించనున్నారు. ఇప్పటికే అక్కడి ఐటీ బ ందాలు 21 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సోదాలు జరిపాయి. 2015 జున్ 1 నుంచి గత డిసెంబర్ వరకూ జరిపిన రూ.20వేలకు పైబడి జరిగిన నగదు లావాదేవీల వివరాలన్నీ ఐటీ బృందాలు సేకరించినట్లు ఒక సీనియర్ అధికారి పేర్కొన్నారు. నల్లధనం ఎక్కువగా స్థిరాస్తి రంగంలోకి మళ్లుతున్నవిషయాన్ని పసిగట్టిన ఐటీశాఖ రియాల్టీ సెక్టార్‌లో సెక్షన్లకు పలు మార్పులు చేసింది.

యుపిలో మహిళపై సామూహిక అత్యాచారం

లక్నో : ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్ జిల్లాలో ఒక మహిళపై ఇద్దరు వ్యక్తులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారని పోలీసులు శనివారం తెలిపారు. ఫిరోజాబాద్ గ్రామంలోని ఆమె ఇంటిలో శుక్రవారం ఈ ఘటన చోటుచేసుకుందని పేర్కొన్నారు. ఇంటిలో ఎవరూ లేని సమయంలో తన కుమార్తెపై తమ గ్రామానికి చెందిన గౌరవ్, రవిలు అత్యాచారానికి పాల్పడ్డారని బాధితురాలి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎవరికైనా చెబితే తీవ్ర పరిణామాలు ఉంటాయని వారు బెదిరించినట్లు తెలిపారు. నిందితులు పరారీలో ఉన్నారని, వారిపై కేసు నమోదు చేశామని పోలీసులు వెల్లడించారు.

కత్తిపోట్లకు ముగ్గురు మృతి

సంబాల్ : ఇద్దరు మహిళలతో సహా ముగ్గురు కత్తిపోట్లకు గురై అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని సంబాల్ పట్టణంలో జరిగింది. మృతిచెందిన వారిలో సంతోష్‌దేవి(70), ఆమె బంధువు కేశర్ సింగ్(62), పనిమనిషి ఉన్నా రని పోలీసులు శనివారం తెలిపారు. ఈ ఘటన గురువారం జరిగిందని, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించామన్నారు. మృతికి గల కార ణాలను ఫోరెన్సిక్ అధికారులు విశ్లేషిస్తున్నట్లు తెలిపారు.

థాయి ఆలయంలో కాల్పులు

ఇద్దరు బౌద్ధ సన్యాసులు మృతి

కతైవాత్ (థాయిలాండ్) : దక్షిణ నారాతైవాత్ ప్రావిన్స్‌లోని ఒక ఆలయంలో శుక్రవారం గుర్తు తెలియని దుండగులు ఇద్దరు బౌద్ధ సన్యాసులను కాల్చిచంపారు. మరో ఇద్దరిని గాయపరిచారు.. ఈ ప్రావిన్స్‌లో ప్రధానంగా మలయ్, ముస్లిం జనాభా ఎక్కువ. ఆరుగురు దుండగులు కాల్పులు జరిపినట్లు భావిస్తున్నామని, వారందరూ పరారీలో వున్నారని పోలీసు ప్రతినిధి తెలిపారు. గాయపడిన వారికి సమీప ఆస్పత్రిలో చికిత్స చేసి పంపించేశారు. దక్షిణ థాయిలాండ్‌లో 15ఏళ్ళ నుండి వేర్పాటువాద తీవ్రవాదం ప్రబలి వుంది. అక్కడ జరిగిన ఘర్షణల్లో ఇప్పటివరకు 6900 మంది మరణించగా, 13వేల మందికి పైగా గాయపడ్డారని స్వతంత్ర పర్యవేక్షక గ్రూపు దీప్ సౌత్ వాచ్ తెలిపింది. ఇక్కడ దాడుల్లో తరచుగా బౌద్ధులను, ముస్లిములను, మత నేతలను లక్ష్యంగా చేసుకుంటూ వుంటారు. కాగా ఈ దాడులకు తమదే బాధ్యత అని ఇంతవరకు ఏ సంస్థ ప్రకటించలేదు.



మెక్సికోలో పైప్‌లైన్ పేలి

66మంది సజీవ దహనం

మెక్సికో సిటీ : సెంట్రల్ మెక్సికోలోని హిడాల్గో రాష్ట్రం త్లెహ్యులీల్పాన్ మున్సిపాల్టీలో చమురు పైప్‌లైన్ పేలి 66 మంది మరణించారు. మరో 76మంది తీవ్రంగా గాయపడ్డారు. గాయపడినవారిలో 18 ఏళ్ల లోపు పిల్లలు ఏడుగురు, 12 ఏళ్ల లోపు బాలుడు ఒకరు ఉన్నారు. ఈ ప్రమాదం స్థానిక కాలమానం ప్రకారం శుక్రవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. చమురు దొంగిలించేందుకు పైప్‌లైన్‌కు చిల్లులు పెట్టడంతో చమురు చిమ్ముతూ ఒక్కసారిగా విస్ఫోటనం సంభవించింది. పేలుడు జరిగే సమయానికి 200 మంది దాకా ప్రమాద స్థలిలో వున్నట్లు అధికారులు తెలిపారు. పైప్ లైన్ నుంచి లీకయిన చమురును తోడి తీసుకెళ్లేందుకు వారు బకెట్లు పట్టుకుని వచ్చారు. అధికారులు చేసిన హెచ్చరికలను బేఖాతరు చేస్తూ చమురు కోసం ఎగబడడంతో ప్రాణ నష్టం అధికంగా వుందని అధికారులు తెలిపారు. మెక్సికో అధ్యక్షుడు ఆండ్రిస్ మాన్యుయెల్ లోపెజ్ ఒబ్రాడర్‌తో కలిసి హిడాల్గో గవర్నర్ ఒమర్ ఫయాద్ పత్రికా గోష్టిలో మాట్లాడుతూ ఎక్కువ మంది సజీవ దహనం కావడానికి చమురు దొంగతనమే కారణమన్నారు. అక్రమ చమురు ట్యాప్‌లను అరికట్టేందుకు పైప్‌లైన్‌ను తాత్కాలికంగా మూసెయ్యాలని గత నెల 27న ఒబ్రాడర్ ఆదేశించారు. .గతేడాది మొదటి పది మాసాల్లోనే 12,581 సార్లు పైప్‌లైన్లకు ప్రమాదకరమైన రీతిలో, అక్రమంగా కనెక్షన్లు పెట్టి, ఇంధన చౌర్యానికి పాల్పడుతున్న వారిపై కొత్త అధ్యక్షుడు ఆండ్రెస్ మాన్యుయల్ లోపెజ్ ఒబ్రాడర్ చర్యలు చేపట్టారు. ఇది జరిగిన మూడు వారాల్లోనే ఈ దుర్ఘటన సంభవించింది. ఈ ఇంధన చౌర్యంలో దొంగలకు సహకరిస్తూనో, లేదా బయటకు చిమ్ముతున్న చమురును క్యాన్లలో పట్టుకుంటోనో వందలాదిమంది ప్రజలు ఆ పైపులకు చుట్టుపక్కలే వుంటారు.

అమెరికాలో ముదురుతున్న సంక్షోభం

- 29వ రోజుకు చేరిన షట్‌డౌన్
- స్తంభించిన ప్రభుత్వ కార్యకలాపాలు
- ప్రభుత్వ విమాన సర్వీసులు

వాషింగ్టన్ : ట్రంప్ ప్రభుత్వం అనుసరిస్తున్న మూర్ఖత్వపు వైఖరి కారణంగా అమెరికాలో ప్రభుత్వ షట్‌డౌన్ సుదీర్ఘంగా కొనసాగుతుండడంతో ఫెడరల్ ఉద్యోగులు వీధుల్లోకి వస్తున్నారు. షట్‌డౌన్ కారణంగా ఉద్యోగాలు కోల్పోయి, వేతనాలు అందక నానా అవస్థలు పడుతున్నా ట్రంప్ పట్టించుకోకపోవడంపై వారు అగ్రహం వ్యక్తం చేశారు. రాజధాని వాషింగ్టన్‌లో శుక్రవారం వారు నిరసన ర్యాలీ నిర్వహించారు. షట్‌డౌన్‌కు తక్షణమే స్వస్తి పలకాలని, లాక్డ్ అవుట్ అయిన ఉద్యోగాలను పునరుద్ధరించాలని నినదించారు. షట్‌డౌన్ కారణంగా అమెరికా ప్రభుత్వ కార్యకలాపాలు స్తంభించి నేటికి 29 రోజులవుతోంది.

అమెరికా–మెక్సికో సరిహద్దు గోడ నిర్మాణానికి నిధుల మంజూరు విషయంలో అధ్యక్షుడు ట్రంప్‌కు, అమెరికా కాంగ్రెస్‌లోని డెమొక్రాట్లకు మధ్య తలెత్తిన వివాదం ప్రభుత్వ షట్‌డౌన్‌కు దారి తీసిన సంగతి తెలిసిందే. అమెరికా చరిత్రలోనే ఇంతకాలమూ ఇలా ప్రభుత్వ కార్యకలాపాలు స్తంభించడం జరగలేదు. శుక్రవారం నుండి ప్రభుత్వ విమాన సర్వీసులు కూడా నిలిపివేశారు.



షట్‌డౌన్‌కు స్వస్తి చెప్పాలంటూ శుక్రవారం నాడు వాషింగ్టన్‌లో ప్రదర్శన నిర్వహిస్తున్న ఫెడరల్ ఉద్యోగులు

వైట్‌హౌస్ అనుమతి లేకుండా, చట్టసభల ప్రతినిధులు పర్యటనలు జరపకుండా వుండేందుకే ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం తలెత్తిన వివాదం పరిష్కారమవకుండా ప్రతినిధుల సభ స్పీకర్ నాన్సీ పెలోసి ఆఫ్ఘనిస్తాన్ వెళ్లేందుకు విమానాన్ని అందచేసేందుకు ప్రభుత్వం తిరస్కరించింది.

షట్‌డౌన్‌పై నేడు ట్రంప్ కీలక ప్రకటన

వాషింగ్టన్ : ప్రభుత్వ పాక్షిక షట్‌డౌన్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నేడు (భారత కాలమానం ప్రకారం ఆదివారం అర్ధరాత్రి గంటలకు) కీలక ప్రకటన చేయనున్నారు. వైట్‌హౌస్ నుంచి ప్రత్యక్ష ప్రసారంలో ముఖ్య ప్రకటన చేయనున్నట్లు ట్రంప్ తన ట్విట్టర్‌లో పేర్కొన్నారు. గత ఏడాది డిసెంబరు 22 నుంచి అమెరికా ప్రభుత్వ షట్‌డౌన్ కొనసాగుతోన్న సంగతి తెలిసిందే. దీంతో అమెరికాలో దాదాపు 8 లక్షల మంది ఉద్యోగులు వేతనాలు లేకుండా పనిచేస్తున్నారు. కాగా మెక్సికో సరిహద్దు వెంబడి గోడ నిర్మాణానికి కాంగ్రెస్ నిరాకరించడంతో తలెత్తిన ఆర్థిక సంక్షోభాన్ని పరిష్కరించాలని అమెరికా మాజీ అధ్యక్షుడు జార్జిబుష్ శుక్రవారం పిలుపునిచ్చారు. ఈ మేరకు జీతాలు చెల్లించని తన సీక్రెట్ సర్వీస్ అధికారులకు స్వయంగా జార్జిబుష్ పిజ్జాలు పంచారు. వేతనాన్ని ఆశించకుండా తమ దేశం కోసం కష్టపడి పనిచేస్తున్న ఫెడరల్, సీక్రెట్ సర్వీస్ సిబ్బందికి మద్దతు తెలిపారు.

ఫిబ్రవరి చివరిలో ట్రంప్-కిమ్ రెండో భేటీ!



వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జాంగ్ ఉన్ ఫిబ్రవరి చివరిలో రెండోసారి సమావేశం కానున్నారని వైట్‌హౌస్ మీడియా కార్యదర్శి సారా సాండెర్స్ తెలిపారు. దాదాపు గంటన్నర పాటు జరిగే ఈ సమావేశంలో అణునిరాధీయుకరణపై చర్చిస్తారని, ఈ సమావేశ వేదికను త్వరలో ప్రకటిస్తామని ఆయన అన్నారు. . ట్రంప్‌తో ఉత్తరకొరియా అధికార పార్టీ కొరియన్ వర్కర్స్ పార్టీ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు కిమ్ యంగ్ చోల్ సామవేశం ముగిసిన వెంటనే వైట్‌హౌస్ ఈ ప్రకటన చేయడం విశేషం. వాషింగ్టన్‌లోని డల్లాస్ అంతర్జాతీయ విమానాశ్రయానికి గురువారం రాత్రి చేరుకున్న చోల్ శుక్రవారం ఉదయం అమెరికా విదేశాంగ మంత్రి మైక్ పాంప్‌పియోతో సమావేశమయ్యారు. కాగా, గత ఏడాది జూన్‌లో సింగ్‌పూర్‌లో ట్రంప్–కిమ్ తొలిసారిగా సమావేశమయ్యారు. ఆ సందర్భంలోనే మరోసారి సమావేశం కావాలని ఇరువురు నేతలు నిర్ణయించుకున్న సంగతి తెలిసిందే.

నల్ల జాతీయుడి హత్య కేసులో తెల్ల జాతి పోలీసు అధికారికి జైలుశిక్ష

చికాగో : నల్ల జాతీయుడైన లాక్వాన్ మెక్‌డొనాల్డ్‌ను 2014లో హత్య చేసినందుకు గానూ మాజీ శ్వేత జాతి పోలీసు అధికారి జాసన్ వాన్ డైక్‌కు ఆరేళ్ళ 9 మాసాల జైలు శిక్ష విధించారు. వర్ణవివక్షత ఎక్కువగా వుండే చికాగోలో దశాబ్దాల కాలంలో విధి నిర్వహణలో వుండగా చేసిన హత్యకు పోలీసు అధికారికి జైలు శిక్ష విధించడం ఇదే మొదటిసారి. అయితే ఈ శిక్ష కూడా తక్కువగానే వుందంటూ మానవ హక్కుల కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. కాగా, న్యాయమూర్తి తీర్పు తర్వాత బాధితుడి తరపు న్యాయవాది హర్షం వ్యక్తం చేశారు. దాదాపు 9గంటల విచారణ తర్వాత వెలువడిన తీర్పుపై ఆయన చాలా భావోద్వేగంతో మీడియాతో మాట్లాడారు. 2014 అక్టోబరు 20న 17ఏళ్ళ మెక్‌డొనాల్డ్‌పై వాన్ డైక్ 16బుల్లెట్లు ప్రయోగించాడు. పేవ్‌మెంట్‌పై మెక్‌డొనాల్డ్ పడిపోయిన తర్వాత కూడా కాల్పులు కొనసాగిస్తూనే వచ్చాడు. ఆత్మరక్షణ కోసమే తాను కాల్పులు జరిపానని తొలుత డైక్ చెబుతూ వచ్చారు. కానీ కారులోని డాష్‌బోర్డ్ కెమెరా ఫుటేజ్ చూసిన తర్వాత కేవలం చిన్న కత్తితో బాధితుడు పోలీసు అధికారి నుండి తప్పించుకోవడానికి ప్రయత్నించాడని న్యాయమూర్తి నిర్ధారించారు. డైక్ చర్యలను మాఫీ చేయడానికి ప్రయత్నించారంటూ మరో ముగ్గురు అధికారులపై విడిగా అభియోగాలు మోపారు. కానీ వారిని నిర్దోషులగా న్యాయమూర్తి విడిచిపెట్టారు.

పాక్‌లో అమెరికాతో చర్చల్లేవు

స్పష్టం చేసిన తాలిబన్

పెషావర్ : అమెరికా ప్రత్యేక దూత జల్మే ఖలీల్‌జద్‌తో ఇస్లామాబాద్‌లో చర్చలను పునరుద్ధరించడానికి తాము సమాయత్తమైనట్లు పాకిస్తాన్ మీడియాలో వచ్చిన వార్తలను ఆఫ్ఘన్ తాలిబన్ తిరస్కరించింది. ఆఫ్ఘన్ ప్రభుత్వంతో కూడా నేరుగా ఎలాంటి చర్చలు వుండబోవని పునరుద్ఘాటించింది. ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌తో సహా పాక్ అధికారులు, ఖలీల్‌జద్ మధ్య శుక్రవారం చర్చలు జరిగిన నేపథ్యంలో ఇస్లామాబాద్‌లో సమావేశం జరిగే అవకాశం వుందని పాక్ వార్తాపత్రికలు, టీవీ చానెళ్ళు పేర్కొన్నాయి. దీనిపై సీనియర్ తాలిబన్ నేతలు మాట్లాడుతూ, శాంతి క్రమంలో భాగంగా ఇస్లామాబాద్‌లో అమెరికా ప్రతినిధి వర్గంతో, ఆఫ్ఘన్ ప్రభుత్వంతో తాము చర్చలు జరపాలని పాకిస్తాన్‌తో సహా కొన్ని ప్రాంతీయ శక్తులు కోరాయని, కానీ తాము ఆ ప్రతిపాదనను తిరస్కరించామని చెప్పారు. ఈమేరకు తాలిబన్ ప్రతినిధి ముజాహిద్ ఒక ప్రకటన చేశారు. ఖలీద్‌జద్ అంగీకృత ఎజెండా అమలుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారని తాలిబన్ ఆరోపించడంతో ఉభయ పక్షాల మధ్య చర్చలు నిలిచిపోయాయి. తిరిగి ఎప్పుడు పునరుద్ధరించబడేది చెప్పలేమని తాలిబన్ పేర్కొంది.

షరీఫ్ ఇంకా కోలుకోలేదు

మరిన్ని వైద్యపరీక్షలు అవసరమన్న వైద్య బృందం



లాహోర్ : స్థానిక కాట్ లఖ్‌పట్ జైల్లో వున్న పాకిస్తాన్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ ఆరోగ్యం క్షీణించిందని ప్రత్యేక వైద్య బృందం తెలిపింది. ఆయనకు మరిన్ని పరీక్షలు చేయడం అవసరమని తెలిపింది. పంజాబ్ కార్డియాలజీ ఇనిస్టిట్యూట్‌కి చెందిన నిపుణులతో కూడిన ఈ బృందం షరీఫ్‌ను పూర్తిగా పరీక్షించి, బుధవారం జైల్లోనే పలు పరీక్షలు చేసింది. అవినీతి కేసులో షరీఫ్ ప్రస్తుతం ఏడేళ్ల జైలుశిక్షను అనుభవిస్తున్నారు.

జెఈఈలో తెలుగు విద్యార్థుల హవా

2019 ఫలితాల్లో టాపర్స్ వీరే...	
1.ధ్రువ్ అరోరా	మధ్యప్రదేశ్
2.రాజ్ ఆర్యన్ అగర్వాల్	మహారాష్ట్ర
3.అదెల్లి సాయికిరణ్	తెలంగాణ
4.బొజ్జ చేతన్ రెడ్డి	ఆంధ్రప్రదేశ్
5.సంబిత్ బెహ్రా	రాజస్థాన్
6.నమన్ గుప్తా	ఉత్తర్‌ప్రదేశ్
7.ఇందుకూరి జయంత్ ఫణి సాయి	తెలంగాణ
8.కె. విశ్వంత్	తెలంగాణ
9.హిమాన్షు గౌరవ్ సింగ్	ఉత్తర్‌ప్రదేశ్
10.కెవిన్ మార్టిన్	కర్ణాటక
11.శుభంకర్ గంభీర్	రాజస్థాన్
12.బట్టెపాటి కార్తికేయ	తెలంగాణ
13.అంకిత్ కుమార్ మిశ్రా	మహారాష్ట్ర
14.జయేశ్ సింగ్లా	పంజాబ్
15.గుప్తా కార్తికేయ్ చంద్రేశ్	మహారాష్ట్ర

దేశ, విదేశాల్లో 273 పట్టణాల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఏపీ నుంచి దాదాపు 60 వేల మంది వరకు పరీక్షకు హాజరుకాగా, తెలంగాణ నుంచి 70 వేల మంది వరకు పరీక్షకు హాజరైనట్లు తెలుస్తోంది. రెండో విడత మెయిన్ పరీక్షలను ఏప్రిల్‌లో నిర్వహిస్తామని ఎన్‌టిఏ ప్రకటించింది. అలాగే మొదటి విడత ఫలితాలు షెడ్యూల్ కంటే 12 రోజుల ముందుగానే ప్రకటించడం విశేషం. జేఈఈ మెయిన్ ఫలితాల్లో ఏపీ నుంచి టాపర్‌గా నిలిచిన చేతన్ స్వస్థలం కష్ణాజిల్లా తాడేపల్లి. విజయవాడ గాయత్రి నగర్‌లోని చైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్ చదివాడు. జేఇఇ మెయిన్స్ మొదటి విడత పరీక్షలో అత్యుత్తమ ప్రతిభతో 100 పర్సంటైల్ సాధించాడు. పరీక్షలో 360 మార్కులకుగాను 350 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచాడు. ఐఐటీ బాంబేలో బీటెక్ (కంప్యూటర్స్) చేయడమే తన లక్ష్యమని స్పష్టం చేశాడు. జేఇఇ మెయిన్ పరీక్షకు రోజులో 12 నుంచి 13 గంటలు చదివినట్లు తెలిపిన చేతన్...తనకు ఫిజిక్స్ ఇష్టమైన సబ్జెక్టు అని తెలిపాడు.

మేత ముప్పే

పెట్టాయి. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు (పిఎసిఎస్‌లు) యంత్రాలను కొని అద్దెకిస్తున్నాయి. ప్రైవేటు వ్యక్తులతో కస్టమ్ హాయిర్ సెంటర్లను సబ్సిడీలిచ్చి ప్రభుత్వం నడుపుతోంది. డ్వాక్రా, రైతు మిత్ర గ్రూపులు, రైతు ఉత్పత్తి దారుల సంఘాల (ఎఫ్‌పిఓ)కు యంత్రాలను సమకూరుస్తున్నారు. హర్యానా, పంజాబ్ తదితర రాష్ట్రాల నుంచి యంత్రాలను వరి కోతల సమయంలో బ్రోకర్లు ఇక్కడికి రప్పిస్తున్నారు.

గడ్డి వృథా

ఎకరం విస్తీర్ణంలో వరి కోత, నూర్పిడి రెండింటికీ కలిపి రైతుల నుంచి రూ.రెండు వేలు వసూలు చేస్తున్నారు. గంటలో పని పూర్తవుతుంది. వడ్లు రైతు చేతికందుతాయి. అయితే యంత్రాలు కోసిన గడ్డి తడి మీదుండటం వలన నల్లబడి పశుగ్రాసానికి అస్సలు పనికిరాదు. అమ్ముకుందామంటే ఆ గడ్డి రూ.వెయ్యికి కూడా పోవట్లేదు. యంత్రాలు కోసిన గడ్డిని రైతులు పొలంలోనే తగలబెడుతున్నారు. దీని వలన కాలుష్యం పెరుగుతోంది. గడ్డిని తగలబెడితే సాగుకు అనుకూలించే బాక్టీరియా నశిస్తుంది. ఫలితంగా చేను సారం తగ్గుతుందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. పొలంలోనే కలియదున్నితే తదుపరి సాగుకు ఎరువుగా ఉపయోగపడుతుందని సూచిస్తున్నారు.

రూ.2 వేలు లాభం

అదే కూలీల దగ్గరకొస్తే వరి కోతకు ఆరుగురు, కుప్ప వేయడానికి, నూర్చడానికి మరో ఆరుగురు కావాలి. వారికి కూలి ఎకరానికి రూ.7–8 వేల వరకు రైతుకు ఖర్చవుతుంది. కొన్ని చోట్ల ఈ మొత్తం పనికి ఐదు బస్తాల వడ్లు కూలిగా తీసుకుంటున్నారు. అదైనా ఇంచుమించు అంతే అవుతుంది. కాగా కూలీలు కోతలు, నూర్పిడి చేస్తే లభించే గడ్డి పశుగ్రాసానికి బాగా ఉపయోగపడుతుంది. ఏడాదంతా నిల్వ ఉంచడానికి వీలవుతుంది. అందుకే ఈ ఎండు గడ్డికి డిమాండ్ ఎక్కువ. ట్రాక్టర్ గడ్డిని అమ్మితే తక్కువలో తక్కువ రూ.పది వేలు వస్తుంది. రైతుకు రెండు పాడి పశువులున్నట్లయితే ట్రాక్టర్ గడ్డి ఏడాదికి సరిపోతుంది. యంత్రాలు కోసిన గడ్డికి రూ.వెయ్యి రావడం గగనమైతే కూలీలు కోసిన గడ్డికి రూ.పది వేలు గిడుతుంది. యంత్రానికి రైతు రూ.రెండు వేలు ఖర్చు పెడితే గడ్డిపై రూ.వెయ్యి కూడా రాదు. అదే కూలీలకు రూ.8 వేలు ఖర్చు పెడితే రూ.పది వేల గడ్డి మిగులుతుంది. రూ.రెండు వేలు లాభం.

రూ.12 వేలకు కొనాలి

కూడికలు, తీసివేతలు వేస్తే రైతుకు ఆర్థిక ప్రయోజనం పెద్దగా కనపడనట్లే ఉంటుంది. అయితే కూలీలకు పన్నెండు పని దినాలు లభిస్తాయి. పాడి పశువులున్న రైతులు గ్రాసాన్ని కొనుగోలు చేసేందుకు అదనంగా ఖర్చు చేయాల్సిన అవసరం ఉండదు. పశుగ్రాసానికి కొరత ఏర్పడదు. ప్రస్తుతం గ్రామాల్లో ట్రాక్టర్ గడ్డి రూ.12 వేలు పలుకుతోంది. యంత్రాలతో వరి కోసిన రైతులు తమకు పాడి పశువులుంటే అంత పెట్టి కొనాల్సిందే. ఇక్కడ సమస్యల్లా సమయం. ఒక ఎకరంలో కూలీలు వరి కోతలు నిర్వహించి పనలను ఆరబెట్టి కుప్పేసి నూర్చాలంటే వారం పడుతుంది. కోతలకు ఒక రోజు. నూర్పిడికి ఒక రోజు. మధ్యలో ఆరడానికి ఐదు రోజులు. అదే యంత్రమైతే గంటలో పని ముగిస్తుంది. అందుకే నష్టమైనా తుపాన్ల హెచ్చరికల వేళ రైతులు యంత్రాలను ఆశ్రయిస్తున్నారు. తుపాన్లకు మొత్తం పంటను పోగొట్టుకొనే కంటే అంత కంటే తక్కువ నష్టం వైపు మొగ్గు చూపుతున్నారు. పశుగ్రాస సంక్షోభం ఏర్పడుతోంది.

మొదటి పేజీ తరువాయి

బిజెపి హఠావో

నిరాశకు గురిచేసి, మోసం చేసిన బిజెపిని ఓడించాల్సిందేనని అన్నారు. డిఎంకె అధినేత స్టాలిన్ మాట్లాడుతూ ఒకప్పుడు నరేంద్రమోడీ దేశంలో ప్రతిపక్షమే లేదని అన్నారని, ఇప్పుడాయన ప్రతిపక్షాల గురించే మాట్లాడాల్సివస్తోందని అన్నారు. మాజీ ప్రధాని దేవగౌడ మాట్లాడుతూ బిజెపిపై తీవ్ర స్థాయిల విమర్శలు చేశారు. దేశ ప్రజల ఐక్యతను గండి కొడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రులు యశ్వంత్ సిన్హా, అరుణ్ శౌరి, శత్రుఘ్న సిన్హా, వివిధ రాష్ట్రాల మాజీ ముఖ్యమంత్రులు ఫరూక్ అబ్దుల్లా, ఒమర్ అబ్దుల్లా, గెగాంగ్ అపాంగ్ తదితరులు ఈ ర్యాలీలో ప్రసంగించారు.. ఆర్‌జెడి నేత తేజస్వి యాదవ్, ఎన్‌సిపి అధినేత శరద్ పవార్, ఆర్‌ఎల్‌డికి చెందిన అజిత్ సింగ్, జయంత్ చౌదరి, జెఎంఎంఎ నేత హేమంత్ సోరెన్, పటీదార్ ఉద్యమనేత హార్దిక్ పటేల్, ఎల్‌జెడి నేత శరద్ యాదవ్, జార్ఖండ్ వికాస్ మోర్చాకు చెందిన బాబులాల్ మరాండి, దళిత నేత జిగ్నేష్ మేవాని తదితరులు పాల్గొన్నారు..

ఆర్టీసి జెఎసి ఏర్పాటు

ప్రధాన కార్యదర్శి వి వరహాల నాయుడు, వైఎస్ఆర్ మజ్దూర్ యూనియన్ నాయకులు సిబిఎస్ రెడ్డి, యునైటెడ్ వర్కర్స్ యూనియన్ నాయకులు జి శ్రీనివాస్, ఓస్వా నాయకులు ఎంవి కొండారెడ్డి, వర్కర్స్ యూనియన్ నాయకులు శ్రీనివాసరావు, బహుజన వర్కర్స్ యూనియన్ నాయకులు సిహెచ్ శ్యాంసన్, ఇయు రాష్ట్ర నాయకులు ఎం హనుమంతురావు, పి సుబ్రమణ్యంరాజు, జివి నరసయ్య, ఎ ప్రభాకర్, ఎండి సిద్ధిక్, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ అనుమతి లేకుండా చార్జిషీటా..!

ఉగ్రవాద వ్యతిరేక విభాగానికి చెందిన పోలీసులు సోమవారం నమోదు చేసిన సంగతి తెలిసిందే. ' న్యాయ విభాగం నుండి ఆమోదం తీసుకోకుండా, ఎలా చార్జిషీట్ దాఖలు చేశారు' అని విచారణ సందర్భంగా కోర్టు ప్రశ్నించింది. పది రోజుల్లో ఆమోదం పొందుతామని పోలీసులు తెలిపారు. సంబంధిత అనుమతులు పొందేందుకు వచ్చే నెల 6 వరకు కోర్టు గడువునిచ్చింది.

కౌలు రైతులకు రుణమాఫీ చేయాలి

- జొన్న, మొక్కజొన్న బోనస్ డబ్బులు విడుదల చేయాలి
- ఎపి కౌలు రైతుల సంఘం

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

కౌలు రైతులకు రుణమాఫీ చేసి ఆదుకోవాలని, జొన్న, మొక్కజొన్న రైతులకు బోన్ డబ్బులను వెంటనే విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం డిమాండ్ చేసింది. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో అధ్యక్షులు నాగబోయిన రంగారావు అధ్యక్షతన రాష్ట్ర కమిటీ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. కౌలురైతుల సమస్యలపై సమావేశం పలు తీర్మానాలు చేసింది. పెథాయ్ తుఫాన్ వల్ల నష్టపోయిన కౌలు రైతులకు నెలరోజులు పూర్తైనా నష్టపరిహారం చెల్లించకపోవడం చాల సిగ్గుచేటని సమావేశం అభిప్రాయపడింది. వెంటనే బాధిత కౌలురైతులకు పరిహారం ఇప్పించాలని ప్రభుత్వాన్ని కోరింది. రంగుమారిన ధాన్యాన్ని మద్దతు ధరకే కొనుగోలు చేసి కౌలు రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేసింది.

మూడు సంవత్సరాల నుండి రాయసీమ, ప్రకాశం, నెల్లూరు విజయనగరం జిల్లాల్లో కరువు వల్ల పంటలు తీవ్రంగా దెబ్బతిని నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.25 వేలు చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తీర్మానం చేసింది. కౌలురైతులకు పంటరుణాలు ఇవ్వకుండానే వేల కోట్లాది రూపాయలు పంట రుణాలు ఇచ్చినట్లు కాకి లెక్కలను ముఖ్యమంత్రి చెప్పటం వట్టి భూటకమని, ఇటీవల విడుదల చేసిన శ్వేత పత్రంలో కౌలురైతులకు పంట రుణాలు ఇచ్చినట్లు పేర్కొనడం పచ్చి అబ్బద్ధమని విమర్శించింది. రబీలోనైనా కౌలురైతులకు పంట రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేసింది. కౌలు రైతుల కోసం ప్రత్యేక మేనిఫెస్టోను తయారుచేసి అన్ని రాజకీయ పార్టీలు తమ ఎన్నికల ప్రణాళికలో కౌలు రైతుల డిమాండ్లను పొందుపర్చాలని, వాటి అమలుకు దశల వారీగా ఉద్యమం చేపట్టాలని నిర్ణయించింది. ఫిబ్రవరి15న జిల్లా కేంద్రాల్లో రౌండ్ టేబుల్ సమావేశాలు, నియోజకవర్గాల్లో సదస్సులు నిర్వహించాలని మండల, గ్రామస్థాయిల్లో ప్రచారం చేయాల నిర్ణయించింది. వాటి అమలుకు కృషి చేయాలని అన్ని కమిటీలకు పిలుపునిచ్చింది. సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి పి జమలయ్యతో పాటు రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

కాశ్మీర్ భారత్‌లో అంతర్భాగమే

- పాకిస్థాన్ తన జోక్యాన్ని ఆపేయాలి
- ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

'ముమ్మాటికీ కాశ్మీర్ భారతదేశంలో అంతర్భాగమే. అది భారత్‌కు గుండెకాయలాంటిది. కాశ్మీర్ విషయంలో పాకిస్తాన్ తన జోక్యాన్ని మానుకోవాలి. బీజేపీ, కాంగ్రెస్ మోసపూరిత విధానాలతోనే అక్కడ అలజడి చెలరేగుతున్నది' అని ఎంఐఎం పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ అన్నారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లో జరిగిన అంతర్జాతీయ యువజన నాయకత్వ సదస్సులో 'భారత దేశంలో యువత అభివృద్ధి–విధాన పర నిర్ణయాలు' అనే అంశంపై చర్చాగోష్టిలో మాట్లాడారు. ఈ సందర్భంగా అసదుద్దీన్ ఓవైసీ మాట్లాడుతూ..జమ్మూకాశ్మీర్‌లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు మోసపూరిత హామీలతో అక్కడి ప్రజలను మభ్యపెడుతున్నాయని విమర్శించారు. న్యాయంగా వాళ్లకు దక్కాల్సిన వాటిని ఇవ్వడంలోనూ ఆ పార్టీలు మోసపూరితంగానే వ్యవహరిస్తున్నాయన్నారు. వాళ్లకు జరుగుతున్న అన్యాయాన్ని తట్టుకోలేక, మరోవైపు ఉద్యోగాల్లేక యువత రోడ్లపైకి వస్తున్నదని వివరించారు. అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తే అక్కడ మామూలు వాతావరణ పరిస్థితిని నెలకొల్పవచ్చునన్నారు. జమ్మూకాశ్మీర్‌లో రాష్ట్ర ప్రభుత్వం పడిపోయి 8 నెలలైందని, అక్కడ రాజకీయ అనిశ్చితి ఏర్పడిందని వ్యాఖ్యానించారు. భారతదేశంలో 25 ఏళ్ల లోపు యువత 50 శాతం ఉందని, దానిని ఉపయోగించుకోవడంలో పాలకులు విఫలమవుతున్నారని విమర్శించారు. మరోవైపు జనాభావృద్ధి నియంత్రణ కరువైందన్నారు. జనాభా వృద్ధి నియంత్రణలో దక్షిణ భారతదేశం కొంత మెరుగ్గా ఉందని, ఉత్తరాదిలో మాత్రం జనాభా సంఖ్య ఏటికేడు పెరిగిపోతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. భారత్ వేగంగా అభివృద్ధి చెందాలంటే యువత రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. చట్టసభలకు పోటీ చేసే వయస్సును 20 ఏండ్లకు తగ్గించాలని, అవసరమైతే ఇన్నిసార్లే పోటీచేయాలన్న నిబంధన రావాలని ఆకాంక్షించారు. జాతీయ పార్టీల్లో ఉంటే యువతకు సరైన ప్రాతినిధ్యం దక్కదని, 50 ఏళ్లయినా కార్పొరేటర్ కాలేని పరిస్థితి ఉంటుందని అన్నారు. ప్రత్యామ్నాయ పార్టీల ద్వారా యువత చొరవ చేసి రాజకీయాల్లోకి రావాలని కోరారు.

విద్యారంగ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం

యుటిఎఫ్ కార్యవర్గ సమావేశంలో ఎమ్మెల్సీ బాలసుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

విద్యారంగంలోని సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని శాసనమండలి పిడిఎఫ్ ఫ్లోర్ లీడర్ వి బాల సుబ్రహ్మణ్యం అన్నారు. యుటియఫ్ రాష్ట్ర కార్యవర్గం విజయవాడలోని యుటియఫ్ రాష్ట్ర కార్యాలయంలో శనివారం జరిగింది. ఈ సందర్భంగా బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ విద్యారంగంలో అమలు అవుతున్న విధానాలు కార్పొరేట్ పాఠశాలలకు అనుకూలంగా మార్చుతున్నారని విమర్శించారు. రేషనలైజేషన్ పేరుతో పాఠశాలలు మూసివేయడం తగదన్నారు. ఈ విద్యాసంవత్సరంలో 1.89లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో పెరగడం అభినందనీయమన్నారు. అందుకు తగ్గట్టుగా ప్రభుత్వం ఉపాధ్యాయుల నియామకం చేయకపోవడం పట్ల తీవ్ర నిరసన తెలిపారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం(సిపిఎస్) రద్దు చేసి పాత పెన్షన్‌ను పునరుద్ధరిస్తూ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సమావేశం డిమాండ్ చేసింది. అన్ని కేడర్ ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇవ్వాలని కోరారు. రాష్ట్రప్రభుత్వం ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు మధ్యంతర భృతి(ఐఆర్) 35శాతం వెంటనే ప్రకటించాలని, మున్సిపల్ ఉపాధ్యాయులకు పిఎఫ్ ఖాతాలను ప్రారంభించాలని, నియోజకవర్గానికి ఒక డిప్యూటీ డిఇవో పోస్టు మంజూరు చేయాలని, విద్యార్థుల సంఖ్య 500 దాటిన ఉన్నత పాఠశాలల్లో ఇంటర్మీడియేట్ విద్య ప్రారంభించాలని కార్యవర్గం తీర్మానించింది. మార్చిలో జరగే పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఫెడరేషన్ బలపరిచిన ఐ వెంకటేశ్వరరావు, కెఎస్ లక్ష్మణరావులను గెలిపించి ప్రభుత్వ విద్యారంగ బలోపేతానికి సహకరించాలని విజ్ఞప్తి చేసింది. ఈ సమావేశంలో యుటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ సాబ్జీ, పి బాబురెడ్డి, గౌరవాధ్యక్షులు కెఎస్ఎస్ ప్రసాద్, సహాధ్యక్షులు బి శ్రీదేవి, ఎన్ వెంకటేశ్వర్లు, కార్యదర్శులు డి రాము, ఎస్ మహమ్మద్ జిలాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్‌లో కూలిన డ్రాగన్ ట్రైన్

- తప్పిన పెను ప్రమాదం
- సందర్శకుల ఆందోళన

ప్రజాశక్తి – తణుకు రూరల్

పశ్చిమగోదావరి జిల్లా తణుకులో ఏర్పాటు చేసిన మాధురీ ట్రేడ్ ఎగ్జిబిషన్‌లో ఘోర ప్రమాదం తప్పింది. రన్నింగ్‌లో ఉన్న డ్రాగన్ ట్రైన్ శనివారం సాయంత్రం అకస్మాత్తుగా కూలిపోయింది. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టమూ సంభవించకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. సంక్రాంతి సెలవుల నేపథ్యంలో గత వారం రోజులుగా ఇక్కడ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో నిత్యం పిల్లలు, పెద్దలు, మహిళలు సరదాగా ఇక్కడకు పెద్దఎత్తున వస్తున్నారు. రోజూలాగే శనివారం కూడా పెద్దఎత్తున ప్రజలు ఎగ్జిబిషన్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఇక్కడ ఏర్పాటు చేసిన డ్రాగన్ ట్రైన్‌ను సుమారు 40 మంది ఎక్కారు. రన్నింగ్‌లో ఉన్న సమయంలో ఒక్కసారిగా రైలు ట్రాక్ అదుపుతప్పి పక్కకు ఒరిగిపోయింది. ఈ ఘటనలో అందరూ క్షేమంగా బయటపడ్డారు. పరిమితికి మించి ఎక్కించడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. ట్రాక్‌ను బురద ప్రాంతంలో ఏర్పాటు చేయడం ఈ ప్రమాదానికి ఒక కారణమని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా దీనికి పూర్తి స్థాయిలో అనుమతులు కూడా లేవనే ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో నిర్వాహకులపై సందర్శకులు మండిపడ్డారు.

కమల్, వెంకీతో మల్టీస్టారర్?





ప్రస్తుతం తెలుగు, తమిళం, బాలీవుడ్‌లో మల్టీస్టారర్లు రాజ్యమేలుతున్నాయి. ఇటీవల వరుణ్‌తేజ్‌తో కలసి 'ఎఫ్2' చేశారు వెంకటేశ్. దీని తర్వాత అతని మేనల్లుడు నాగచైతన్య కాంబినేషన్‌లో 'వెంకీ మామ' చేయబోతున్నాడు. తాజాగా కమల్ హాసన్‌తో కలసి వెంకీ ముఖ్య పాత్రలో మరో మల్టీస్టారర్ తెరకెక్కబోతుందని సమాచారం. వెంకీ, కమల్ గతంలో 'ఈనాడు' చేశారు. ఇప్పుడు శ్రీకాంత్ అడ్డాల దర్శకత్వంలో ఈ సినిమా రూపొందబోతుంది. గీతా ఆర్ట్స్ పతాకంపై అల్లు అరవింద్ ఈ సినిమాను నిర్మించనున్నారని తెలిసింది. ఈ సినిమాకు 'కూచిపూడి వారి వీధి' అనే టైటిల్‌ను కూడా పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ప్రస్తుతం కమల్ 'భారతీయుడు 2' చిత్రీకరణలో బిజీగా ఉన్నాడు. ఇది శుక్రవారమే షూటింగ్ మొదలైంది. వెంకటేశ్ 'వెంకీ మామ' చిత్రంలో చేయబోతున్నాడు.

సంగీతంలో విద్యార్థినే

కె.జె.ఏసుదాస్



"నేను అక్షరాల విషయంలో చాలా పర్‌ఫెక్ట్‌గా ఉండాలనుకుంటాను. ఇది నా తల్లి నుంచి నేర్చుకున్నాను. నేను క్రిష్టియన్ ఫ్యామిలీలో పుట్టినా సంస్కృతంలోని అక్షరాలను నేర్చుకోమని ఆమె చెప్పారు. అది ఆమె నాకు అందించిన ఆశీర్వాదం" అని కె.జె.ఏసుదాస్ గతాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ లెజండరీ గాయకులు పదేళ్ల తర్వాత హైదరాబాద్‌లో సంగీత కచేరి (లైవ్ కాన్సర్ట్) నిర్వహించనున్నారు. హైదరాబాద్‌లోని శిల్పకళావేదికలో ఆదివారం ఈ కచేరి జరగనుంది. ఈ సంగీత విభావరిలో ఏసుదాస్‌తో పాటు విజయ్ ఏసుదాస్, కల్పన కూడా పాల్గొంటారు. ఈ విషయాలను తెలియజేసేందుకు హైదరాబాద్‌లో ఏసుదాస్, ఆయన తనయుడు విజయ్ ఏసుదాస్ విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏసుదాస్ మాట్లాడారు.

"అమ్మ నుంచి పొందిన మరో ఆశీర్వాదం ఏమిటంటే.. నేను ఐదేళ్ల వయసులో ఉన్నప్పుడు చదువు గురించి ఎలాంటి బెంగా పెట్టుకోవద్దు. నార్మల్‌గా చదువుకుంటే చాలు. కానీ, కర్నాటిక్ క్లాసికల్ మ్యూజిక్‌ని సరిగ్గా నేర్చుకోమని సూచించారు. మ్యూజిక్, ఆర్ట్స్ లాంటివి ఏమీ వద్దు. స్కూల్‌కి వెళ్లి చదువుకోమని చెప్పే ఆరోజుల్లో నన్ను సంగీతం నేర్చుకోమని ప్రోత్సహించారు. నాకు బ్రదర్స్, సిస్టర్ ఉన్నారు. వాళ్లు కూడా బాగా పాడేవారు. కానీ, వాళ్లను మా నాన్నగారు ప్రోత్సహించలేదు. నన్ను మాత్రమే ఈ విషయంలో ప్రోత్సహించారు. ఈ సందర్భంగా నా తల్లిదండ్రుల్ని, నా మాస్టర్‌ని గుర్తు చేసుకుంటున్నాను. గురువు లేకుండా ఎవరూ గొప్పవారు కాలేరు. మనల్ని తీర్చిదిద్దిన గురువులు అంతా దేవుళ్లతో సమానం. అది నా నమ్మకం. నేను ఇప్పటివరకు ఏం సాధించినా అదంతా నా తల్లిదండ్రులు, గురువుల వల్లే సాధ్యమైంది. అలాగే నా పాటలు వినేవారు, సంగీత ప్రియుల ప్రార్థనల వల్లే నేను ఈ స్థాయికి వచ్చాను. అంతకుమించి మరేమీ లేదు. నేను దాదాపు 10 సంవత్సరాల తర్వాత హైదరాబాద్‌లో సంగీత విభావరి చేస్తున్నాను. మధ్యలో కొన్ని క్లాసికల్ కాన్సర్ట్స్ చేసినప్పటికీ లైవ్ మ్యూజిక్ మాత్రం చాలా కాలం తర్వాత చేస్తున్నాను. నా బ్రదర్ అలేఖ్య హోమ్స్ శ్రీనాథ్ నన్ను లైవ్ మ్యూజిక్ చెయ్యమని చెప్పారు. హైదరాబాద్‌లో మళ్లీ ఈ కచేరీ చెయ్యడం చాలా ఆనందంగా ఉంది. ఈ విభావరీలో ప్రధానంగా తెలుగు పాటలు పాడతాం. అలాగే కొన్ని తమిళ్, హిందీ, మలయాళం పాటలూ ఉంటాయి. నేను త్రివేండ్రంలో విద్వాన్ కోర్సు చేశాను. ఆ సమయంలో నా నాన్నగారు అస్వస్థతకు లోనుకావడం, ఆర్థికంగా సరైన స్థితిలో లేకపోవడం వల్ల ఆ కోర్సు పూర్తి చేయలేకపోయా. అందుకే నేను సంగీతంలో విద్వాన్‌ని కాదు.. విద్యార్థిని మాత్రమే" అని చెప్పుకున్నారు ఏసుదాసు.

రోజూ కర్నాటిక్ మ్యూజిక్ నేర్చుకుంటూనే ఉంటాను. అంతకుముందు నేను చేసిన పొరపాట్లను ఎప్పటికప్పుడు సరిదిద్దుకుంటాను. విద్యార్థులెవరైనా ఇది గుర్తుంచుకోవాలి. ముందు రోజు చేసిన తప్పుల్ని తెలుసుకొని వాటిని సరిదిద్దుకోగలిగితే ముందు ముందు ఎంతో సాధించవచ్చు. ఇది సంగీతానికి మాత్రమే కాదు, ఏ రంగానికైనా వర్తిస్తుంది. మా నాన్నగారు చనిపోయేవరకు ఒక్కసారి కూడా నేను బాగా పాడుతున్నానని చెప్పలేదు. మన పిల్లల్ని మనమే ప్రశంసించ కూడదు. వాళ్లకు వాళ్లే ఎదగాలి. మా అబ్బాయి విజయ్ కూడా పాటలు పాడుతున్నాడు. అతని వయసు ఇప్పుడు 40. నా వయసు 79. కానీ, నేను ఇప్పటికీ విద్యార్థిననే చెప్తున్నాను. కానీ, మా అబ్బాయి ఆలోచన వేరుగా ఉండొచ్చు. ఇప్పుడొస్తున్న గాయకులు చాలా మంది బాగా పాడుతున్నారు. ఇప్పుడు సౌకర్యాలు బాగా పెరిగాయి. ఆరోజుల్లో నేను, సుశీల పాటలు పాడితే ఒకే మైక్‌లో ఒకరి తర్వాత ఒకరం పాడేవాళ్లం. కానీ, ఇప్పుడలా కాదు. డిఫరెంట్ ట్రాక్స్ వచ్చేశాయి. నిన్న నేను ఓ మలయాళం పాట పాడాను. నాతో పాట పాడే అమ్మాయిని నేను చూడలేదు కూడా. నా ట్రాక్ వరకు నేను పాడాను. తర్వాత ఆమె పాడిన ట్రాక్‌ని మిక్స్ చేస్తారు. అయితే ఆరోజుల్లో సింగర్స్ మధ్య సాన్నిహిత్యం ఉండేది" అని అన్నారు.

నా సొంత దారిలోనే వెళుతున్నా

- విజయ్ ఏసుదాసు

విజయ్ ఏసుదాస్ మాట్లాడుతూ "మొదట్లో నేను నాన్నగారి అడుగుజాడల్లోనే వెళ్ళాను. ఆ తర్వాత నేను రియలైజ్ అయ్యాను. ఎందుకంటే అవి ఆయన వేసుకున్న అడుగులు. అందుకే నా సొంతదారిలోనే వెళ్లాలని నిర్ణయానికొచ్చాను. కొన్ని విషయాల్లో ఆయన సలహాలు తీసుకుంటాను. నాన్నగారి టైమ్‌లో ఇళయరాజాగారితో కలిసి చాలా సినిమాలకు పనిచేశారు. ఇద్దరూ స్నేహితుల్లా, సోదరుల్లా ఉండేవారు. అలాగే ఇప్పుడు నేను, యువన్‌శంకర్‌రాజా కలిసి పనిచేస్తున్నాం. నాన్న ఈ వయసులో కూడా ఇంకా నేర్చుకుంటున్నానని చెప్పడం మా జనరేషన్‌కి టెన్షన్ కలిగిస్తుంది. నేను రెండు సినిమాల్లో నటించాను కూడా. నేను నటుడ్ని కాదు. కెమెరా ముందు ఉండడం, యాక్ట్ చేయడం నేను చాలా ఎంజాయ్ చేశాను. ఇప్పుడు బయోపిక్‌లు చాలా వస్తున్నాయి. అలాగే నాన్నగారి బయోపిక్ చేసే ఆలోచన ఉందా? అని అడుగుతున్నారు. అయితే నాకు అలాంటి ప్రణాళికలు ఏమీ లేవు. కానీ, ఎవరైనా చేస్తే నేను ఇన్‌వాల్వ్ అవ్వాలనుకుంటున్నాను" అని తెలిపారు.

రాష్ట్రపతికి 'మణికర్ణిక' ప్రత్యేక షో



ఝాన్సీ రాణి లక్ష్మీబాయి జీవితం ఆధారంగా రూపొందిన 'మణికర్ణిక' సినిమా ప్రత్యేక షోను రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ కోసం శుక్రవారం ప్రదర్శించారు. ఈ చిత్రం టైటిల్ రోల్‌ను కంగనా రనౌత్ పోషించింది. క్రిష్ దర్శకత్వంలో వహించారు. ఈషోను రాష్ట్రపతి భవన్ సాంస్కృతిక కేంద్రంలో ప్రదర్శించారు. కంగనా రనౌత్ మాట్లాడుతూ 'రాణీ లక్ష్మీబాయి అనే మన జాతి హీరో. స్వతంత్ర్య పోరాటంలో ఆమె చేసిన ధైర్య, సాహసాలపై రూపొందిన 'మణికర్ణిక' చూసేందుకు మా టీమ్ మొత్తం ఎంతో ఆత్రుతగా ఎదురు చూస్తోంది' అని అన్నారు. ఈ చిత్రంలో డన్నీ డెంజోగ్పా, అంకిత్ లోకాండే. సురేశ్ ఒబెరాయ్, అతుల్ కులకర్ణి ముఖ్య పాత్రల్లో నటించారు. జీ స్టూడియోస్, కమల్ జైన్, నిషాంత్ పిట్టి సంయుక్తంగా నిర్మించారు.

మేం అడ్డుకోవడం లేదు : కర్ణిసేన

'మణికర్ణిక' సినిమా విడుదలకు వ్యతిరేకంగా తాము ఎటువంటి నిరసనలు తెలపడం లేదని కర్ణిసేన శనివారం స్పష్టం చేసింది. ఈ చారిత్రిక చిత్రం విడుదలను అడ్డుకుంటున్నట్టు వస్తున్న ఆరోపణలపై కర్ణిసేన జాతీయ ప్రతినిధి హిమాన్షు ఖండించారు. కొందరు స్వార్థం కోసం కర్ణిసేన పేరును ఉపయోగించుకుంటున్నారని ఆరోపించారు. "మేము 'మణికర్ణిక'కు వ్యతిరేకం కాదు. ఝాన్సీ రాణి మా జాతి, కులం, మతం కుటుంబానికి చెందిన వారిగా మేము అనుకోవడం లేదు. మా కర్ణిసేన పేరును కొందరు వారి స్వార్థ ప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటున్నారు. మాకు అపఖ్యాతి వచ్చేలా వ్యవహరిస్తున్నారు. మాకు గొప్ప చారిత్రక వ్యక్తిత్వం ఉంది" అని పేర్కొన్నారు. ఈ సినిమా నెల 25న ప్రేక్షకుల ముందుకు రానుంది.

గోల్డెన్ రీల్ నామినేషన్లలో '2.ఓ'

రజనీకాంత్, అక్షయ్ కుమార్, అమీ జాక్సన్ కలసి నటించిన '2.ఓ' చిత్రం గోల్డెన్ రీల్ అవార్డుల ఎంపికకు మూడు విభాగాల్లో నామినేషన్లు పొందింది. అందులో ఒకటి సౌండ్ ఎడిటింగ్ ఇన్ ఫారెన్ లాంగ్వేజ్, రెండు వెరైటీ. దీంతో పాటు విదేశీ భాషా చిత్రం విభాగంలోనూ నామినేషన్లు దక్కాయి. ఇది సౌండ్ డిజైనింగ్‌లో అత్యున్నత గుర్తింపు అని పేర్కొంటూ నామినేషన్ వివరాలను రసూల్ పూకుట్టీ తన ట్విట్టర్ ఖాతా ద్వారా తెలిపారు. '2.ఓ'కు ఆస్కార్ విజేత రసూల్ పూకుట్టీ సౌండ్ డిజైనర్‌గా పని చేశారు. "2.ఓ' కి ఇచ్చిన సౌండ్ డిజైనింగ్ ప్రపంచంలోనే ఓ కొత్త ఫార్మెట్. ఇది ఈ చిత్రం ద్వారా ఇండియన్ సినిమా ప్రపంచానికి పరిచయం చేసింది. ఇది నాకు గొప్ప గుర్తింపుగా భావిస్తున్నా. మా టీమ్ ఈ సినిమా ద్వారా ఈ విజయాన్ని సాధించింది" అని ట్విట్టర్‌లో పేర్కొన్నారు రసూల్. పూకుట్టి 4డీ ఎస్ఆర్ఎల్ అనే సౌండ్‌ను '2.ఓ' ద్వారా ఈ ప్రపంచానికి పరిచయం చేశారు. అదీ ఈ సాంకేతికను మన ఇండియన్ సినిమా ద్వారా ఆవిష్కరించడం విశేషం. రసూల్ పనితనానికి ఇప్పటికే ఆస్కార్ అవార్డు, హోమ్ ఆఫ్ బ్రిటీష్ అకాడమీ ఆఫ్ ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఆర్ట్స్(బీఏఎఫ్‌టీఏ) పురస్కారం, భారత ప్రభుత్వం నుంచి పద్మశ్రీ వంటి అవార్డులు దక్కాయి. ఇప్పుడు గోల్డెన్ రీల్ పురస్కారానికి అతని పేరు నామినేట్ కావడం విశేషం. '2.ఓ' చిత్రం రూ.500 కోట్లుతో రూపొందించారు. దక్షిణాదిలో మంచి విజయాన్ని నమోదు చేసుకుంది. కలెక్షన్లు కూడా భారీ స్థాయిలోనే వచ్చాయని సినీవిమర్శలు పేర్కొన్నారు. ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీతం అందించారు.



రసూల్ పూకుట్టి

2018 నా కెరీర్‌లో బెస్ట్ ఇయర్

- సీనియర్ నరేశ్

"క్యారెక్టర్ ఆర్టిస్టుగా వచ్చినప్పుడు ఎస్.వి.రంగారావుకి దృష్టిలో పెట్టుకున్నాను. ఓ తెలుగు నటుడు ఏ పాత్రనైనా చేయగల సామర్థ్యం ఉంది. కాబట్టి ఒక్క జోనర్‌కే పరిమితం కాకుండా అన్నీ సినిమాలు చేయాలనుకున్నాను. నాకు వచ్చిన పాత్రలన్నీ అలా భిన్నంగానే వచ్చాయి" అని నటుడు సీనియర్ నరేశ్ అన్నారు. హీరో నుంచి క్యారెక్టర్ ఆర్టిస్టుగా మారి సెకండ్ ఇన్నింగ్స్‌లో వైవిధ్యమైన పాత్రలను పోషిస్తున్నారు. ఆదివారం నరేష్ పుట్టినరోజు సందర్భంగా పాత్రికేయులతో ఆయన మాట్లాడారు.

నటుడిగా 47 ఏళ్ల అనుభవం వచ్చింది. క్రమశిక్షణతో పాటు, ఎటువంటి వివాదాలు లేకపోవడమే నటుడిగా సక్సెస్‌కు కారణమని భావిస్తున్నాను. పారితోషికం, ఇతర అంశాల కంటే మంచి సినిమా, మంచి పాత్ర పోషించడం.. వచ్చిన అవకాశానికి పూర్తి న్యాయం చేయడం, చిన్న బడ్జెట్ సినిమాలకు అందుబాటులో ఉండడం ఇవే లక్ష్యాలు. ఇక నటుడికి కెరీర్‌లో విజయాలు అపజయాలు సాధారణం. ఎన్టీఆర్ నుండి నేటి హీరోలు ఎవరికైనా గెలుపు ఓటములు ఎదురవుతుంటాయి. ఐదారేళ్ల క్రితం మంచి హిట్ రాదా? అని అనుకున్న రోజులు కూడా ఉన్నాయి. నాలుగైదేళ్లుగా 'దృశ్యం' సినిమా నుండి వరుసగా మంచివే వస్తున్నాయి. గత ఏడాది తెలుగు సినిమాకొచ్చిన12హిట్లలో 8 చిత్రాల్లో నేను నటించాను. మంచి పాత్రలు చేశాను. 'శతమానం భవతి, రంగస్థలం, మహానటి, దేవదాస్, తొలిప్రేమ' వంటి చిత్రాల్లో మంచి పాత్రల్లో నటించాను. 'సమ్మోహనం' కూడా పేరు తెచ్చింది. అలాగే 'అరవింద సమేత' వంటి సీరియస్ చిత్రంలో కామెడీ పార్ట్ నా పాత్రనే క్యారీ చేసింది. 2018 నటుడిగా నా కెరీర్‌లో బెస్ట్ ఇయర్. త్రివిక్రమ్, సుకుమార్ వంటి దర్శకులతో పాటు వెంకీ అట్లూరి, వెంకీ కుడుముల, నాగ అశ్విన్ వంటి యువ దర్శకులు కూడా నాకు మంచి ప్రాధాన్యమున్న పాత్రలను ఇచ్చారు.



నరేశ్

'మహానటి', 'కథానాయకుడు' రెండు బయోపిక్స్‌లో మంచి పాత్రలు చేశాను. ఈ ఏడాది కూడా మంచి పాత్రలతోనే మొదలయింది. ప్రస్తుతం ఎనిమిది సినిమాల్లో నటిస్తున్నా. ఒకప్పుడు మనం ఇతర భాషల రీమేక్‌ల కోసం వెళ్లేవాళ్లం. కానీ ఇప్పుడు ఇతర భాషల వాళ్లు మన రీమేక్‌ల కోసం వస్తున్నారు. ఇది తెలుగు సినిమాకు పెద్ద వరం. ఎందుకంటే కొత్త ఆలోచనలున్న కొత్త తరం దర్శకులు చాలా మంది ఇండస్ట్రీలోకి వస్తున్నారు.

మా అధ్యక్షుడిగా పోటీ చేస్తా

మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ 25 వసంతాలను పూర్తి చేసుకుంటుంది. సభ్యుడిగా నా వంతు సపోర్ట్ చేస్తున్నాను. దాసరి నారాయణరావుగారి ఆదేశాల మేరకు జయసుధతో కలిసి జాయింట్ సెక్రటరీగా పోటీ చేశాను. 'మా' ఎన్నికలు అనివార్యమైనప్పుడు.. అందరినీ సంప్రదించి అవసరం అయితే నేను కూడా పోటీ చేస్తాను. మా ప్రతిష్టను పెంచడానికి, ధర్మం కాపాడటానికి అందరూ కోరితే నేను పోటీ చేస్తాను. సామరస్యంగా వెళ్లేలా కూడా చూస్తాం. పదవుల కోసం నేను ఎప్పుడూ పాకులాడలేదు. పాకులాడను కూడా. దీన్ని ఆసరాగా తీసుకుని నా వ్యాపారమో, నాస్థాయినో పెంచుకోవడానికి నేను పనిచేయను. నేను, రాజేంద్రప్రసాద్ ఉన్నప్పుడు అందరూ కలిసి ఒక టర్మ్‌లో ఒకరు ఒకేసారి పనిచేయాలనుకున్నాం. ఈ కుర్చీకి ఎవరూ అతుక్కుపోకూడదని అనుకుంటాను. నేను ఒక టర్మ్ మాత్రమే నిలబడతాను. ఒకసారి గెలిస్తే చరిత్రలో మళ్లీ నిలబడను.

'96' రీమేక్‌కు సిద్ధం



తమిళంలో విజయం సాధించిన చిత్రం '96'. ఈ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌ని తెలుగులో రీమేక్ చేసేందుకు నిర్మాత దిల్ రాజు సన్నాహాలు చేస్తున్నారు. తమిళంలో విజయ్ సేతుపతి, త్రిష లీడ్ రోల్ ప్లే చేశారు. తెలుగులో వీరి పాత్రల ఎంపికకే ఎక్కువ సమయం తీసుకుంది. ఫైనల్‌గా సమంత, శర్వానంద్ హీరో హీరోయిన్లు చేయించేందుకు చిత్రబృందం నిర్ణయించింది. త్వరలోనే ఈ చిత్రం సెట్స్‌పైకి వెళ్లనుంది. తమిళంలో దర్శకత్వం వహించిన సి. ప్రేమ్ కుమారే తెలుగులోనూ తెరకెక్కిస్తున్నారు. ఇందులో గోవింద్ వసంత సమకూర్చిన బాణీలకు భారీ ఎత్తున ప్రశంసలు లభించాయి. తమిళంలో గీతాలు కాస్త అటూ ఇటూ మార్చి తెలుగులోనూ ఉండేలా చూస్తున్నారని తెలిసింది.



శర్వానంద్, సమంత

నీ నీడతో నువ్వే యుద్ధం చేసే!

మనిషి శత్రువుతో యుద్ధం చేస్తే గెలుస్తాడు. కానీ తన నీడతోనే యుద్ధం చేయాల్సి వస్తే ఎలా ఉంటుందో ఆలోచించండి.. అలాంటి విపత్కర పరిస్థితులను ఎదుర్కొన్న ఓ యువకుడు ఎలా బయటపడ్డాడు? అనేది తెలుసుకోవాలంటే 'నిను వీడని నీడను నేనే' సినిమా చూడాల్సిందే అంటున్నారు కథానాయకుడు సందీప్ కిషన్. ఈ హీరో నటిస్తోన్న ఎమోషనల్ హార్రర్ ఎంటర్‌టైనర్ ఇది. ఇప్పటి వరకు ఎవరూ టచ్ చేయని కథాంశంతో రాబోతుంది. వెంకటాద్రి టాకీస్, విస్తా డ్రీమ్ మర్చంట్స్ పతాకాలపై కార్తీక్ రాజు దర్శకత్వంలో తెరకెక్కుతోంది. దయా పన్నెం, వి.జి.సుబ్రహ్మణ్యన్ నిర్మాతలు. తెలుగు, తమిళ భాషల్లో రూపొందుతోంది. ఎస్.ఎస్.తమన్ బాణీలు సమకూరుస్తున్నారు. ఎ.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై అనీల్ సుంకర ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. చిత్రీకరణ తుది దశకు చేరుకుంది.

దర్శకుడు కార్తీక్ రాజు మాట్లాడుతూ 'ఒక కొత్త పాయింట్ తీసుకుని ఎమోషనల్ హార్రర్ ఎంటర్‌టైనర్ కథాంశంతో తెరకెక్కుతోంది. ఉన్నత సాంకేతిక విలువలతో రూపొందిస్తున్నాం.ప్రస్తుతం హీరో హీరోయిన్లపై కొన్ని కీలక సన్నివేశాలు, ఒక ముఖ్యమైన పోరాట సన్నివేశం చిత్రీకరించనున్నారు. దీంతో సినిమా పూర్తవుతుంది' అన్నారు.



సందీప్ కిషన్

చిన్న చిత్రాల ద్వారానే కొత్తవారికి అవకాశాలు



బి.జి.వెంచర్స్ పతాకంపై నూతన నటీనటులతో రాజేష్ తడకల స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'గేమర్'. శనిత్ రాజ్, కల్యాణి పటేల్, అనిరుధ్, నేహా ప్రధాన పాత్రలు పోషించారు. ఈ సినిమా ట్రైలర్ శనివారం హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వివేక్ వెంకటస్వామి ట్రైలర్‌ను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'ట్రైలర్ చూశాను. అద్భుతంగా ఉంది. తడకల రాజేష్ నూతన నటీనటులను ప్రోత్సహిస్తూ ఈ సినిమా తీశారు. మంచి డాన్స్, ఎంటర్‌టైన్‌మెంట్, సస్పెన్స్, హార్రర్ ఎలిమెంట్స్ అన్నింటితో ప్రేక్షకులకు నచ్చేలా ఈ సినిమా చేశాడు రాజేష్. ఇలాంటి చిన్న సినిమాల దర్శకనిర్మాతలను ప్రోత్సహించే బాధ్యత ప్రభుత్వం పైనా, సమాజం పైనా ఉంది. ఎందుకంటే వీళ్లందరికీ థియేటర్లు దొరకడం కష్టంగా ఉంది. కొత్త టాలెంట్ రావాలంటే చిన్న దర్శకనిర్మాతలను ప్రోత్సహించాలి. తద్వారా గ్రామాల్లో ఉన్న ప్రతిభావంతులకు అవకాశాలు దక్కుతాయి. ఈ సినిమా మంచి విజయం సాధిస్తుంది అనిపిస్తోంది' అని తెలిపారు.

పవర్ ఫుల్ పాత్రలో అన్నపూర్ణమ్మ



ఎవరెస్టు ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై ఎంఎన్ఆర్ చౌదరి నిర్మిస్తున్న చిత్రంలో 'అన్నపూర్ణమ్మ గారి మనవడు' అన్నపూర్ణమ్మ ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. మాస్టర్ రవితేజ టైటిల్ రోల్ ప్లే చేస్తున్నారు. నర్రా శివనాగేశ్వర్ రావు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాను అమరావతి పరిసర ప్రాంతంలో ఉన్న అందమైన ఓ గ్రామంలో చిత్రీకరిస్తున్నారు. నిర్మాత మాట్లాడుతూ ' ఓ పల్లెటూరిలో ఎవరికి ఏం జరిగినా రచ్చబండ పంచాయతీ దర్బార్‌లో పెద్ద దిక్కైన అక్కినేని అన్నపూర్ణమ్మ అనే పవర్ ఫుల్ పాత్రలో అన్నపూర్ణ కనిపిస్తున్నారు. ఆ పల్లెటూరిలోనే ఆమెకు దీటుగా ఎదురెళ్లే వాసి రెడ్డి వెంకటాద్రి నాయుడుగా సీనియర్ నటుడు బెనర్జీ నటిస్తున్నారు. ఈ చిత్రం కోసం నిర్మించిన పంచాయతీ దర్బార్ సెట్ అందరినీ ఆకర్షింపజేస్తుంది. రెండు వందలమంది జూనియర్ ఆర్టిస్టులతో ఆసక్తికరంగా తెరకెక్కించారు దర్శకుడు. ప్రస్తుతం మొదటి షెడ్యూల్ పూర్తి చేసుకున్న ఈ చిత్రంలో అర్చన హీరోయిన్‌గా నటిస్తుండగా జీవ, రఘు బాబు, కాటమంచి రఘు, తాగుబోతు రమేష్, సుమన్ శెట్టి, శ్రీ హర్ష, అదుర్స్ సాయి, రమాప్రభ, శ్రీలక్ష్మి, ప్రభ, జయ వాణి తదితరులు నటిస్తున్నారని నిర్మాత ఎం ఎన్ ఆర్ చౌదరి చెప్పుకొచ్చారు.



ఊరి కోసం..

వెనుకబడిన గ్రామంలో పుట్టిన యువకుడు.. తను ఉన్నతంగా ఎదిగాక.. తను పుట్టి పెరిగిన ఊరునీ సొంత కుటుంబంలా అభివృద్ధి చేయడం మనం ఎన్నో సినిమాల్లో చూశాం. అచ్చం అలాంటి వ్యక్తే గుంటూరు జిల్లా యాజలికి చెందిన ఇక్కుర్తి లక్ష్మీనరసింహ. సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా లక్ష రూపాయలు జీతం తీసుకుంటున్నా.. సొంతూరుని చూసినప్పుడల్లా ఏదో కోల్పోతున్నట్లు బాధపడేవాడు. ఆ గ్రామంలో జీవనోపాధిలేక కొందరు, పిల్లల చదువుల కోసం మరికొందరు ఊరు వదిలి వలసలు వెళుతుంటే వారిని ఎలా ఆపాలో తెలియక తల్లడిల్లేవాడు. ఆ క్రమంలోనే.. చేస్తున్న ఉద్యోగాన్ని వదిలేసి సొంతూరుకు వచ్చేశాడు. పదినెలల క్రితం 'యాజలీ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ' స్థాపించి, అందులో సుమారు రెండొందల మంది రైతులను భాగస్వాముల్ని చేశాడు. భారతదేశంలోనే ఉత్తమ గ్రామంగా తన ఊరిని తీర్చిదిద్దడం కోసం నిరంతరం శ్రమిస్తున్న ఆ యువకుడి గురించి నేటి 'జోష్'లో తెలుసుకుందాం!

లక్ష్మీ నరసింహది 48 మంది కుటుంబ సభ్యులున్న ఉమ్మడి కుటుంబం. పిచ్చయ్య, సావిత్రమ్మకు మూడో సంతానం. ఆ కుటుంబంలో 110 సంవత్సరాలున్న ముత్తవ్వ ఉండేది. ఆమె కుటుంబంతోపాటు ఊరినీ ప్రేమించాలని పదేపదే చెబుతుండేది. చిన్న వయస్సులోనే ఆమె ప్రభావం అతని మీద ఎంతగానో ఉండేది. అందుకేనేమో ఊరంటే వల్లమాలిన ప్రేమ. పెద్దయిన తర్వాత తన ఊరికి ఏదో ఒకటి చేయాలని అనుకుంటుండేవాడు నరసింహ. ఇంజనీరింగ్ చేసిన అతను సాఫ్ట్‌వేర్ కొలువును సాధించాడు. నెలకు దాదాపు లక్ష రూపాయలు జీతం తీసుకునే స్థాయికి ఎదిగాడు. కానీ తాను పెరిగేకొద్దీ ఊరి పరిస్థితులూ మారిపోయాయి. మునుపటిలా గ్రామస్తులు లేరు. తన కుటుంబమూ వేరు కాపురాలు పెట్టేశారు. ఇదంతా నరసింహను ఎంతగానో బాధించింది.

సొంతగూటికి చేరింది ఇలా ...

అమెరికాలో స్థిరపడి సంపాదించిన డబ్బుతో సొంతూరుని మార్చాలని అనుకునేవాడు. కానీ కొన్నేళ్ల క్రితం జరిగిన సంఘటన అతనిని సొంతూరికి చేరేలా చేసింది. మొదట్లో నరసింహ ఉద్యోగరీత్యా చెన్నైలో ఉంటూ శని, ఆదివారాలు సొంతూరికి వచ్చేవాడు. 'ఒకసారి ఏమైందంటే ఇద్దరు యువకులు తాగి వేగంగా బండి నడుపుతూ ఎద్దులబండిని గుద్దారు. అక్కడ అందరూ చూస్తుండగానే ఆ యువకులు మరణించారు. ఇదంతా నా కళ్ల ముందే జరిగింది. కొన్ని నెలల్లోనే ఐదుగురు యువకులు చెడు అలవాట్ల కారణంగా జీవితాన్ని కోల్పోవడం దగ్గరుండి చూశా. ఆ సంఘటనలు నామీద చాలా ప్రభావాన్ని చూపాయి. ఇక అమెరికా వెళ్లాలనే ఆలోచన వదులుకున్నా. ఇక్కడే ఉండి నా ఊరికోసం ఏదైనా చేయాలని గట్టిగా నిర్ణయించుకున్నా. చెన్నై నుంచి వారాంతాల్లో ఇక్కడికి రావడం కష్టమౌతుందని హైదరాబాద్‌లో ఉద్యోగంలో చేరా. మా ఊరు గ్రామ పంచాయతీలో ఓటర్ల జాబితా సేకరించా. మా ఊరి జనాభా ఐదువేల నుంచి మూడువేలకు చేరిందని తెలిసి కుంగిపోయా. ఊరి నుంచి వలస వెళ్లిన వారి అడ్రస్‌లు సేకరించి, ఒకరోజు హైదరాబాద్‌లో గెట్ టు గెదర్ ప్రోగ్రామ్‌ను ఏర్పాటు చేశా. చాలా కుటుంబాలు అక్కడికి వచ్చాయి. వారిలో 110 మందికి నా ఆలోచనలు నచ్చితే, 65 మంది ఒక్కొక్కరూ 10 వేల రూపాయల చొప్పున గ్రామాభివృద్ధికి విరాళాలు ఇచ్చారు. అలా 'యాజలీ నా జన్మభూమి' సంస్థను 2011లో స్థాపించాం' అంటున్నాడు నరసింహ.

ఊరి కోసం..

మొదటి కార్యక్రమంగా ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వారి సహాయంతో 2500 మొక్కలను ఊర్లో నాటారు. ఇదంతా నరసింహ సర్పంచి పదవిని ఆశించి చేస్తున్నాడని తలచిన కొందరు ఒక్కరోజులోనే దాదాపు మూడు వందల మొక్కలను పీకేశారు. ఆ పని చేసిన వారిని గుర్తించి, వారిపట్ల కోపాన్ని ప్రదర్శించకుండా ప్రేమతో వారినీ ఒప్పించాడు. ఊర్లో ఒంటరిగా ఉంటున్న ఒక పెద్దాయన చనిపోయాడు. ఆ విషయం బయటవారికి తెలియడానికి రెండు, మూడు రోజులు పట్టింది. నా అనేవాళ్లు దగ్గర్లో లేనందువల్లే కదా!







ఇలా జరిగింది అని ఊరంతా బాధపడ్డారు. ఇంకొకరికి ఇలా జరగకుండా మనమేదైనా చేయాలనుకున్నారు. వెంటనే ఒంటరిగా జీవనం సాగిస్తున్న 23 మందిని గుర్తించారు. ట్రస్టు సభ్యులందరూ కలిసి రూ.18 లక్షలను పోగు చేశారు. 'జిఆర్‌జిఎ అండ్ పిబి' అని వృద్ధాశ్రమాన్ని 2013లోనే ఏర్పాటు చేశారు. విరాళాలుగా వచ్చిన డబ్బు నుంచి ఒక సంవత్సరం మాత్రమే ఖర్చు పెట్టారు. రెండో సంవత్సరం నుంచి పుట్టినరోజు, పెళ్లిరోజు జరుపుకునేవారు ఇచ్చే విరాళాలతోనే ఆశ్రమం నడుస్తోంది. అక్కడ మూడుపూటలా భోజన వసతితో పాటు వైద్య సౌకర్యాలనూ నిర్వాహకులే చూస్తారు. అయితే వృద్ధులు మాత్రం తమ ఇళ్లలోనే ఉంటూ భోజన సమయానికి ఆశ్రమానికి చేరతారు. రాలేని వారికి ఇంటికి భోజనం పంపుతారు.

యాజలీలో చదువుకున్న పాఠశాల విద్యార్థులంతా కలిసి పూర్వ విద్యార్థుల సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. నాగరాజు అనే పూర్వ విద్యార్థి స్కూలు అభివృద్ధి కోసం ఆర్థికంగా సహాయం చేస్తుంటే నరసింహానే అన్నీ తానై నడిపించేవాడు. పది ఎకరాల్లో ఉండే ఆ పాఠశాలలో డిజిటల్ లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్, ఐదువందల మంది కూర్చుని, భోజనాలు చేయగల డైనింగ్ హాల్‌లాంటి అన్నిరకాల వసతులు ఉన్నాయి. ప్రతి సంవత్సరం ఈ పాఠశాలలోని విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించగలుగుతున్నారు. ఆరేళ్ల క్రితం వందలోపు పిల్లలుండే ఈ పాఠశాలలో ప్రస్తుతం ఐదొందల పైనే విద్యార్థులున్నారు. దీనంతటికి నరసింహ, అతడి మిత్రులూ చేసే కృషే కారణం.

రైతులతోనే కంపెనీ

ఊర్లో నుంచి వేల మంది వలస వెళ్లడానికి వ్యవసాయంలో వచ్చే నష్టాలే కారణమని నరసింహ గుర్తించాడు. వ్యవసాయాన్ని లాభసాటిగా ఎలా చేయాలి? అనే విషయాలను కంప్యూటర్లో చూపుతూ రైతులకు శిక్షణ ఇచ్చేవాడు. ఇదంతా చూస్తున్న నరసింహ తండ్రే 'నీవు చెప్పినంత సులువు కాదు వ్యవసాయం. మాకు గతిలేకే చేస్తున్నాం' అని అన్నాడట. వ్యవసాయానికి సంబంధించి పలు విషయాలను ప్రయోగాత్మకంగా తెలుసుకోవాలనే ఉద్దేశంతో సౌత్ ఇండియాలో అనేక రాష్ట్రాల్లోని రైతులను కలిశాడు. ఉద్యోగం మానేసి, కొందరి స్నేహితులతో కలిసి హైదరాబాద్ సమీపంలో ఇరవై ఎకరాల్లో వ్యవసాయం చేశాడు. ఎన్ఐఆర్‌డిలో అనేకసార్లు శిక్షణ తీసుకున్నాడు. తర్వాత కొంత కాలానికి పూర్తిగా సొంతూరుకు వచ్చాడు. 2018 ఏప్రిల్ 26న రెండొందల మంది రైతులతో కలిసి 'యాజలీ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ'ని స్థాపించాడు. ప్రస్తుతం తన సొంత పొలంలో వ్యవసాయం చేస్తున్నాడు. సిబిఐ మాజీ జాయింట్ డైరెక్టర్ జెడీ లక్ష్మీనారాయణ ఈ కంపెనీని ప్రారంభించారు. ఆయనే ఈ కంపెనీకి ప్రధాన గౌరవ సలహాదారు కూడా. ఈ కంపెనీ ద్వారా రైతులకు అవసరమైన విత్తనాలు, పురుగుల మందులు, ఎరువులను బ్రాండెడ్ కంపెనీ ద్వారా తక్కువ రేటుకే ఇస్తారు. అందుబాటులోనున్న టెక్నాలజీని ఉపయోగించుకుని, కూలీల అవసరం లేకుండా మిషన్లను ఎలా ఉపయోగించాలో చెప్పడమే కాకుండా, వాటిని అద్దెకిస్తారు. ప్రస్తుతం ఈ పనులు జరుగుతున్నాయి. పంట చేతికొచ్చిన తర్వాత ఆ రోజు మార్కెట్ ధరకే కొనాలనేది ఒక ఆలోచన. అలా కొన్న సరుకును నేరుగా వినియోగదారునికి అందించేలా చర్యలు తీసుకుంటామంటున్నారు. అలా వచ్చిన ఆదాయాన్ని రైతులకే పంచాలనేది నరసింహ ఉద్దేశం. ఈ కంపెనీని వీరి ఆలోచనలకు తగ్గట్టు తీసుకురావాలంటే సుమారు 11 కోట్లు అవుతుందనేది వారి అంచనా. ఇప్పటికే రైతులు 50 లక్షల వరకు పెట్టుబడి పెట్టారు. మరో 25 లక్షలు శాంతా బయోటిక్ ఛైర్మన్ వరప్రసాద్‌రెడ్డి విరాళంగా ఇచ్చారు. 2020 నాటికి తమ లక్ష్యాన్ని చేరుకుంటామని అక్కడి రైతులు ఎంతో నమ్మకంగా చెబుతున్నారు. తను ఇదంతా చేయడానికి జయప్రకాశ్ నారాయణ్, తనికెళ్ల భరణి ప్రోత్సాహమూ ఒక కారణమంటాడు నరసింహ.

నరసింహ ఊరి కోసం చేస్తున్న కృషిని గుర్తించిన క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఢిల్లీ వారు 'యంగ్ అచీవర్ అవార్డు'ను 2017లో ఇచ్చారు. జులై 16, 2018లో ప్రధానమంత్రి నరేంద్రమోడీ చేతుల మీదుగా 'బెస్ట్ రూరల్ అచీవర్ అవార్డు ఇన్ మోడరన్ ఫార్మర్ అవార్డు'నూ అందుకున్నారు. నరసింహకు భార్య రాజేశ్వరి, ఒక బాబు ఉన్నారు. ఊరి కోసం పాటుపడుతున్న నరసింహ మరిన్ని విజయాలు సాధించాలని కోరుకుందాం!

మా ఊరిని దేశంలోనే ఉత్తమమైన గ్రామంగా తీర్చిదిద్దడమే నా లక్ష్యం. మా కంపెనీని సక్సెస్ చేసి రాష్ట్రంలోని అన్ని మండలాల్లో ఇలాంటి కంపెనీని స్థాపించాలనేది నా కోరిక.
- ఇక్కుర్తి లక్ష్మీ నరసింహ
ఫోన్ నెం : 9985426232

- స్వర్ణలత నూకరాజు

దళితవాడల్లో.. స్నేహగిరి

స్వాతంత్ర్యం వచ్చి ఏడుపదులు దాటినా ఇంకా మనదేశంలో అంటరానితనం రాజ్యమేలుతోంది. ముఖ్యంగా ఉత్తరాది రాష్ట్రాల్లోనైతే ఈ దురాచారంపెట్రేగిపోతోంది. దీనిని అంతమొందించడం అంటే అంత సులువేమీ కాదు. ఎవరో ఒకరు ధైర్యంగా ముందడుగు వేయాలి. ఆ అడుగు నాదే ఎందుకు కాకూడదు అనుకుంది రాజస్థాన్‌లోని ధోల్పూర్ జిల్లా కలెక్టర్ నేహాగిరి. మరి ఆమె అంటరానితనాన్ని తన వంతుగా రూపుమాపేందుకు ఏమి చేసిందో తెలుసుకుందాం.

ఈ సంవత్సరం జనవరి 4న ఆమె పరిధిలోని పంచాయతీలో ఉపాధి హామీ పనుల తనిఖీ కోసం ఒక గ్రామాన్ని సందర్శించారు. ఆ సమయంలోనే ఒక దృశ్యం ఆమె కంట పడింది. అదేమిటంటే ఓ పసిబిడ్డ తల్లి బరువైన వస్తువులు మోస్తోంది. కండలు తిరిగిన పురుషుడు మాత్రం అందరికీ నీళ్లను అందిస్తున్నాడు. ఈ దృశ్యం ఆమెను ఆశ్చర్యానికి గురయ్యేలా చేసింది. అక్కడున్న వారిని ఇదేంటి? అని ప్రశ్నించిందామె. 'ఆమె అంటరాని జాతిలో జన్మించిన వాల్మీకి మహిళ. మరి ఆమె చేతితో నీటిని ఇస్తే మేమెలా స్వీకరిస్తాం?' అంటూ అక్కడి ప్రజలు ఇచ్చిన సమాధానం విని మరింత నిర్ఘాంతపోయింది. రాజస్థాన్‌లో వాల్మీకి జాతి అంటే దళితులకన్నా తక్కువగా పరిగణిస్తారు. ఇలాంటి అభిప్రాయం ఎన్నో తరాలుగా అక్కడి ప్రజల్లో నాటుకుపోయిందని తెలుసుకుందామె. ఈ దురాచారానికి చరమగీతం పాడటానికి తానే అడుగు ముందుకేయాలని నిర్ణయించుకుంది. ముందుగా అక్కడున్న వారందరికీ కులమతాల వ్యత్యాసం తప్పని.. అందరూ సమానమేనని చెప్పింది. అంతటితో ఆగకుండా ఆ పరిసరాల్లోనే ఉన్న ఒక దళిత మహిళను దగ్గరకు పిలిచింది. అందరికీ మంచినీళ్లను ఇవ్వమని చెప్పింది. అందరూ తప్పకుండా నీటిని తాగాలని కచ్చితంగా చెప్పింది. అంతే అక్కడున్న వారంతా కలెక్టర్ మాటకు ఎదురు చెప్పకుండా నీళ్లు తీసుకుని తాగేశారు. ఇది మనందరికి ఒక సాధారణ విషయమే. కానీ ఇది ఆ ప్రాంతంలో అసాధారణ విషయం. ఎందుకంటే ధోల్పూర్ జిల్లా నేరస్థులకు అడ్డాలాంటిది. అక్కడ దోపిడీలు, హత్యలు అనేవి చాలా సహజం. అలాంటి ప్రాంతంలో ఇది సాహసోపేతమైన నిర్ణయమే.






ఆ ప్రాంతంలోని దళిత కార్యకర్త భన్వర్ మోగ్యాన్ని మాటల ప్రకారం మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి, అంగన్వాడీ ప్రోగ్రాంలలోగానీ, ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి.ఎ కార్యక్రమాలలోగానీ అగ్రకులాల వ్యక్తులే నీటిని పంపిణీ చేస్తారు. దళిత, వాల్మీకీలను ఆ దరిదాపుల్లోకి కూడా రానివ్వరు. ప్రభుత్వ పథకాలలో ఈ కులాలను భాగస్వాముల్ని చేస్తే ఇలాంటి వివక్షను కొన్నేళ్లలోనే రూపుమాపొచ్చని చెబుతున్నాడతను. నేహాగిరి భర్త ఇంద్రజిత్ సింగ్ అల్వార్ జిల్లాకు కలెక్టర్. ఏదేమైనా ధైర్యంగా ఒక అడుగు ముందుకేసిన నేహాగిరిని అభినందించక తప్పదు. ★



చిన్నారి

చుక్కలు కలపండి!



పిల్లలూ! పక్కనున్న చిత్రంలోని చుక్కల్ని కలిపి.. బొమ్మను పూర్తి చేయండి!!

పొడుపు కథ

ఆకాశాన ఎగురుతుంది
పక్షికాదు, మనుషుల్ని
ఎగరేసుకు
పోతుంది గాలి
కాదు.. ఏమిటది?




జవాబు : విమానం

జోక్:

అమ్మ: రాము, సోము మీ ఇద్దరిలో ఎవరు ఎక్కువగా పాలు తాగుతారో వారికే ఎక్కువ తెలివితేటలు ఉంటాయి.
సోము: అమ్మా అయితే దూడ మన అందరికన్నా ఎక్కువ తెలివిగలదా ?


నేను గీసిన బొమ్మ





ఎలిసెల దీపిక
జడ్.పి.హెచ్ స్కూల్,
తాడేపల్లి మండలం,
గుంటూరు జిల్లా.

దారి కనుక్కోండి!



పిల్లలూ!
ఈ పిల్లిపిల్లకు తను
ఆడుకునే ఊలు
బంతిని ఎలా
చేరాలో తెలియడం
లేదు. బంతి
దగ్గరకు వెళ్ళే
దారిని కాస్త
చూపించండి!

సాధించి చూపిస్తాం !

పిల్లలం! పసి పిల్లలం
బంగారు పిల్లలం
దేనినైనా చేసి చూపిస్తాం
మంచి ఉద్యోగం సాధిస్తాం!
ABCD లు దిద్దేస్తాం
ఎన్నో బొమ్మలు వేసేస్తాం
EFGHI లు దిద్దేస్తాం
ఈలలు వేస్తూ తిరిగేస్తాం
JKLMN దిద్దేస్తాం
చక్కగా బడికి వెళ్తాం
OPQR దిద్దేస్తాం
ఎన్నో ప్రైజ్‌లు కొట్టేస్తాం
STUV లు దిద్దేస్తాం
నూటికినూరు మార్కులు తెస్తాం
WXYZ దిద్దేస్తాం
మేము గొప్పని తెలిపేస్తాం





సి. సతీష్
9వ తరగతి,
జడ్.పి.హెచ్ స్కూల్,
చిప్పగివరి మండలం,
కర్నూలు జిల్లా.

పిల్లల్లారా.. రారండి!!

కథలు, కవితలు, మీరు గీసిన బొమ్మలు, చూసిన ప్రదేశాలు, కనిపెట్టిన సైన్సు సంగతుల గురించి రాసి మీపేరు, ఫొటోతో పంపాల్సిన మా చిరునామా :

చిన్నారి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట,
విజయవాడ-2.
ఇ మెయిల్ - Chinnaarips@gmail.com

నాడూ నేడూ మహేంద్రుడే

ధోనీ చరిత్ర

16 ఏళ్ల అంతర్జాతీయ కెరీర్‌లో సంచనాలు సృష్టిస్తూ ఏ ఆటగాడికీ, కెప్టెన్‌కీ దక్కనంత పేరు ప్రతిష్టలు సంపాదించాడు. అంతర్జాతీయంగా మూడు ఫార్మెట్‌లలో కలిపి 500 మ్యాచ్‌లు ఆడిన భారత మూడో బ్యాట్స్‌మన్‌గానూ నిలిచాడు. క్రికెట్ చరిత్రలో ఏడు పదుల అర్ధశతకాలు చేసి జెర్సీ నెంబర్ ఏడు అనగానే వెంటనే గుర్తుకొచ్చే ఆటగాడు మన ధోనీయే. అంతేగాక టీ20 ప్రపంచకప్, ఐసీసీ వన్డే ప్రపంచకప్‌లను టీమిండియాకు అందించిన ఘనతా మన ధోనీకే చెల్లుతుంది. ధోనీ బ్యాటింగ్ స్టైలే వేరు. బ్యాట్‌తో మాయ చేస్తూ, వ్యూహాలతో ప్రత్యర్థులను కట్టడి చేస్తూ, సీనియర్ క్రికెటర్లను, అభిమానులను ఆశ్చర్యపరుస్తూ విదేశీ ఆటగాళ్లకు సైతం కెప్టెన్ అంటే ఎలా ఉండాలో ఉదాహరణగా నిలిచే ఏకైక క్రికెటర్ మన ధోనీయే. టికెట్ కలెక్టర్ నుంచి ట్రోఫీ కలెక్టర్‌గా ఎదిగిన జార్ఖండ్ డైనమిక్ ధోనీ తన బ్యాట్‌కు పనిచెప్పి కొద్దిరోజుల్లో ప్రారంభం కానున్న ఐసీసీ వన్డే ప్రపంచకప్‌నూ టీమిండియా మరోసారి ముద్దాడడంలో కీలకపాత్ర పోషించాలని ఆశిద్దాం...





సైనా ఓటమి

కౌలాలంపూర్ : మలేషియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ క్రీడాకారిణి సైనా నెహ్వాల్ కథ సెమీస్‌లో ముగిసింది. ప్రపంచ మాజీ ఛాంపియన్ కరోలినా మారిన్(స్పెయిన్)తో శనివారం జరిగిన మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో 16-21, 13-21లో సైనా పరాజయం పాలైంది. ఈ మ్యాచ్‌ను మారిన్ కేవలం 40 నిమిషాల్లోనే ముగించడం విశేషం. తొలిగేమ్‌లో మొదట్లో 5-2తో ముందంజలో ఉన్నా తరువాత 14-14తో మారిన్‌కు గట్టిపోటీనిచ్చి ఆ తర్వాత అనవసర తప్పిదాలతో సైనా 16-21తో ప్రత్యర్థికి కోల్పోయింది. రెండో గేమ్‌లో మారిన్ తన ఆధిపత్యాన్ని కొనసాగించినా చివరకు సైనాకు ఓటమి తప్పలేదు. ఈ మ్యాచ్‌కు ముందు వీరిద్దరూ పదిసార్లు తలపడగా చెరో ఐదుసార్లు విజయం సాధించారు. ఈ విజయంతో మారిన్ 5-6తో ముందంజలో నిలిచినట్లైంది.

వరుస అర్ధశతకాలతో విమర్శలకు సమాధానం

భారత్‌కు మరో అరుదైన విజయాన్ని అందించిన ధోని

(ప్రజాశక్తి-స్పోర్ట్స్ డెస్క్)

'వయస్సు మీదపడిపోతుంది... పనై పోయింది... రిటైర్మెంట్ చేసి కుర్రాళ్లకు అవకాశం ఇవ్వడా.. సీనియర్ల హవా ఇంకా ఎప్పటి వరకూ... అన్న విమర్శలు క్రీడాభిమానుల నుంచి వినిపిస్తున్నాయి. సీనియర్ క్రికెటర్లు సచిన్, గవాస్కర్, కుంబ్లేవంటి వారు అతన్ని సపోర్ట్ చేస్తూ స్టేట్‌మెంట్ల మీద స్టేట్‌మెంట్లు ఇస్తున్నారు. వాటన్నింటికీ బదులిచ్చేలా జార్ఖండ్ డైనమిక్, భారత్‌కు రెండు ఐసీసీ ప్రపంచకప్‌లు, ఒక ఆసియా కప్పును అందించిన మిస్టర్ కూల్ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ ఆస్ట్రేలియాతో ఇటీవల జరిగిన వన్డే సిరీస్‌లో తన బ్యాట్‌తో బదులిచ్చాడు.

ఒకానొక సందర్భంలో ధోనీ స్థానం పంత్‌కు ఖాయం అయిపోయిందనే క్రీడా విశ్లేషకులకు సైతం తన బ్యాట్‌తో మహిమలు చూపించాడు. ఆస్ట్రేలియాతో ముగిసిన మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా తప్పనిసరిగా గెలవాల్సిన మూడో వన్డేలో ధోని మైదానంలోకి దిగినప్పటినుంచీ పిచ్‌ను గమనిస్తూ ఆసీస్ బౌలర్లను పరీక్షిస్తూ అజేయంగా 87 పరుగులతో నిలిచాడు. దీంతో సిరీస్‌లో మూడు అర్ధశతకాలు నమోదుచేసి వన్డే సిరీస్‌ను టీమిండియాకు అందించడంలో కీలకపాత్ర పోషిండమేగాక 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్'ను అందుకున్నాడు. మూడో వన్డేలో చేసిన అర్ధసెంచరీతో వన్డేల్లో ధోనీ 70వ అర్ధసెంచరీలు పూర్తి చేసుకోవడం విశేషం.

ఇంతకుముందు నెటిజన్లు విమర్శలకు ఆజ్యంపోస్తూ సిరీస్‌లో మొదటి వన్డేలో ఎక్కువ బంతులు వృథా చేసి భారత్ ఓటమికి మూలబిందువుగా నిలిచాడన్న విమర్శలకు ఫుల్‌స్టాప్ పెట్టాడు. మునుపటి మ్యాచ్‌లాగే బంతులు తినేస్తాడు అనే విమర్శలతో రెండో వన్డేలో క్రీజులోకి దిగిన వెంటనే ధోని ఆది నుంచి కెప్టెన్ కోహ్లీకి సహకరిస్తూ ఆడాడు. 44వ ఓవర్లలో భారత సారథి విరాట్ 104 పరుగుల వద్ద ఔటవ్వడంతో ఆ దశలో టీమిండియా 36 బంతుల్లో 55 పరుగుల లక్ష్యాన్ని ఛేదించాల్సి ఉండగా ధోనీ పూర్వ వైభవాన్ని రంగరించి టీమిండియాను గెలిపించిన తీరు అద్భుతం. తరువాత క్రీజులోకి వచ్చిన కార్తీక్ సాయంతో ధోనీ నాలుగేళ్ల కిందటి మహేంద్రుడుని గుర్తు చేస్తూ చివరి ఓవర్‌లో ఏడు పరుగులు చేయాల్సి ఉండగా స్టోనిస్ వేసిన 49వ ఓవర్ మొదటి బంతిని లాంగాన్ మీదుగా కొట్టిన విన్నింగ్ సిక్స్‌తో వన్డే సిరీస్ ఆశలను సజీవం చేశాడు.

"నా అంతిమ క్షణాల్లో నాకు ఏదైనా చూడాలని అనిపిస్తే, వరల్డ్ కప్ ఫైనల్లో ధోనీ కొట్టిన ఆ విన్నింగ్ సిక్స్ చూడాలనే కోరుకుంటా".
- సునీల్ గవాస్కర్

రికార్డులు

- 2007లో టీ20 పాకిస్తాన్‌తో ఆడిన ఫైనల్లో జోగిందర్ శర్మకు చివరి ఓవర్ బౌలింగ్ ఇచ్చి పాకిస్తాన్‌పై గెలిచిన విధానం ఒక చిరస్మరణీయం.
- 2011 వరల్డ్ కప్ విజయంలో మొత్తం స్క్రిప్ట్ ఎం.ఎస్.ధోనీ రాసినట్టే అనిపిస్తుంది. బ్యాటింగ్ ఆర్డర్లో తనను తాను ప్రమోట్ చేసుకుని యువరాజ్ సింగ్ కంటే ముందే మైదానంలో అడుగుపెట్టిన ధోనీ, జట్టును గెలిపించే వరకూ క్రీజ్‌లోనే నిలిచాడు. భారత జట్టుకు 28 ఏళ్ల తర్వాత వరల్డ్‌కప్ విజయాన్ని అందించాడు. ఫైనల్లో ధోనీ కొట్టిన సిక్సర్‌ను బహుశా మరే బ్యాట్స్‌మన్ సాధించలేడేమో.
- మినీ వరల్డ్‌కప్‌గా చెప్పుకునే ఛాంపియన్స్‌ట్రోఫీని టీమిండియాకు 2013లో ధోనీ అందించాడు. ఐసిసి మూడు ట్రోఫీలు గెలుచుకున్న మొదటి క్రికెట్ కెప్టెన్‌గా రికార్డు నెలకొల్పాడు.
- ధోనీ తన కెప్టెన్సీలో జట్టును టెస్ట్, వన్డే క్రికెట్‌లో నంబర్ వన్ స్థానానికి చేర్చాడు.
- ఆరు లేదా ఏడు స్థానాల్లో బ్యాటింగ్ చేసినా వన్డేల్లో ధోనీ సగటు 51.0 టీ20 ఫార్మాట్‌లో 36.0 సగటు, టెస్టుల్లో యావరేజ్ 38.0 పరుగులు సాధించడం బహుశా ధోనికే చెల్లుతుంది. దీంతో పాటు వన్డే క్రికెట్‌లో అత్యధిక సిక్సర్లు (225) పైబడే కొట్టిన భారతీయ అటగాడు కూడా మహేంద్రుడే కావడం గమనార్హం. లక్ష్య ఛేదనలో 48 సార్లు నాటౌట్‌గా నిలిచిన మ్యాచ్‌ల్లో 46 సార్లు టీమిండియా విజయాన్ని నమోదు చేసుకోగా, కేవలం ఒక్కసారి మాత్రమే మ్యాచ్ ఓడిపోగా, మరోమ్యాచ్ టైగా ముగిసింది. వన్డే మ్యాచ్‌ల్లో 103.0 స్ట్రైకరేట్‌తో అందరికంటే ముందున్నాడు



పుజారా

రంజీ సెమీస్‌లో సౌరాష్ట్ర, విదర్భ

లక్నో : రంజీట్రోఫీ సెమీఫైనల్లోకి సౌరాష్ట్ర, విదర్భ జట్లు ప్రవేశించాయి. శనివారం ఐదోరోజు ఉత్తరప్రదేశ్ జట్టుపై సౌరాష్ట్ర ఆరు వికెట్ల తేడాతో గెలిచింది. మరో మ్యాచ్‌లో ఉత్తరాఖండ్‌పై విదర్భజట్టు ఇన్నింగ్స్ 115 పరుగుల తేడాతో గెలిచి సెమీస్‌కు చేరింది. రెండో ఇన్నింగ్స్‌లో సౌరాష్ట్ర జట్టు రెండు వికెట్ల నష్టానికి 195 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగి హర్విక్ దేశాయ్ లక్ష్యానికి దగ్గరగా తీసుకెళ్లి 116 వ్యక్తిగత పరుగుల వద్ద ఔటయ్యాడు. తరువాత బ్యాట్‌మెన్‌లు నయావాల్ పుజారా(67), జాక్‌సన్(73) పరుగులతో అజేయంగా నిలిచి 115.1 ఓవర్లలో 372 విజయలక్ష్యాన్ని పూర్తిచేశారు. ఈ మ్యాచ్‌లో అత్యధిక పరుగులు చేసిన సౌరాష్ట్ర బ్యాట్స్‌మెన హర్విక్ దేశాయ్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు.

నెట్ ప్రాక్టీస్‌లో ఆంధ్ర, కేరళ జట్లు



ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్


అండర్-19 కూచ్ బిహర్ ట్రోఫీలో భాగంగా ఆంధ్ర, కేరళ జట్లు నెట్ ప్రాక్టీస్‌లో పాల్గొన్నారు. ప్రకాశం జిల్లా ఒంగోలు సిఎస్‌ఆర్ శర్మ కళాశాల క్రీడామైదానంలో ఈనెల 21 నుండి 24 వరకు జరిగే అండర్-19 కూచ్ బిహర్ ట్రోఫీలో భాగంగా ఆంధ్ర, కేరళ జట్లు తలపడనున్నాయి. శనివారం ఒంగోలు చేరుకున్న ఆంధ్ర, కేరళ జట్లు నెట్స్ తీవ్రంగా శ్రమించారు. శనివారం ఉదయం ఆంధ్ర జట్టు క్రీడాకారులు బ్యాటింగ్, బౌలింగ్, వార్మప్ ఎక్సర్‌సైజలు చేపట్టారు. మధ్యాహ్నం కేరళ జట్టు క్రీడాకారులు బ్యాటింగ్, బౌలింగ్ సాధన చేశాయి. ఇరు జట్ల క్రీడాకారులను చూసేందుకు ఒంగోలు నగర క్రికెట్ అభిమానులు ఆసక్తి చూపారు. నెట్ ప్రాక్టీస్‌ను క్రికెట్ ప్రకాశం అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ నామినేని కిరణ్‌కుమార్, సిహెచ్ ప్రతాప్ కుమార్ పర్యవేక్షించారు.

22 నుండి ఆలిండియా జూనియర్ బ్యాడ్మింటన్ టోర్నీ

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ (విజయవాడ)

ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ - అమరావతి క్యాపిటల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సంయుక్తంగా ఆలిండియా జూనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను నిర్వహించనున్నట్లు ఎపి బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి సిహెచ్.రఘు కిరణ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ వై.రాజ శేఖర్ అన్నారు. తొలిసారిగా నిర్వహించనున్న ఈ టోర్నమెంట్ నగరానికి సమీపంలోని విజయవాడ క్లబ్‌లో ఈ నెల 22 నుండి 27వ తేదీ వరకు ఉంటుందన్నారు. బెంజిసర్కిల్ వద్ద ఉన్న అసోసియేషన్ కార్యాలయంలో శనివారం సాయంత్రం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ టోర్నమెంట్‌లో ప్రతిభ కనపరచిన క్రీడాకారులను భారత జూనియర్ బ్యాడ్మింటన్ టీమ్‌కు ఎంపిక చేస్తారని తెలిపారు. ఎంపికైన జట్టు జర్మన్ జూనియర్ ఇంటర్నేషనల్ టోర్నమెంట్ మార్చిలో జరుగుతుందని అందులో భారత జట్టు పాల్గొంటుందని అన్నారు. టోర్నీ విజేతలకు రూ.4 లక్షల నగదు పురస్కారం అందచేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 22, 23 తేదీల్లో క్వాలిఫైయింగ్ రౌండ్ జరుగుతుందన్నారు. మొత్తం 680 మంది క్రీడాకారులు పాల్గొననున్నారని పేర్కొన్నారు.

మెయిన్ డ్రా మ్యాచ్‌లు ఈనెల 24 నుండి జరుగుతాయని తెలిపారు. బాలుర సింగిల్స్‌లో 303, బాలురు డబుల్స్ 170, బాలికలు సింగిల్స్ 58, బాలికలు డబుల్స్ 83, మిక్స్‌డ్ డబుల్స్ 45 ఎంట్రీలు వచ్చాయని తెలిపారు. ఈనెల 24వ తేదీన మెయిన్ డ్రా టోర్నమెంట్‌ను విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శ్రీనివాస్ (నాని) ప్రారంభిస్తారన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు.



ఒసాకా (జపాన్)

ప్రి క్వార్టర్స్‌కు ఒసాకా, హెలెప్

ఆస్ట్రేలియన్ ఓపెన్

మెల్‌బోర్న్ : ఆస్ట్రేలియన్ ఓపెన్ మహిళల సింగిల్స్ ప్రి క్వార్టర్‌ఫైనల్లోకి టాప్‌సీడ్ హెలెప్, నాల్గోసీడ్ జపాన్‌కు చెందిన ఒసాకా ప్రవేశించారు. శనివారం జరిగిన నాల్గోరౌండ్ మ్యాచ్‌లో నంబర్‌వన్ సీడ్ హెలెప్(రొమేనియా) 6-2, 6-3తో వీనస్ విలియమ్స్(అమెరికా)ను చిత్తుచేసింది. మరోమ్యాచ్‌లో 4వ సీడ్ ఒసాకా 5-7, 6-4, 6-1తో హీస్(తైవాన్)పై చెమటోడ్చి నెగ్గింది. ఇతర పోటీల్లో ఆరోసీడ్ స్విటొలినా 4-6, 6-4, 7-5తో చైనాకు చెందిన జంగ్‌పై, 17వ సీడ్ కీస్(అమెరికా) 6-3, 6-2తో మెర్టెన్స్‌పై గెలిచారు. 18వ సీడ్ ముగురుజా(స్పెయిన్) 7-6(7-5), 6-2తో బెక్సింజీపై గెలిచి ప్రి క్వార్టర్స్‌ఫైనల్లోకి ప్రవేశించారు. పురుషుల సింగిల్స్‌లో నాల్గోసీడ్ జ్వెరేవ్ 6-3, 6-3, 6-2తో బౌల్ట్(ఆస్ట్రేలియా)పై, టాప్‌సీడ్ జకోవిచ్ 6-3, 6-4, 4-6, 6-0తో షపొవాలోవ్(ఇజ్రాయేల్)పై గెలిచారు. ఇతర పోటీల్లో 8వ సీడ్ నిషికోరి, 15వ సీడ్ మెద్వెదేవ్, బూస్టా, రోనిక్, కోరిక్‌లు ప్రత్యర్థులపై గెలిచి ప్రిక్వార్టర్‌ఫైనల్లోకి ప్రవేశించారు. ఇక 28వ సీడ్ పోవిల్లె(ఫ్రాన్స్) 7-6(7-3), 6-3, 6-7(10-12), 4-6, 6-3 హోరాహోరీపోరులో అన్‌సీడెడ్ పొప్రిన్(ఆస్ట్రేలియా)పై గెలిచాడు.

రెజ్లింగ్‌లో ఎపి సత్తా చాటాలి

నన్నయ ఇన్‌ఛార్జి విసి ఆచార్య రామకృష్ణారావు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం కార్పొరేషన్

తూర్పుగోదావరి జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యాన అక్నూ సహకారంతో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలు శనివారం ఆసక్తికరంగా సాగాయి. 16 ఏళ్లలోపు వయసు కలిగిన బాలికలు సబ్ జూనియర్ కేటగిరీలో, 19 ఏళ్లలోపు బాలికలు జూనియర్ కేటగిరీలకు ఎంపిక చేసి పోటీలను నిర్వహించారు. ఫ్రీస్టైల్‌లోని 10 వెయిటేజ్ కేటగిరీల్లో పోటీలు నిర్వహించనున్నారు. బాలురకు గ్రీక్ రోమన్ స్టైల్‌లోను 10 వెయిటేజ్ కేటగిరీల్లో పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాల నుంచి 450 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ పోటీలను ఆదికవి నన్నయ్య విసి రామకృష్ణారావు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. జాతీయ, అంతర్జాతీయస్థాయి రెజ్లింగ్ పోటీల్లో రాష్ట్ర జట్టు సత్తాచాటి, విజయపతాకాన్ని ఎగురవేయాలన్నారు.


సస్పెన్షన్‌ను ఎత్తివేయండి

పాలకుల కమిటీని కోరిన బిసిసిఐ అధ్యక్షుడు



న్యూఢిల్లీ: టీమిండియా ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యా, కెఎల్ రాహుల్‌లపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తి వేయాలని బిసిసిఐ అధ్యక్షుడు సికె ఖన్నా పాలకుల కమిటీకి శనివారం లేఖ రాశారు. పాండ్యా, రాహుల్ వివాదంపై పది రోజుల్లో ప్రత్యేక జనరల్ సమావేశం జరపడానికి ఆయన నిరాకరించారు. 'సుప్రీం కోర్టు ఈ వివాదాన్ని స్వీకరించి అంబుడ్స్‌మన్‌ను ఏర్పాటు చేసేవరకు ఈ విషయంలో ఎలాంటి సమావేశాలు జరపలేం అని చెప్పిన నేపథ్యంలో ఖన్నా స్పందించారు. ఇప్పటికే పాండ్యా, రాహుల్‌లు పొరపాటు చేశామని, సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని కోరడమే గాక, వారు క్షమాపణలు కూడా కోరిన విషయం తెలిసిందే. విచారణ పెండింగ్‌లో ఉన్నప్పటికీ వారిద్దరినీ ఇండియన్ జట్టులోకి తీసుకోవాలి. దీంతోపాటు మరికొన్ని రోజుల్లో న్యూజిలాండ్‌తో జరిగే మ్యాచ్‌లకూ వారిని అనుమతించాలి' అంటూ పాలకుల కమిటీ ఉన్నతాధికారులకు ఖన్నా లేఖ రాశారు.

అనుష్కపై నెటిజన్ల ఆగ్రహం



మెల్‌బోర్న్ : శనివారం ఆస్ట్రేలియా ఓపెన్ జరుగుతున్న మెల్‌బోర్న్ పార్క్‌ను విరుష్కా సందర్శించారు. ఈ సందర్భంగా ఈ జోడీ టెన్నిస్ దిగ్గజం రోజర్ ఫెడరర్‌ను కలిశారు. ఈ ఫొటోను యుఎస్ ఓపెన్ 'ముగ్గురు దిగ్గజాలు.. ఒక్క ఫొటో' అనే క్యాప్షన్‌తో ట్వీట్ చేసింది. ఇది చూసిన అభిమానులకు చిర్రెత్తుకొచ్చింది. దీంతో సోషల్ మీడియా వేదికగా నెటిజన్లు 'కోహ్లి, ఫెడరర్ సరసన ఉన్న అనుష్క దిగ్గజమా? మీరే చెప్పాలి.. కోహ్లి, ఫెడరర్!' అంటూ ఒకరు, 'ఓహో.. ఫెడరర్‌ను కలిస్తే లెజెండ్ అవుతామన్నమాట! అయితే నేను కూడా కలుస్తా!' అని మరొకరు సెటైరిక్‌గా కామెంట్ చేస్తున్నారు. ఇంకొందరైతే యూఎస్ ఓపెన్ అధికారులకు మతి దొబ్బినట్టుంది.. లేకుంటే అనుష్క లెజెండ్ ఏంటని ఘాటుగా కామెంట్ చేస్తున్నారు.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68